తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM ఒంగోలు : fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

25-4-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 83 పేజీలు: 12 వెల: 6.50



25-4pg2exHMNWJQE.qxd:25-4pg2exHMNWJQE.qxd 01/01/01 9:43 AM Page 1





గురువారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ముర్మును కలిసి పహల్గాం ఉగ్రదాడి వివరాల నివేదిక ఇస్తున్న హోంమంత్రి అమిత్‌షా, విదేశాంగమంత్రి జయశంకర్‌లు

# ప్రధాని మోడీ సభకు భారీ ఏర్పాట్లు

>> జంక్షన్, గోరంట్ల, లామ్‌తాడికొండ క్రాస్‌రోడ్లు, పెదపరిమి మీదుగా వచ్చేవారు ఇ6, ఎన్11, ఇ8, ఎన్10 రహదారుల ద్వారా వేదిక వద్దకు చేరతారు. నరసరావుపేట, సత్తెనపల్లి, అమరావతి, గుంటూరు, పెదమద్దూరు, వైకుంఠపురం, హరిశ్చంద్రపురం, దొండపాడు మీదుగా వచ్చేవారు ఇ3, ఎన్11, ఇ8 రహదారుల ద్వారా వేదిక వద్దకు చేరతారు.

**నేడు ఢిల్లీ వెళ్లి ప్రధాని మోడీని ఆహ్వానించనున్న చంద్రబాబు దంపతులు!**

సిఎం చంద్రబాబు శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. చంద్రబాబు వెంట ఆయన అర్ధాంగి నారా భువనేశ్వరి కూడా ఢిల్లీ వెళ్లనున్నారు. చంద్రబాబు దంపతులు రేపు మధ్యాహ్నం ఢిల్లీకి బయలుదేరి వెళతారు. అనంతరంసాయంత్రం 4:30 గంటలకు మోదీతో సమావేశం అవుతారు. మే 2వ తేదీని రాజధాని అమరావతిలో చేపట్టనున్న కార్యక్రమానికి ప్రధానిని అధికారికంగా ఆహ్వానించడమే ఈ భేటీ ప్రధాన అజెండాగా తెలుస్తోంది. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం కొలువుదీరిని తర్వాత అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సంకల్పించిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా మే 2వ తేదీన అమరావతిలో నిర్మాణ పనుల పునఃప్రారంభోత్సవ కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, పనులకు శంకుస్థాపన చేయాల్సిందిగా ప్రధాని మోదీని చంద్రబాబు రేపటి ఢిల్లీ పర్యటనలో కోరనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా సుమారు లక్ష కోట్ల రూపాయల విలువైన పనులకు శ్రీకారం చుట్టాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. అమరావతిలో జరగనున్న బహిరంగ సభకు సుమారు 5 లక్షల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నట్లు రాష్ట్ర మంత్రి పి.నారాయణ మీడియాకు వెల్లడించారు. సభా స్థలికి ప్రజలు సులభంగా చేరుకునేందుకు జాతీయ రహదారికి అనుసంధానంగా 8 రోడ్లను, వాహనాల పార్కింగ్ కోసం 11 విశాలమైన ప్రదేశాలను గుర్తించినట్లు ఆయన తెలిపారు. సభా ప్రాంగణంలో మొత్తం మూడు వేదికలను ఏర్పాటు చేయనున్నామని, ప్రధాన వేదికతో పాటు మరో వేదికపై రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులు, మహిళలు, రాజధాని పరిరక్షణ, ఉద్యమంలో అమరులైన వారి కుటుంబ సభ్యులు ఉంటారని మంత్రి నారాయణ వివరించారు. అంతేకాకుండా హెలిప్యాడ్ నుంచి సభా వేదిక వరకు సుమారు 1.1 కిలోమీటర్ల మేర ప్రధాని మోదీ రోడ్ షో కూడా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. చంద్రబాబు ఢిల్లీ పర్యటన, ప్రధానితో భేటీ అనంతరం మే 2 నాటి కార్యక్రమంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# పహల్గాం దాడికి నిరసనగా దేశవ్యాప్తంగా కొవ్వొత్తుల ర్యాలీ

## ఎఐసిసి వర్కింగ్ కమిటీ సమావేశంలో నిర్ణయం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 24:** జమ్ము కశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని పిరికిపంద చర్యగా కాంగ్రెస్ అభిప్రాయపడింది. ఇందులో పాకిస్థాన్ ప్రధాన సూత్రధారని దుయ్యబట్టింది. ఇది నేరుగా ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణించిన కాంగ్రెస్, ఉగ్రదాడిపై సమగ్ర విచారణ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఐక్యంగా ఉండాల్సిన ఇలాంటి సమయంలో విభజనను ప్రోత్సహించేలా బిజెపి వ్యవహరిస్తుందని విమర్శించింది. జమ్ము కశ్మీర్ ఉగ్రదాడి నేపథ్యంలో కాంగ్రెస్ అత్యున్నత విధాయక మండలి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశమైంది. ఉగ్రదాడిలో మరణించిన వారికి సంతాపం తెలుపుతూ తీర్మానాన్ని ఆమోదించింది. ఇందులో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో పాటు అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ, ఎంపీలు పాల్గొన్నారు. సీడబ్ల్యూసీ వివరాలను ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో 25న అంటే శుక్రవారం దేశవ్యాప్తంగా కొవ్వత్తులతో ర్యాలీ చేపట్టనున్నట్లు వెల్లడించారు. త్వరలో ప్రారంభమయ్యే అమర్ నాథ్ యాత్ర నేపథ్యంలో భక్తుల భద్రతపై దృష్టి సారించాలని సూచించారు. కాంగ్రెస్ డిమాండ్‌ను అంగీకరిస్తూ కేంద్ర ప్రభుత్వం అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ అంశం తీవ్రత దృష్ట్యా దీనికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా హాజరు కావాలని ఆశిస్తున్నాం. ఇది నేరుగా మన ఐక్యత, భద్రతపై దాడిగా భావించాలి. ఈ క్రమంలోనే దాడిపై అన్ని కోణాలపైనా సీడబ్ల్యూసీ సమావేశంలో చర్చించామని కాంగ్రెస్‌నేత పవన్ ఖేడా తెలిపారు. మరోవైపు జమ్మూకశ్మీర్ ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించింది. రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అధ్యక్షతన పార్లమెంటు భవనంలో ఈ భేటీ జరగనున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఉగ్రదాడి ఘటన, తీసుకున్న చర్యలను కేంద్ర ప్రభుత్వం వివరించనుంది. ఉగ్రదాడి ఘటనపై అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు డిమాండ్ చేసిన నేపథ్యంలో ఈ భేటీ జరగనుంది.

# పుణ్య స్నానానికి వెళ్లి ఇద్దరు మృతి..

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** పుణ్య స్నానానికి వెళ్లి ఇరువురు మృతి చెందినఘటన వెలుగులోకి వచ్చింది. ఏలేశ్వరం మండలంలోని ఎర్రవరం జాతీయ రహదారి సమీపంలో ఏలేరు కాలువలోకి స్నానానికి దిగి అమ్మమ్మ మనవడు మృతి చెందిన సంఘటన గురువారం తెలిసింది. ఈ మేరకు ఏలేశ్వరం ఎస్సై ఎన్. రామలింగేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రత్తిపాడు మండలం ప్రత్తిపాడు గ్రామానికి చెందిన అరటకోట్ల సత్యవతి (52) తన కూతురి కొడుకు ఆయన ఐదో తరగతి చదువుతున్న గోర్స వీర మనోజ్ (12)ను తీసుకుని బుధవారం సాయంత్రం ఏలేరు కాలువలో స్నానానికి దిగింది. ప్రమాదవశాస్తూ కాలువలో పడిఊపిరి ఆడక పోవడంతో ఇద్దరు మునిగి చనిపోయారని తెలిపారు.గురువారం సత్యవతి మృతదేహం నీటిలోతేలింది. స్థానికులుగుర్తించి గుర్తు తెలియని మృత దేహంగా పోలీసులకు ఫిర్యాదుచేశారు. కాలువ గట్టుపై ఇరువురి చెప్పులు ఉండడం వలన అనుమానం వచ్చి గాలింపు చర్యలు చేపట్టగా మనోజ్ మృతదేహం లభించింది. వీరి ఇంటి సమీపంలో ఉన్న గ్రామ దేవత ఉత్సవాలు ఉండడంతో పవిత్ర స్నానం చేసేందుకు ఏలేరు కాలువలో స్నానానికి బుధవారం సాయంత్రం వెళ్ళినట్టు కుమార్తె గోర్స రమణమ్మ తెలిపింది. రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్సై తెలిపారు.

# భారత్‌పైనా పాక్ ఆంక్షలు!

## జలయుద్ధాన్ని ప్రకటిస్తున్న భారత్: పాక్ ఆరోపణలు

**న్యూఢిల్లీ:** పెహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో వాఘా బోర్డర్‌ను మూసివేస్తున్నట్లు పాకిస్తాన్ ప్రకటించింది. నేషనల్ సెక్యూరిటీ కమిటీ(ఎన్ఎస్సీ) సమావేశం తర్వాత ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. కశ్మీర్‌లో జరిగిన దాడి తర్వాత భారత్ కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. దీంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న పాకిస్థాన్ అత్యవసరంగా ఎన్సీసీ మీటింగ్‌ను నిర్వహించింది. పాకిస్థాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్ ఆధ్వర్యంలో మీటింగ్ జరిగింది. ఆ భేటీలో టాప్ సివిల్, మిలిటరీ నేతలు పాల్గొన్నారు. పెహల్గామ్ ఘటన తర్వాత చోటుచేసుకుంటున్న పరిణామాలకు కౌంటర్ ఇచ్చేందుకు రెడీ అవుతున్నారు. పాక్ ప్రధాని కార్యాలయం తన ప్రకటనలో ప్రాంతీయ భద్రతా, జాతీయ భద్రతా పర్యావరణం గురించి పేర్కొన్నది. 1972లో కుదిరిన సిమ్లా ఒప్పందాన్ని సస్పెండ్ చేస్తున్నట్లు పాకిస్థాన్ ప్రకటించింది. దీంతో వాఘా బోర్డర్‌ను మూసివేశారు. పాక్ తీసుకున్న నిర్ణయాలు ఇవే. సింధూ జలాల ఒప్పందం రద్దును వ్యతిరేకించిన పాకిస్తాన్. నీటి మళ్లింపును యుద్ధ చర్యగా భావిస్తామని పేర్కొంది. వాఘా బోర్డర్ మూసివేస్తున్నట్లు తెలిపిన పాక్ సార్క్ వీసా మినహాయింపులు భారత్‌కు కూడా తాము రద్దుచేస్తున్నట్లుప్రకటించింది. పాక్‌లో ఉన్న భారతీయులు 48 గంటల్లో వెళ్లిపోవాలి. పాక్‌లో భారత హై కమీషన్ సభ్యుల సంఖ్య 30కి కుదిస్తున్నట్లు తెలిపింది. భారతీయ విమానాలకు తక్షణమే పాక్ ఎయిర్‌స్పేస్ మూసివేస్తున్నట్లు ప్రకటించిన పాక్ భారత్‌తో అన్ని రకాల వాణిజ్యం నిలిపివేస్తున్నట్లు తెలిపింది. పెహల్గామ్ దాడిలో తమ ప్రమేయం ఉన్నట్లు ఆధారాలు చూపాలని పాకిస్థాన్ కోరింది. ప్రపంచ దేశాలకు ఆ ఆధారాలను వెల్లడించాలని పాకిస్థాన్ డిప్యూటీ ప్రధాని, విదేశాంగ మంత్రి ఇషాక్ ధర్ తెలిపారు. ఇవాళ ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. రక్షణ శాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్, ఇతరులతో కలిసి మాట్లాడారు. శ్రీనగర్‌లోకి కొందరు విదేశీయులు ఆయుధాలతో ప్రవేశించారని, దానికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని డిప్యూటీ ప్రధాని దార్ తెలిపారు. భారత ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు ఆ వ్యక్తులను శ్రీనగర్‌లో దాచినట్లు పాక్ డిప్యూటీ పిఎం ఆరోపించారు. భారతీయ నిఘా సంస్థలు విదేశీయులకు సపోర్టు ఇస్తున్నాయని, ఆ విదేశీయులు భారత్‌కు ఐఈడీలు సరఫరా చేస్తున్నట్లు విదేశాంగ శాఖ మంత్రి పేర్కొన్నారు. ఒకవేళ భారత్ తమపై ఎలాంటి చర్యలకు దిగినా, దాన్ని ఎదుర్కొనేందుకు పాక్ సైనిక దళాలు సిద్ధంగా ఉన్నట్లు ఆయన చెప్పారు. సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేసి భారత్ జలయుద్ధానికి పాల్పడుతోందని వ్యాఖ్యానించింది. భారత్ నిర్ణయాన్ని చట్టవిరుద్ధమైన చర్యగా అభివర్ణించింది. ప్రపంచబ్యాంకు మధ్యవర్తిత్వంతో జరిగిన ఈ ఒప్పందం నుంచి భారత్ ఏకపక్షంగా బయటకు రాలేదని తెలిపింది. సింధూ జలాల్లోని ప్రతి నీటి బొట్టుపై తమకు హక్కు ఉందని వ్యాఖ్యానించింది. ఈ చర్యను చట్టబద్ధంగా సవాల్ చేస్తామని ప్రకటించింది.

# నిర్దాక్షిణ్యంగా ఏరివేయాల్సిందే

>> ఆచరిస్తారని అడిగి మరీ ఉగ్రవాదులు ఘోరంగా, కిరాతకంగా తుపాకీగుళ్లతో చంపేశారు. బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వడానికో ఇక్కడికి రాలేదు. ఆ కుటుంబాలకు, ఆ బిడ్డలకు తోడుగా ఉంటామని భరోసా కల్పించేందుకే తాను కావలికి రావడం జరిగిందన్నారు. గత పదేళ్లుగా కాశ్మీర్‌లో ప్రశాంత వాతావరణం ఉందని ఈ భరోసాతోనే పర్యాటకులు కాశ్మీర్ అందాలను చూసేందుకు వెళుతున్నారని పవన్‌కల్యాణ్ తెలిపారు. 1986-89 మధ్యకాలంలో సినిమా షూటింగ్‌ల కోసం తాను కాశ్మీర్‌కు ప్రతి సంవత్సరం వెళ్లేవాడినన్నారు. ఇలాంటి పరిస్థితులలో ఉగ్రవాదులు దారుణాలకు తెగబడడంతో వారిని పూర్తిస్థాయిలో ఏరివేయాల్సిన సమయం మళ్లీ ఆసన్నమైందన్నారు. ఉగ్రవాదుల దారుణాలపై మంగళగిరిలో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటుచేస్తారన్నారు. విశాఖపట్నానికి వెళ్లి అక్కడ పరామర్శించి వస్తానన్నారు. ఉగ్రవాదుల అణచివేతకు భారతప్రభుత్వం కఠినచర్యలు తీసుకుంటుందని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పష్టంచేశారు. ఈ సమావేశంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, ఆర్టీసి ఛైర్మన్ సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, జిల్లా కలెక్టర్ ఆనంద్, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## భారత్‌లో పాక్ హైకమిషన్‌వద్ద నిరసన ప్రదర్శన

**న్యూఢిల్లీ:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో భాగంగా దేశ రాజధాని ఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ వెలుపల భారీగా జనం గుమిగూడి నిరసన తెలిపారు. భారత్‌లో ఉగ్ర దాడులకు పాల్పడుతున్న ఆ దేశంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాక్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ భారీ నిరసన నేపథ్యంలో పాకిస్థాన్ హైకమిషన్ వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. భారీగా పోలీస్ బలగాలను మోహరించారు.

జాతీయ జెండాలను చేతపట్టి నిరసన చేస్తున్న జనాన్ని శాంతింపజేసేందుకు పోలీసులు ప్రయత్నించారు. కాగా, పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ మధ్య దౌత్య సంబంధాలు మరింతగా దెబ్బతిన్నాయి. పాకిస్థాన్ ప్రభుత్వ అధికారిక ఎక్స్ ఖాతా వినియోగాన్ని భారత్ నిలిపివేసింది. దశాబ్దాల నాటి సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేసింది. పాకిస్థాన్ దౌత్య సిబ్బందిని బహిష్కరించింది. భారత్, పాకిస్థాన్ హైకమిషన్లలోని సిబ్బంది సంఖ్యను 55 నుంచి 30కు తగ్గించింది.

మరోవైపు ఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ నుంచి రక్షణ, నౌకాదళం, వైమానిక సలహాదారులందరినీ భారత్ బహిష్కరించింది. వారంలోగా దేశం విడిచి వెళ్లాలని వారికి సూచించింది. అలాగే ఇస్లామాబాద్ లోని భారత హైకమిషన్ నుంచి సైనిక సలహాదారులను ఉపసంహరించింది. ఇరు దేశాల రాయబార కార్యాలయాల్లో సేవా సలహాదారులకు కేటాయించిన ఐదుగురు సహాయక సిబ్బందిని కూడా భారత్ రీకాల్ చేసింది.

# గోపి అరెస్ట్

>> రజినిపై కేసు నమోదైంది. ఈ నేపథ్యంలోనే గోపీని అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లో అతడిని ఎసిబి అధికారులు అదుపులోకి తీసుకున్నారు. క్రషర్ యజమానిని బెదిరించారని గోపీపై ఆరోపణలు రావడంతో అరెస్టు చేశారు. ఈ కేసులో అతడు ఏ3గా ఉన్నారు. గోపీని తదుపరి చర్యల నిమిత్తం ఏపీ తరలించనున్నట్లు సమాచారం. ఆయనను విచారణ అనంతరం రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరు పరిచే అవకాశం ఉంది.

## వారం - వర్జ్యం

తేది : 25-04-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
కృ.ద్వాదశి ఉ.11.45
పూర్వాభాద్ర ఉ.8.53
వర్జ్యం మ.3.34-సా.5.13
దు.ఉ.8.19-9.10, 2) మ.12.32-1.23
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** బంధువుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. జీవిత భాగస్వామి నుండి ధనలాభం.

**వృషభం:** ఆకస్మిక ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**మిథునం:** ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. పుణ్యక్షేత్రాలు సందర్శనం.

**కర్కాటకం :** కుటుంబ సభ్యుల నుండి సహాయ సహకారాలు అందిస్తారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం.

**సింహం:** వ్యవహారాలలో విజయం సాధిస్తారు. విందు వినోదాలు, శుభ కార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**కన్య :** గృహ నిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. జీవిత భాగస్వామి నుండి ధనలాభం పొందుతారు.

**తుల :** ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. ఉద్యోగాలు ఆశాజనకంగా ఉంటాయి. వస్తు సేకరణ.

**వృశ్చికం:** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ముఖ్యమైన పనులు నిదానంగా పూర్తిచేస్తారు.

**ధనుస్సు:** సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. శ్రమ తప్పదు. ఆధ్యాత్మిక చింతన.

**మకరం:** భూవివాదాలు తీరి నూతన ఒప్పందాల విషయంలో జాగ్రత్త అవసరం. ఉద్యోగాలలో చికాకులు.

**కుంభం:** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమించి ముందుకు సాగుతారు.

**మీనం :** ముఖ్యమైన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. సోదరులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



న్యూఢిల్లీలో గురువారం పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం అయిన దృశ్యం

# తిరుపతిలో హై అలర్ట్!

>>యాత్రికుల వసతి సముదాయాలు, స్టార్ హోటళ్లు, నగరశివార్లలోని స్టార్ హోటళ్లు, స్టేహోమ్‌లు, లాడ్జీలు ఇలా దాదాపు వెయ్యిమంది పోలీసులు తనిఖీల్లో నిమగ్నమయ్యారు. తిరుమలకు వచ్చే అలిపిరి తనిఖీ కేంద్రంలోనేగాక ఘాట్‌రోడ్ల మధ్యలోనూ, తిరుమలలోనూ యాత్రికుల వసతి సముదాయాలు, ఆర్టీసి బస్టాండు, పాపవినాశనం, గోగర్భం, పసుపుధార,కుమారధార జలాశయాల ప్రాజెక్టులు ఉన్న అటవీప్రాంతాలను జల్లెడ పడుతూన్నారు. అనంతపురం రేంజి డిఐజి బాజ్‌పేయి షిమోషి ఆదేశాలతో తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు నేతృత్వంలో అడిషనల్ ఎస్పీలు రవిమనోహరచారి. వెంకట్రావు, తిరుమల అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్, టిటిడి విఎస్ఒలు ఎన్టీవిరామ్‌కుమార్, అల్లంసురేంద్రలు నిశితంగా భక్తులను తనిఖీ చేస్తున్నారు. వాహనాల్లో వస్తున్న వారు ఎవరు, ఎక్కడ నుండి వచ్చారు, వారి ఆధార్‌కార్డులను పకడ్బందీగా తనిఖీ చేసి పంపుతున్నారు. ఉగ్రముప్పు పొంచి ఉందనే నిఘా వర్గాల హెచ్చరికలతో తనిఖీలు ముమ్మరం చేశారు. సాధారణంగానే మూడంచెల తనిఖీలు జురుగుతుంటాయి. ఈ హెచ్చరికల నేపథ్యంలో ముష్కరుల కోసం పోలీసులు జల్లెడపడుతున్నారు. తిరుమలకు వస్తున్న భక్తులను మాత్రం మరింతగా అలర్ట్‌గా తనిఖీ చేస్తున్నారు.అలిపిరి వద్దనుండే భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేయడంతోబాటు ఘాట్‌రోడ్లలో మధ్యలోనూ వాహనాల తనిఖీ జరగడం మరింతగా అప్రమత్తమయ్యారు. తిరుమల ఘాట్‌రోడ్లపై విజిలెన్స్ మరింత ఫోకస్ పెట్టింది. ఏ మాత్రం అనుమానం ఉన్నా వారి గుర్తింపుకార్డులు, ఆధార్‌కార్డులను ప్రత్యేక యాప్‌లద్వారా తనిఖీ చేస్తున్నారు.ఎవరైనా అనుమానంగా కనిపిస్తే విచారణ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. తిరుమలలో 90వేలమంది వరకు యాత్రికులు ఉంటున్నందున ప్రధాన ప్రాంతాలు, అతిథిగృహాలు, శ్రీవారి ఆలయం పరిసరాలు, ఆలయ మాఢవీధులుల్లో పోలీసులు, విజిలెన్స్ నిఘాతో బాటు ఆక్టోపస్ బలగాలు మొహరించి కాపలా కాస్తున్నారు. తిరుమలను గతంలో ఎన్నడూలేని విధంగా హైఅలర్ట్ జారీ చేశారు. ఎలాంటి అవాంఛనీయసంఘటనలు జరగకుండా, అనుమానితులను విచారణ చేసిన తరువాతే పంపాలని కూడా పోలీసు ఉన్నతాధికారులనుండి స్పష్టమైన ఆదేశాలందాయి.

# ఊహించని రీతిలో శిక్షిస్తాం

>> నరేంద్ర మోడీ కృతజ్ఞతలు తెలిపారు. మానవత్వాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ తమకు అండగా నిలిచారని అన్నారు. వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఉగ్రవాదంతో భారత ఐకమత్య స్ఫూర్తిని బద్దలుకొట్టలేరని మోడీ స్పష్టం చేశారు. ఉగ్రవాదుల స్వర్గధామాన్ని నిర్వీర్యం చేసే సమయం వచ్చింది. ఉగ్రమూకల వెన్నెముకను 140 కోట్లమంది ప్రజలు విరిచేస్తారని ప్రధాని గట్టిగా హెచ్చరించారు. ప్రతి ఉగ్రవాదిని గుర్తించి ట్రాక్‌చేసి శిక్షిస్తామని భారతీయులకు హామీ ఇస్తున్నానని మోడీ పేర్కొన్నారు. ఈ విపత్కర స్థితి ఎదుర్కొనేందుకు దేశం మొత్తం ఏకతాటిపై ఉందని అన్నారు. ఏప్రిల్ 22న పహల్గాంలోని ప్రముఖ పర్యటక ప్రాంతమైన బైసరన్‌లో ముష్కరులు జరిపిన దాడిలో 26 మంది మరణించిన విషయం తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చిన వారు పర్యటకులను చుట్టుముట్టి అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు ముష్కరులు.

# పహల్గాం దాడిపై విదేశీ మద్దతు కూడగడుతున్న భారత్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 24:** పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో జర్మనీ, జపాన్, పోలాండ్, బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా, ఖతర్‌తో సహా అనేక దేశాల రాయబారులతో విదేశాంగ మంత్రిత్వ శాఖ సౌత్ బ్లాక్‌లోని కార్యాలయంలో కీలక సమావేశం నిర్వహించింది. పహల్గాం దాడి ఘటన ఆయా దేశాల రాయబారులకు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వివరించారు. పాక్ అండతో ఉగ్రవాదులు ఘాతుకానికి పాల్పడ్డ తీరును ఆయా దేశాలకు వివరించి దాయాది దేశాన్ని ఏకాకిని చేసేదిశగా కేంద్రం రాయబారులతో సమావేశం ఏర్పాటు చేసింది. ప్రపంచ దేశాల ముందు పాకిస్తాన్‌ను ఎండగట్టేందుకు ఉగ్రదాదుల దాడిని ప్రపంచదేశాలకు వివరించే ప్రయత్నం చేసింది. చైనా, కెనడాతో సహా జీ20 దేశాలు, ఎంపిక చేసిన దేశాల రాయబారులకు పహల్గాం ఉగ్రవాద దాడి గురించి విదేశాంగ మంత్రిత్వ శాఖ వివరించింది. సమావేశం దాదాపు 30 నిమిషాల పాటు కొనసాగింది. పహల్గాంలో ఉగ్రవాదులు ఎలా మారణకాండ సృష్టించారో వివరించి.. అంతర్జాతీయంగా ఆయా దేశాల మద్దతును కూడగట్టేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఇదిలా ఉండగా.. బుధవారం అర్ధరాత్రి విదేశాంగ మంత్రిత్వ శాఖ పాకిస్తాన్ అత్యున్నత దౌత్యవేత్త సాద్ అహ్మద్‌ను సైతం పిలిపించిన విషయం తెలిసిందే. భారత ప్రభుత్వం ఆయనకు 'పర్సన్ నాన్ గ్రాటా' నోట్‌ను జారీ చేసింది. పర్సన నాన్ గ్రాటా అంటే ఒక దౌత్యవేత్త లేదంటే.. ఓ విదేశీ వ్యక్తికి ఒక నిర్దిష్ట దేశంలో ప్రవేశం లేదంటే.. బస నిరాకరించినట్లుగా అర్థం. భారతదేశం ఈ నోట్‌ను పాకిస్తాన్ దౌత్యవేత్తలకు అందజేసింది. వారంతా వారంలోగా భారత్‌ను విడిచి వెళ్లాల్సి ఉండనున్నది. దక్షిణ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. బుధవారం జరిగిన సీసీఎస్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్న విషయం తెలిసిందే. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ సహా ఇతర సీనియర్ మంత్రులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఉగ్రవాద దాడిని తీవ్రంగా పరిగణించింది. న్యూఢిల్లీలోని పాకిస్తాన్ హైకమిషన్‌లో నియామకమైన రక్షణ, నావికాదళం, వైమానిక దళ సలహాదారులను పర్సన నాన్ గ్రాటా గా ప్రకటించాలని సీసీఎస్ నిర్ణయించిందని విదేశాంగ కార్యదర్శి తెలిపారు. ఈ క్రమంలో ఆయా దౌత్యవేత్తలను వారం రోజుల్లోగా భారతదేశం విడిచి వెళ్లాలని ఆదేశించారు.

# విసిగా డాక్టర్ చంద్రశేఖర్

>> యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పదవిని ఇన్చార్జిలతో నడిపారు. కాగా సదరు వైస్ ఛాన్సలర్ పదవి విషయంలో రాష్ట్రంలోని ప్రముఖుల పేర్లు పరిశీలనలోకి వచ్చాయి. అయితే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక ఆసక్తితో డాక్టర్ చంద్రశేఖర్‌కు వైస్ ఛాన్సలర్‌గా అవకాశం ఇచ్చినట్లు సమాచారం. రాయలసీమకు చెందిన ఆయనకు వైస్ ఛాన్సలర్ పదవి ఇవ్వడంతో రాయలసీమలోని పలువురు నాయకులు, వైద్యులు, ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. రాయలసీమలోని పలు జిల్లాల్లో వైద్య సేవలు అందించిన ఆయన.. గత ప్రభుత్వ హయాంలో అన్ని అర్హతలు ఉన్నప్పటికీ అణచివేతకు గురయ్యారు. దీంతో ప్రస్తుత ప్రభుత్వం ఆయనకు న్యాయం చేసిందనే చర్చ జరుగుతోంది. ఆయన సేవలను గుర్తించి ఆయనకు వైస్ ఛాన్సలర్ పదవి ఇవ్వడం పట్ల డాక్టర్ చంద్రశేఖర్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌కు ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ పులాల చంద్రశేఖర్ 1960లో జన్మించారు. 1987లో చిత్తూరు జిల్లా రంగరాజపురంలో వైద్యునిగా ప్రస్థానం ప్రారంభించారు. తర్వాత అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర మెడికల్ కాలేజీలో ఏడు సంవత్సరాలు పనిచేశారు. అటు తరువాత కర్నూలు మెడికల్ కళాశాలలో వివిధ హోదాలలో పనిచేశారు. కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ గాను, కర్నూలు జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ గాను, అడిషనల్ డిఎంఈ గాను పనిచేసి 2023లో పదవీ విరమణ చేశారు. అనంతరం రీ అపాయింట్మెంట్ మేరకు కర్నూలు జనరల్ ఆస్పత్రికి కార్డియాలజీ విభాగం హెచ్ఓడిగా పనిచేస్తున్నారు.

# 26 నుంచి మత్స్యకార భరోసా

>> ఏళ్ల కిందటి వరకు బియ్యం ఇచ్చేవారు. ఆ తర్వాత నగదు అందిస్తూ వస్తున్నారు.

అర్హత కలిగిన వారికి మత్స్యకార భరోసా కింద రూ.20 వేల చొప్పున ఇవ్వనున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. ఇంజిన్ తెప్పకు ఆరుగురు, పెద్ద మర పడవలకు 8 మంది ఉంటారు. చేపల వేట నిషేధానికి సంబంధించి గ్రామాల వారీగా ఉద్యోగులకు సూచనలు చేశామని అధికారులు తెలిపారు. మత్స్యకారులు నిబంధనలు ఉల్లంఘించి చేపల వేటకు వెళ్తే కేసులు నమోదు చేయడంతోపాటు సంక్షేమ పథకాల లబ్ధికి దూరమవుతారని హెచ్చరించారు. ఈ నెల 26న అమరావతి నుంచి విశాఖ మీదుగా బుడగట్లపాలెం వెళ్లనున్న సిఎం మత్స్యకారులకు భృతిని అందజేసి వారితో ముఖాముఖి నిర్వహించనున్నారు. ప్రజావేదిక నిర్వహణతో పాటు పార్టీ నేతలతోనూ సిఎం చంద్రబాబు సమావేశం కానున్నారు. సాయంత్రం తిరిగి విశాఖ మీదుగా అమరావతికి ముఖ్యమంత్రి రానున్నారు.

# మానవీయ కోణం ప్రధానం

>> దోహదపడుతుంది. రాష్ట్రంలో ఈ అంశంపై ఇప్పటికే 200 లకు పైగా కెపాసిటీ బిల్డింగ్ శిక్షణా కార్యక్రమాలను నిర్వహించి 9000 మందికి పైగా అధికారులకు, సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగింది. ప్రతి ప్రభుత్వ శాఖలోను నూతన ఆలోచలను వెలికి తీసేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఐ) మరియు సంబంధిత సాంకేతికతలు వినియోగపడతాయి.

**రెండు రోజుల పాటు వర్క్‌షాప్**

రెండు రోజుల పాటు జరిగే వర్క్‌షాప్‌లో గుడ్ గవర్నెన్స్ కోసం ఎఐ సహా నూతన టెక్నాలజీ వినియోగం, పౌర సేవల్లో మెరుగైన ఫలితాలు సాధించడంపై ప్రధానంగా చర్చ జరుగుతుంది. ఎఐ, ఎంఎల్, డీఎల్, చాట్ జీపీటీ, జెమిని, డేటా డ్రివెన్, ఎవిడెన్స్ బేస్డ్ గవర్నెన్స్, ఏఐ ప్లేబుక్, ఏఐ బేస్డ్ పైలెట్ ఐడియాస్ వంటి అంశాలపై ప్రత్యేక సెషన్స్ జరుగుతాయి. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పౌర సేవల్లో టెక్నాలజీ వాడకం, ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాలు, వచ్చే ఫలితాలపై కేస్ స్టడీస్‌ను అధికారులు పరిశీలిస్తారు. ఏయే విభాగాల్లో ఎటువంటి సాంకేతికను వినియోగించవచ్చు, ప్రస్తుతం ఉన్న సమాచారం ఆధారంగా సేవల్ని ఎలా విస్తృత పరచవచ్చు అనే దానిపై ప్రజంటేషన్ ద్వారా నిపుణులు విశ్లేషిస్తారు. వ్యవసాయం, విద్య, వైద్య, పట్టణాభివృద్ధి సహా వివిధ రంగాల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగాన్ని వివరిస్తారు. వర్క్‌షాప్‌లో మొదటిరోజు కార్యదర్శులు హాజరుకాగా, రెండోరోజు విభాగాధిపతులు పాల్గొంటారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌సంబంధిత సాంకేతికతలపై నిర్వహిస్తున్న ఈ రెండు రోజుల వర్క్‌షాపు మంచి ప్రయత్నం అన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో సాంకేతిక వినియోగం మరియు కృత్రిమ మేథ ద్వారా సకాలంలో ప్రజలకు ఉత్తమమైన సేవలు అందజేసేందుకు ఈ వర్క్‌షాపు దోహదపడుతుంది. రాష్ట్రంలో ఈ అంశంపై ఇప్పటికే 200 లకు పైగా కెపాసిటీ బిల్డింగ్ శిక్షణా కార్యక్రమాలను నిర్వహించి 9000 మందికి పైగా అధికారులకు, సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగింది. ప్రతి ప్రభుత్వ శాఖలోను నూతన ఆలోచలను వెలికి తీసేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌సంబంధిత సాంకేతికతలు వినియోగపడతాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి ఐటి కార్యదర్శి, లీనిగ్ర్ద్రీగి మాజీ సెక్రటరీ ఆర్.చంద్రశేఖర్ మాట్లాడుతూ.దేశంలోనే తొలిసారిగా 1996లో ఐటి గురించిన మాట్లాడిన ముఖ్యమంత్రి ఒక్క చంద్రబాబు నాయుడు మాత్రమే అన్నారు.రాష్ట్ర స్థాయిలో విజనరీ లీడర్షిప్ ఉండటంతోనే ఇటు వంటి ఇనిషియేటివ్ లకు అవకాశం కలిగింది. గుడ్ గవర్నెన్సులో భాగంగా ప్రభుత్వ శాఖల్లో కృత్రిమ మేథ మరియు సాంకేతికత వహించే కీలకత పాత్రను ఆయన వివరించారు..ఈ వర్క్‌షాపు ప్రారంభానికి స్వాగతం పలికిన కాటమనేని భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల ద్వారా నాణ్యమైన సేవలను ప్రజలకు అందజేసేందుకు ఈ వర్క్‌షాపు ఎంతో దోహదపడుతుందన్నారు. శిక్షణ అనేది నిరంతరమైన ప్రక్రియ అని, దాదాపు 300కు పైగా యూజ్ కేసులను ఈ వర్క్‌షాపులో వివరించడం జరుగుతుందన్నారు. టూ వే కమ్యునికేషన్ విధానంలో ఈ వర్క్‌షాపు నిర్వహించడం జరుగుతుందని, అధికారులకు తలెత్తే సందేహాలను, సమస్యలను నివృత్తి పర్చుకునేందుకు ఈ వర్క్‌షాపు ఎంతగానో దోహదపడుతుంది, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ వర్క్‌షాప్‌కు సిఎస్, డిజిపి, వివిధ శాఖల అధికారులు, కేంద్ర ఐటీ శాఖ మాజీ సెక్రటరీ చంద్రశేఖర్,వాద్వాని సెంటర్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ సీఈవో ప్రకాష్ కుమార్, డబ్ల్యుజీడీటీ డీన్ కమల్ దాస్ హాజరయ్యారు .

25-4Pg3exHMNWJQE.qxd:25-4Pg3exHMNWJQE.qxd 01/01/01 9:46 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఒంగోలు

: fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

25-4-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 83 పేజీలు: 12 వెల: 6.50


భారత్‌పైనా పాక్ ఆంక్షలు 2లో

పహల్గాం దాడికి నిరసనగా దేశవ్యాప్తంగా కొవ్వొత్తుల ర్యాలీ: కాంగ్రెస్



## ఉగ్రముష్కరులు ఊహించని రీతిలో శిక్షిస్తాం

### ప్రధానిమోడీ హెచ్చరికలు

**మధుబని(బీహార్), ఏప్రిల్ 24:** పహల్గాంలో ఉగ్రదాడికి పాల్పడ్డ ముష్కరులకు ఊహించని రీతిలో శిక్షిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరించారు. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకలిస్తామని, వారిని మట్టిలో కలిపి సమయం ఆసన్నమైందన్నారు. ఇది పర్యటకులపై జరిగిన దాడి కాదని, భారత్ ఆత్మపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ప్రతి ఉగ్రవాదిని గుర్తించి, వెంటాడి భారత్ హతమారుస్తుందని స్పష్టం చేశారు. గురువారం బిహార్ మధుబనిలో పంచాయతీరాజ్ దినోత్సవంలో పాల్గొన్న మోడీ, పహల్గాం ఉగ్రదాడిపై తొలిసారి మాట్లాడారు. ఉగ్రవాదులకు కలలో కూడా ఊహించని శిక్ష విధిస్తామని హెచ్చరించారు. ఉగ్రదాడికి పాల్పడిన వారు భారీ మూల్యం చెల్లించుకుంటారని పేర్కొన్నారు. తొలుత తన ప్రసంగం ఆరంభంలో పహల్గాం మృతులకు ప్రధాని నివాళులర్పించారు. మోడీతో పాటు సభలోని వారంతా ఒక నిమిషం పాటు మౌనం పాటించి అంజలి ఘటించారు.

కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు యావత్ దేశం అండగా ఉందని మోడీ తెలిపారు. క్షతగాత్రులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. ఉగ్రదాడి కారణంగా ఓ తల్లి కుమారుడిని కోల్పోయిందని, ఓ సోదరికి జీవిత భాగస్వామి దూరమయ్యాడని అన్నారు. కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు ప్రతి ఒక్కరిలోనూ బాధ, ఆగ్రహం ఉన్నాయని చెప్పారు. బాధితులకు న్యాయం చేసేందుకు ప్రతి ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు దేశం మొత్తం దృఢ సంకల్పంతో ఉందని చెప్పారు. ఉగ్రమూకల వెన్నెముకను 140 కోట్ల మంది విరిచేస్తారని మోడీ హెచ్చరించారు. ఏఉగ్రవాది ఎక్కడ నక్కినాసరే వెతికి మరీ శిక్షిస్తామని ప్రధానిమోడీ నొక్కిచెప్పారు. ఉగ్రవాదులకు, వారికి మద్దతిస్తున్నవారికి కలలోకూడా ఊహించనివిధంగా కఠిన శిక్ష విధిస్తామన్నారు. అదే సమయంలో భారత్‌కు అండగా నిలిచిన దేశాలకు ప్రధాని >>2

# కృత్రిమ మేథ వినియోగంలో మానవీయ కోణం ముఖ్యం

## టెక్నాలజీ వినియోగంతో రియల్ టైమ్‌లోసేవలు డెలివరీ

### స్మార్ట్ పాలనకు, ప్రాధాన్యం.. త్వరలో భారీ డేటా లేక్: సిఎం చంద్రబాబు



**అమరావతి, ఏప్రిల్ 24 :** పాలనలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(కృతిమ మేధస్సు)కు ప్రాధాన్యత ఇస్తూనే, ప్రజలకు సేవల విషయంలో మానవీయ కోణం చూపాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఏఐ ఆధారిత స్మార్ట్ వ్యవస్థ ఏర్పాటుతో రియల్ టైమ్‌లో సేవలు అందించవచ్చని అన్నారు. ఇందుకోసం పాత విధానాల స్థానంలో నూతన సాంకేతికతను ప్రవేశ పెట్టాల్సి ఉందన్నారు. టెక్నాలజీ అనేది ప్రజల కోసం ఉపయోగపడాలని... రాష్ట్రంలో భారీ డేటా లేక్‌ను ఏర్పాటు చేయడంపై దృష్టి పెట్టామని ముఖ్యమంత్రి అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అంశంపై గురువారం సచివాలయంలో ఉన్నతాధికారులతో జరిగిన వర్క్‌షాప్‌ను ప్రారంభించి, ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఇతర ఎమర్జింగ్ టెక్నాలజీల ఆవశ్యకత, పాలనలో వాటి వినియోగంపైన ముఖ్యమంత్రి మార్గనిర్దేశం చేశారు. 30 ఏళ్లనాడు చేసిన ప్రయత్నంతో నేడు ఎపి టెక్నాలజీలో కీలకంగా ముందుందని ప్రస్తావించారు. మన ప్రభుత్వ వ్యవస్థల్లో మేథాసంపత్తి ఉన్నవారు ఉన్నప్పటికీ ఇంకా పాత విధానాలు అనుసరిస్తున్నారన్నారు. పాలనలో తీరు మారాలన్నారు. వేగంగా భూరికార్డుల డిజిటలైజేషన్ జరగాలన్నారు.ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతుల్లో అధికంగా 75 శాతం భూసంబంధితమైనవే ఉన్నాయని, ఈ సమస్య పరిష్కారానికి త్వరితగతిన భూ రికార్డుల డిజిటలైజేషన్ చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఒకప్పుడు ఇస్రో ఉపగ్రహ ప్రయోగాలను ఆశ్చర్యంగా చూశామని, ఇప్పుడు మన స్టార్టప్‌లు రూ.30 కోట్లతో ఉపగ్రహాలను తయారు చేస్తున్నాయని, దీంతో ప్రపంచం మనవైపు గర్వంగా చూస్తోందన్నారు. ఈ వర్క్‌షాప్ దేశానికి ఒక నమూనాగా నిలుస్తుందని, డిజిటల్, డైనమిక్, ప్రజల కోసం పని చేసే పాలనకు ఇది ఆరంభమని ముఖ్యమంత్రి అన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంబంధిత సాంకేతికతలపై నిర్వహిస్తున్న ఈ రెండు రోజుల వర్కుషాపు మంచి ప్రయత్నయం అన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో సాంకేతిక వినియోగం మరియు కృత్రిమ మేథ ద్వారా సకాలంలో ప్రజలకు ఉత్తమమైన సేవలు అందజేసేందుకు ఈ వర్కుషాపు >>2

## ప్రధాని మోడీ సభకు భారీ ఏర్పాట్లు

### ఢిల్లీకి వెళ్లి ఆహ్వానించనున్న సిఎం చంద్రబాబు దంపతులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

**విజయవాడ,ఏప్రిల్24,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధాని నరేంద్ర మోడీ అమరావతి పర్యటన షెడ్యూల్ మే 2వ తేదీన ఖరారైంది. ఈ క్రమంలో పర్యటన ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. 15 నిమిషాల పటు రోడ్డుషో, గంట పాటు సాగే ఈ పర్యటనకు అమరావతి చరిత్ర తెలిపే పెవిలియన్ ప్రత్యేక ఆకర్షణ కానుంది. ప్రధాని సభకు చేరుకునేందుకు దాదాపు 8 మార్గాలను గుర్తించారు. దాదాపు లక్ష కోట్ల రూపాయలు విలువ చేసే ప్రాజెక్ట్ పనులకు మోడీ శంకుస్థాపన చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ముందుగా రాజధాని పనుల పునర్నిర్మాణ పనులకు ప్రధాని శంకుస్థాపన చేస్తారు. ఈ క్రమంలో అమరావతి పర్యటనకు ప్రధానిని ఆహ్వానించేందుకు సీఎం చంద్రబాబు శుక్రవారం ఢిల్లీ వెళ్లనున్నారు.

**పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన:**

మే 2న మధ్యాహ్నం 3 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి ప్రధాని చేరుకుని హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 3.30 గంటలకు అమరావతిలోని హెలిప్యాడ్‌కి వస్తారు. అక్కడి నుంచి ప్రధాన వేదిక వరకు 1.1 కి.మీ. మేర 15 నిమిషాలపాటు రోడ్డు షోలో పాల్గొంటారు. 3.45 గంటల నుంచి 4 గంటల వరకు అమరావతి పెవిలియన్‌ను సందర్శిస్తారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు సభ జరుగుతుంది. అనంతరం అమరావతి పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. సభ అనంతరం అక్కడి నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని 5.20కి గన్నవరం నుంచి ఢిల్లీకి వెళతారు.

ప్రధాని సభ కోసం 3 వేదికలు సిద్ధం చేస్తున్నారు. ప్రధాన వేదికపై మోడీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ సహా మొత్తం 20 మంది ఆసీనులవుతారు. మిగతా వీవీఐపీల కోసం మరో వేదిక ఏర్పాటు చేశారు. దానిపై 100మందిఉంటారు. వీటితోపాటు సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రత్యేకంగా ఒక వేదికఉంటుంది. అమరావతి చరిత్ర, సాంస్కృతిక ప్రాధాన్యం, నిర్మాణ ప్రణాళిక, భవిష్యత్ కార్యాచరణ, భూసమీకరణ విధానం వంటి అంశాల్ని ప్రధానికి వివరించేందుకు ప్రధాన వేదికకు వెనకవైపు అమరావతి పెవిలియన్ ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఇటు విజయవాడ, అటు గుంటూరు, తెనాలి, నరసరావుపేట, సత్తెనపల్లి మీదుగా ప్రధాని సభకు చేరుకునేందుకు 8 మార్గాలను గుర్తించారు. మొత్తం 9 పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు. ప్రముఖులు ప్రకాశం బ్యారేజీ, ఉండవల్లి, రాజధానిలోని సీడ్‌యాక్సెస్ రోడ్డు, ఎన్10 రహదారుల మీదుగా వేదిక వద్దకు చేరుకుంటారు. హైదరాబాద్, ఏలూరు, విజయవాడ నుంచి వచ్చేవారు జాతీయ రహదారి బైపాస్ బ్రిడ్జిమీదుగా రాజధానిలోకి ప్రవేశించి ఇ8, ఎన్8 రహదారుల ద్వారా వద్దకు చేరతారు. విజయవాడ నుంచి కనకదుర్గ వారధి, తాడేపల్లి మీదుగా వచ్చేవారు భారతమాత విగ్రహం, ఉండవల్లి సెంటర్, కృష్ణాయపాలెం మీదుగా ఈ8, ఎన్9 రహదారుల్లోకి ప్రవేశించి వేదిక వద్దకు చేరతారు. గుంటూరు, తెనాలి, మంగళగిరి, ఎర్రబాలెం, కృష్ణాయపాలెం మీదుగా వచ్చేవారు ఇ8, ఎన్9 రహదారుల్లోకి ప్రవేశించి వేదిక వద్దకు చేరతారు. కాజా టోల్‌ప్లాజా సమీపంలోని మురుగన్ హోటల్‌వద్ద ఎన్‌హెచ్16 సర్వీసు రోడ్డులోంచి, ఎన్‌హెచ్ బైపాస్ జంక్షన్, నిడమర్రు, కురగల్లు మీదుగా ఎన్9 రహదారిలోకి ప్రవేశిస్తారు. గుంటూరు అమరావతి రోడ్డు, ఐఆర్ఆర్ >>2

## ఎసిబి వలలో విద్యుత్ ఎఇ



**మక్కువ ( పార్వతీపురం మన్యం జిల్లా ) :** ఏప్రిల్ 24 ప్రభాతవార్త: అవినీతి నిరోధక శాఖ వలలో మక్కువ మండల విద్యుత్ ఎఇ జి జోగినాయుడు చిక్కారు. అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ బి.వి.ఎస్.ఎస్. రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం విజయనగరానికి చెందిన రైతు బి. నరసింహరాజు (74) మక్కువ మండలంలో నగుళ్ళకు సమీపాన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే పదిహేడు వేలు ఇస్తే గాని విద్యుత్ కనెక్షన్ ఇవ్వనని జోగి నాయుడు భీష్మించాడు. ఈ నేపథ్యంలో సదరు రైతు విజయనగరంలోని ఎసిబి అధికారులను ఆశ్రయించారు. ఈ మేరకు ఈనెల 22వ తారీఖున ఫిర్యాదు కూడా చేశారు. ఈక్రమంలో ఎసిబి అధికారులు కేసు నమోదు చేసి గురువారం సాయంత్రం ఏడు గంటలకు స్థానిక విద్యుత్ కార్యాలయంలోనే పదిహేడు వేల లంచం పుచ్చుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకు న్నారు. అనంతరం డీ ఎస్పీ మాట్లాడుతూ జోగి నాయుడిని ఎసిబి కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు. ఈ దాడిలో ఎసిబికి చెందిన శ్రీకాకుళం , విజయనగరం సిఐలు మహేష్, భాస్కరరావు, ఎస్సై వాసు, నారాయణతో పాటు సిబ్బంది కూడా పాల్గొన్నారు.

## రాష్ట్రపతి ముర్ముతో అమిత్‌షా, జైశంకర్‌భేటీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 24:** పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ పాక్‌మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. పహల్గాంలో 26 మంది భారతీయుల్ని ఉగ్రవాదులు కిరాతకంగా కాల్చి చంపిన ఘటనను అత్యంత తీవ్రంగా పరిగణించిన కేంద్రం పాక్‌తో సింధునదీజలాల ఒప్పందం తక్షణమే నిలిపి వేస్తున్నట్లు ప్రకటించింది. పాక్ జాతీయులకు అన్న కేటగిరీల వీసాలు రద్దుచేస్తున్నట్లు కూడా ప్రకటించింది. ఇందుకు ప్రతిగా పాక్‌సైతం భారత విమానాలకు గగనతలాన్ని మూసి వేయడం వంటి చర్యలు తీసుకుంది. ఇరుదేశాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలోకేంద్ర హోంమంత్రి అమిత్‌షా కేంద్ర విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీకావడం కీలక ప్రాధాన్యతను సంతరించుకుంది. పహల్గాం ఉగ్రదాడికి సంబంధించిన పూర్తి వివరాలను ఆమెకు వివరించినట్లు సమాచారం. ఈ భేటీ ఫోటోలను రాష్ట్రపతి తన ఎక్స్‌ఖాతాలో పోస్టుచేసారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత విదేశాంగశాఖ చైనా, కెనడాతో సహా జి20 దేశాల ఎంపికచేసిన రాయబారులతో సమావేశం నిర్వహించింది. ఈ భేటీ సుమారు 30 నిమిషాల పాటుకొనసాగినట్లు సమాచారం.



## ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ విసిగా డాక్టర్ చంద్రశేఖర్

**కర్నూలు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా కర్నూలుకు చెందిన ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పులాల చంద్రశేఖర్ ను నియమించారు. ఆ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆయన ఈరోజు నుంచి మూడు సంవత్సరాల పాటు ఆ పదవిలో కొనసాగనున్నారు. గత కొంత కాలంగా ఖాళీగా ఉన్న హెల్త్ >>2

## మాజీ మంత్రి విడదల రజిని మరిది గోపి అరెస్ట్

**విజయవాడ,ఏప్రిల్ 23,ప్రభాతవార్త ప్రతినిధి:** వైఎస్సార్సీకి చెందిన మాజీ మంత్రి విడదల రజిని మరిది గోపిని ఎసిబి అధికారులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఆయన్ను అరెస్టుచేసి విజయవాడకు తరలిస్తున్నారు. యడ్లపాడులో కంకర క్వారీ యజమానులను బెదిరించి డబ్బులు వసూలు చేశారని గోపీతో పాటు విడదల >>2

## ఉగ్రవాదులను నిర్దాక్షిణ్యంగా ఏరివేయాల్సిందే

### ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



గురువారం కావలిలో మధుసూధన్ భౌతిక కాయంవద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్. చిత్రంలో మంత్రి నాదెండ్ల

**కావలి (నెల్లూరు), ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** భారతదేశంలో ఉగ్రవాదులు ఎక్కడున్నా నిర్దాక్షిణ్యంగా ఏరివేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. కాశ్మీర్ పహల్గాం ఉగ్రవాదుల దాడిలో అశువులుబాసిన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి ఆనాలవారివీధిలోని నివాసంలో సోమిశెట్టి మధుసూధన్ భౌతికకాయాన్ని గురువారం డిప్యూటి సిఎం పవన్‌కల్యాణ్ సందర్శించి నివాళులర్పించారు. భౌతికకాయంపై పూలమాల ఉంచారు. భార్య, బిడ్డలను ఓదార్చారు. ఇద్దరు పిల్లలను అక్కునచేర్చుకుని నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. దాదాపు గంట పదినిముషాలపాటు కుటుంబ సభ్యులతో మాట్లాడి జరిగిన దారుణాన్ని అడిగి తెలుసుకుని దిగ్భ్రాంతికి గురయ్యారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు.

మధుసూధన్ దారుణ హత్యోదంతం అత్యంత హృదయవిదారక సంఘటన అని ఆందోళన వ్యక్తంచేశారు. ఉగ్రవాదులు చేసినదాడిని భారతదేశం మర్చిపోదన్నారు. బాధిత కుటుంబసభ్యుల బాధ, వారు అనుభవిస్తున్న మానసిక క్షోభ మాటల్లో చెప్పనలవికాదన్నారు. మాటలు రావడంలేదని అంటూ భావోద్వేగానికి గురయ్యారు. జరిగినసంఘటనను తలచుకుంటే తనకడుపు రగిలిపోతుందని తెలిపారు. పర్యాటకులను మీది ఏమతంఅని, ఏ ధర్మం >>2



## రారెత్తిస్తున్న ఎండలు

**విజయవాడ,ఏప్రిల్24,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు మండుతున్నాయి.రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు గురువారం 43 డిగ్రీలు పైనే ఉంటున్నాయి. విపరీతమైన ఉక్కపోత అధిక ఉష్ణోగ్రత తోపాటు పెద్దయెత్తున వడగాడ్పులు వీస్తున్నాయి. రాష్ట్రంలో అత్యధికంగా బుధవారం నంద్యాల జిల్లా గోనవరంలో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ నెలలో ప్రస్తుతం నమోదైన ఉష్ణోగ్రతే అత్యధికమని ఈ మేరకు ఆ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రకాశం వైఎస్ఆర్ కడప జిల్లా, కర్నూలు, పల్నాడు జిల్లా నెల్లూరు జిల్లా, ఎన్టీఆర్ జిల్లా, శ్రీకాకుళం,గుంటూరు, ఏలూరు,కాకినాడ జిల్లాలో ఇప్పటి వరకు 45డిగ్రీల చొప్పున సగటు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అంతేకాకుండా వైఎస్ఆర్ జిల్లాలో 28 ప్రాంతాలు, నంద్యాలలో 22, ప్రకాశంలో 17, పల్నాడు 14, కర్నూలు 10, ఇతర చోట్లతో కలుపుకుని 135 ప్రాంతాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు కూర్మనాథ్ తెలిపారు. గురువారం 30 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, మరో 29 మండలాల్లో వడగాడ్పులు ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొన్నారు.

## పహల్గామ్ ఉగ్ర దాడితో తిరుమల, తిరుపతిలో హై అలర్ట్!

### తిరుమల ఘాట్‌లో ఆకస్మిక తనిఖీలు



అలిపిరి టోల్‌గేట్‌వద్ద వాహనాల తనిఖీలు చేస్తున్న దృశ్యం

**తిరుమల, ఏప్రిల్ 24ప్రభాతవార్తప్రతినిధి:** జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రదాడితో ప్రసిద్ధ హిందూపుణ్యక్షేత్రం తిరుమల, తిరుపతిలో కేంద్ర నిఘావర్గాలు హైఅలర్ట్ ప్రకటించారు. దీంతో ఉన్నఫళంగా బుధవారం అర్ధరాత్రి నుండి తిరుపతి, తిరుమలలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. అలిపిరి తనిఖీ కేంద్రంతోబాటు తిరుమల రెండు, మొదటిఘాట్‌రోడ్లులో పలు చోట్ల ,లింకురోడ్డు వద్ద తిరుమల పోలీసులు, టిటిడి విజిలెన్స్ భద్రత సిబ్బంది ఒక్కసారిగా రోడ్లపైకి చేరుకుని ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు.

తెల్లవారుజామున నుండి గురువారం రాత్రి వరకు ఈ తనిఖీలు కొనసాగాయి. పహల్గామ్‌లో ఉగ్రవాదులు దాడి చేసి దేశంలోని ప్రధాన ప్రాంతాలకు రావచ్చనే అనుమానాలతో తిరుమల,తిరుపతిలో పోలీసు అధికారులు హైఅలర్ట్ ప్రకటించి ఎక్కడికక్కడ, ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా బస్టాండులు, రైల్వేస్టేషన్, విమానాశ్రయం, >>2

## 26 నుంచి మత్స్యకార భరోసా

**విజయవాడ,ఏప్రిల్24,ప్రభాతవార్తప్రతినిధి:** మత్స్యకార భరోసాను ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు సిఎం చంద్రబాబు వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి ఈ కార్యక్రమాన్ని సిఎం లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి మత్స్యకారులకు చేపల వేట నిషేధ సమయంలో ఇచ్చే భృతిని స్వయంగా సిఎం అందజేయనున్నారు. 'ఎక్స్' వేదికగా సిఎం చంద్రబాబు ఈ విషయం వివరించారు. రూ.20 వేలు భృతి ఇస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచారు. ఇప్పటికే ప్రభుత్వం మంత్రివర్గంలో ఆమోదించి ఉత్తర్వులు జారీ చేసింది.రొయ్యలు, చేపలు గుడ్లు పెట్టి సంతానోత్పత్తి చేస్తాయి. ఇందుకు 2 నెలల సమయం పడుతుంది. తద్వారా ఇవి మత్స్యకారుల ఉపాధికి దారి చూపుతాయి. ఈ కారణంతోనే ఏటా చేపల నిషేధం అమలులో ఉంటుంది. ఈ సమయంలో మర, ఇంజిన్ బోట్లు వేటకు దూరంగా ఉండాలి. కర్ర తెప్పలకు ఎలాంటి ఆంక్షలు ఉండవు. మత్స్యకారులు నిబంధనలు అతిక్రమించకుండా అధికార యంత్రాంగం పర్యవేక్షణ చేస్తుంది. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు 15 >>2

వార్త

నేరం చేసిన వాడిని శిక్షించడమే ప్రధానం కాదు. ఆ నేరం చేయడానికి ఏ పరిస్థితులు అతడ్ని పురికొల్పాయో వాటిని తొలగించడం ప్రధానం.

-ఎమ్.ఎస్.రాయ్

# తెలుగును నిర్లక్ష్యం చేయొద్దు

మాతృభాషను సంరక్షించుకోవాల్సిన అవసరం, ఆవశ్యకత గురించి పెద్దలు పదేపదే చెబుతుంటారు. అమ్మభాషలో ఉన్న ఆత్మీయత, ఆనందం మరెందులోనూ లభించదని తెలియనివిషయం కాదు. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో భాషలకు లిపి లేకపోవడం విద్యారూపంలో అందించే ప్రయత్నం చేయకపోవడంతో కాలగర్భంలో కలిసిపోయాయి. ఒకనాడు సంస్కృతం, ప్రాకృతం, అరబిక్, పార్శీ, ఉర్దూ, పోర్చుగీస్, ఇంగ్లీష్‌తోసహా అనేక భాషల ప్రాభవాన్ని తట్టుకొని నిలబడగలిగిన తెలుగుకు ప్రస్తుతం ఆశించిన మేరకు ఆదరణ లభించడం లేదేమోననిపిస్తున్నది. మాతృభాషను తెలుగుపై పాలకులకు అభిమానం, ప్రేమావాత్సల్యం లేదనుకోలేం. తెలుగుకు ఉన్న ప్రాముఖ్యతను చాటిచెప్పేందుకు ప్రపంచవ్యాప్తంగా సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. ఇదంతా తెలుగుభాషపై ఉన్న మక్కువను చాటేందుకు తెలుగును నలుదిశలా వ్యాప్తిచేసేందుకు చేస్తున్న ప్రయత్నాలే. అందులో మరో అభిప్రాయానికి తావులేదు. కానీ మరొకపక్కతెలుగు రాష్ట్రాల్లోనే క్షేత్రస్థాయిలో ఇంగ్లీషు మోజులో పడి తెలుగుకు తీరని అన్యాయం చేస్తున్నారనే వాదనను కొట్టివేయలేం. ఇప్పుడు కొత్తగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కూడా తెలుగుకు బదులు సంస్కృత భాషను ప్రవేశపెట్టాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించడంపట్ల తెలుగు భాషాప్రియులు ఆవేదన చెందుతున్నారు.పాఠశాల స్థాయిలో ఒక సబ్జెక్టుగా ఉన్న తెలుగుకు ఆపై ఉన్నతస్థాయి చదువుల్లో ఎలాంటి చోటు లేకుండాపోయింది. కేవలం మార్కుల కోసమే ఇంటర్మీడియేట్ స్థాయిలో తెలుగు స్థానంలో మరొక భాషను ఎంచుకునే ధోరణులు పెరిగిపోవడంతో విద్యార్థులకు ఏ భాషారాని పరిస్థితినెలకొంది. తాజాగా ప్రభుత్వజూనియర్ కళాశాలలో ద్వితీయ భాషగా సంస్కృతాన్ని ప్రవేశపెట్టాలని తెలంగాణ ఇంట ర్‌బోర్డు నిర్ణయించింది. దీంతో ఇంటర్మీడియేట్ స్థాయి నుంచే తెలుగు పూర్తిగా కనుమరుగైపోతుందనే ఆందో ళనలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల్లో దాదాపు అన్ని ప్రైవేట్, కార్పొరేట్ ఇంటర్మీడి యేట్ కాలేజీల్లో మార్కుల కోసంఅంటూ పిల్లలను సంస్కృతం, ఇతర భాషలవైపు మళ్లిస్తున్నారు. మాతృభాషను పూర్తిగా విస్మరిస్తున్నారు. పోని ఆ భాషలైనా సమగ్రంగా నేర్చుకునే విధంగా బోధిస్తున్నారంటే అదికూడా లేదు. బట్టీ పట్టిన పది, పన్నెండు పదాలను పరీక్షల్లో రాసి మమ అనిపించినా నూటికితొంబై మార్కులకుపైగా వేసేస్తున్నారు. వాస్తవంగా ఆ భాషల్లో సొంతంగా నాలుగైదు వ్యాఖ్యలు సమగ్రంగా రాయడం, చదవడం రావడం లేదు. ఇది అందరికి తెలిసిందే. ఆసక్తి మేరకు ఏ భాష అయినా నేర్చుకోవచ్చు. అందులో మరో అభిప్రాయానికి తావులేదు.కానీ కేవలం మార్కుల కోసమే అమ్మభాషను కనుమరుగు చేయడం న్యాయం కాదు.అంతేకాదు తెలుగు భాషకు జరుగుతున్న ద్రోహం అందువల్ల సామాన్యులు పడుతున్న ఇబ్బందుల గురించి ఆలోచిస్తే ఆవేదన కలుగకతప్పదు. ఇదంతా పరాయి ప్రభువులు ఎవరో చేస్తున్నదికాదు. ఉభయ రాష్ట్రాల్లో తెలుగు ప్రజల ప్రతినిధులమని చెప్పుకుంటున్న నేతలే కావడం విచారకరం.ప్రపంచ బ్యాంకు గ్లోబల్ విలేజ్‌గా మారిపో యిన మాట వాస్తమే కావొచ్చు. సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందుతుంటే తెలుగు, తెలుగు అంటూ పరిమి తులు గీసుకుంటే ఎలా అని ప్రశ్నించేవారు ఉన్నారు. అభివృద్ధివైపు పరుగులు పెట్టొదని చెప్పడం లేదు. అన్య భాషలను ద్వేషించమని అనడంలేదు. కానీ మాతృభాషపై అభిమానం పెంచుకోవడం తప్పుకాదు.వాస్తవంగా తెలుగు రాష్ట్రాల్లో మమ్మీడాడీ చదువులు ఆరంభమైన తర్వాత తెలుగులో బోధనక్రమేపీ తగ్గిపోతున్నది. తెలుగులో బోధించే ప్రభుత్వ ఎయిడెడ్ విద్యాసంస్థలు దాదాపు మూతపడ్డాయనే చెప్పొచ్చు. ఇంగ్లీషు చదివించడం స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. తెలుగు మాట్లాడేవారిని ప్రభు త్వ కార్యాలయాల్లో సైతం చిన్నచూపు చూడడం పరి పాటి అయింది. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత హిందీతో పోటీపడిన తెలుగు దేశంలోనే అప్పట్లో రెండో అతిపెద్ద భాషగా గుర్తింపు పొందింది. తమిళ, కన్నడ, మళయా లం వంటి వాడుకలో ఉన్న భాషల్లో తెలుగుది ప్రత్యేక స్థానంగా చెప్పొచ్చు.ఒకప్పుడు రాజ్యలేలిన భాషలు క్రమే పీ కనుమరుగయ్యే పరిస్థితికి చేరుకుంటున్నాయి. ఇంతటి సుదీర్ఘచరిత్ర కలిగిన తెలుగును 1966 మే పధ్నాలుగు ఆనాటి ఉమ్మడి రాష్ట్రంలో అధికార భాషగా గుర్తించారు. పరిపాలనకు సంబంధించి ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ తెలుగులో ఉండాలనినిర్దేశించారు. ప్రాథమిక స్థాయి నుంచే తెలుగు బోధనకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని ఎన్నోఉపన్యాసాలు ఇస్తారు.తెలుగు రాష్ట్రాల్లో తెలుగులో తమ భావాలనుస్పష్టంగా చెప్పగలిగినా ఆంగ్లంలో వ్యక్తం చేసేం త పరిజ్ఞానం లేకపోయినా వచ్చీరాని మాటలతో ప్రయ త్నిస్తున్నారే తప్ప స్వచ్ఛమైన తెలుగులో మాట్లాడటం నమూషీగా భావించే దురదృష్టపు రోజులు దాపురించాయి. తెలుగు భాష అమలుకు ఎన్నో చట్టాలుచేశారు. మరెన్నో నిబంధనలు విధించారు. దశాబ్దాలు దాటిపోయినా అవి అమలుకు నోచుకోవడం లేదు. పేరుకు అధికార భాషాసంఘాన్ని ఏర్పాటు చేశారు. ఏవో నామమాత్రపు అధికారాలు తప్ప కనీసం కార్యాలయంలో తెలుగును అమలుచేయని అధికారులపై చర్యలు తీసుకునే అధికా రాలను కట్టబెట్టలేదు. ప్రభుత్వ శాఖలన్నింటిల్లోనూ తెలుగు అమలుకు చిత్తశుద్ధితో కృషిచేస్తే సామాన్యులకు ఎంతో మేలు జరుగుతుంది. సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి తెలుగు గురించి గొప్పలు చెప్పుకోండి, కానీ ఆ తెలుగుకు పుట్టినిల్లు అయిన రాష్ట్రాల్లో తెలుగుకు ద్రోహం చేయడం ఏమాత్రం సమంజసం కాదు.

ఔన్నత్యం గల వ్యక్తి ఎన్ని సంవత్సరాలు జీవించవచ్చుననే దాని కంటే ఎంతటి ఉన్నత విలువలు పాటిస్తున్నామనే విషయానికే ప్రాధాన్యతిస్తాడు.



సెనెకా

అత్యధిక శాతం జనాభా నిరుపేదలు, దౌర్భాగ్యులుగా ఉన్న సమాజం వర్ధిల్లదు. అటువంటి సమాజంలో సుఖశాంతులు పరిఢవిల్లవు.



ఆడమ్‌స్మిత్


# వివాదాల సుడిగుండంలో గవర్నర్ వ్యవస్థ!

**ప్రజల చేత ఎన్నుకోబడిన శాసనసభ నిర్ణయాలను కేవలం కేంద్రం చేత నామినేట్ చేయబడిన గవర్నర్ నిరాకరిస్తున్నారు. ఇది ఖచ్చితంగా ప్రజాస్వామ్యం మీద దాడి మినహా మరేమీ కాదు. గవర్నర్ల ద్వారా రాజ్యాంగంపై జరుగుతున్న ఈ దాడి సాధారణంగా జరుగుతున్న దాడికాదు. మన లౌకిక, ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని తిరగరాయడానికి ఒక పద్ధతి ప్రకారం చేస్తున్న దాడి. అందువల్ల ఈదాడిని ఇతర అంశాలతో సంబంధం లేకుండా చూడలేం. మన రాజ్యాంగంలోని అన్నిమౌలిక అంశాల మీద అంటే లౌకికత్వం, ప్రజాసామ్యం ముఖ్యంగా పార్లమెంటరీ ప్రజాసామ్యం, ఫెడరలిజం మొదలైన రాజ్యాంగ మౌలిక అంశాలన్నింటి మీద జరుగుతున్న దాడిలో ఇదో భాగం. అందుకే ప్రజాస్వామ్యంలో ఏమాత్రం ప్రాధాన్యత లేకుండా ఆరో వేలుగా ఉండి, అసలు ప్రజాస్వామ్యాన్నే పెను ప్రమాదంలోకి నెడుతున్న ఈ గవర్నర్ వ్యవస్థ అవసరం ఇంకా ఉన్నదా? అని ఆలోచించాల్సిన సమయం వచ్చింది.**



నాదెండ్ల శ్రీనివాస్

దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాధినేతలూ వర్సెస్ రాజ్యాంగాధినేతల మధ్య ఘర్షణ వాతావరణం రోజురోజుకు చర్చనీయాంశం అవుతోంది. రాష్ట్రాల్లో గవర్నర్ వర్సెస్ గవర్నమెంట్ మధ్య దూరం మరింత పెరుగుతోంది.కేంద్ర, రాష్ట్రాల్లో విభిన్న ప్రభుత్వాలున్నప్పుడు ఈ ఘర్షణ అనివార్యమోతోంది. అధికారాల విషయంలో ఎప్పుడూ ఏదో ఒక అలజడి జరుగుతూనే ఉంది. తరుచూ ఏవో ఒక ప్రకంపనలు చెలరేగుతూనే ఉన్నాయి. కేరళ, తమిళనాడు ఇలా ఒక్కో రాష్ట్రంలో గవర్నర్ వ్యవస్థ వివాదం అవడంతో దేశవ్యాప్తంగా చర్చనడుస్తోంది. రాష్ట్రాలలో గవర్నర్లు, నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ తోసహా కేంద్ర భూభాగాల్లో లెఫ్టినెంట్ గవర్నర్లు లేదా అడ్మినిస్ట్రేటర్ ఉన్నారు. గవర్నర్ నామమాత్రపు అధిపతిగా వ్యవహరిస్తారు. అయితే నిజమైన అధికారం రాష్ట్రాలలో రాష్ట్రాల ముఖ్యమంత్రులు, వారి మంత్రిమండలిపై, కేంద్ర పాలిత ప్రాంతాల్లో లెఫ్టినెంట్ గవర్నర్ లేదా అడ్మినిస్ట్రేటర్ వద్ద ఉంటుంది. ఢిల్లీ, పుదుచ్చేరి మినహా గవర్నర్ ఒక ముఖ్యమంత్రి నేతృత్వంలోని మంత్రుల మండలితో అధికారాన్ని పంచుకుంటారు. ఆర్టికల్ 153 ప్రకారం ప్రతి రాష్ట్రానికి ఓ గవర్నర్ అవసరం. గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లను ఐదేళ్ల కాలానికి భారత రాష్ట్రపతి నియమిస్తారు. ఆర్టికల్ 154 ప్రకారం రాష్ట్ర గవర్నర్‌కి కార్యనిర్వాహక అధికారం ఉంటుంది. పరోక్షంగా అధికారుల ద్వారా పరిపాలన చేయవచ్చనేది దీనర్థం. అయితే గవర్నర్ వ్యవస్థ అనేది స్వాతంత్య్రానికి పూర్వం అంటే బ్రిటిష్ పాలన నుండే ఉన్నది. అప్పట్లో వైశ్రాయ్ కీలకమైన పదవి. గవర్నర్ కేవలం కార్యనిర్వాహక అధిపతి. బ్రిటిష్ చట్టాలకు అనుగుణంగా నాడు ఏర్పడిన ఈ వ్యవస్థ ఇప్పటికీ కొనసాగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య గవర్నర్ వ్యవస్థ వారధిలా ఉండాలనే ఉద్దేశంతో దీనిని కొనసాగిస్తున్నారు. కానీ ఇదే గవర్నర్ వ్యవస్థను ఆసరా చేసుకొని కేంద్ర ప్రభుత్వాలు, రాష్ట్రాలపై ఆధిపత్యం చెలాయించిన సందర్భాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఓ బిల్లును ఆమోదించినప్పుడు స్పష్టత కోరే అధికారం గవర్నర్కు ఉంది. అయినా ఆ బిల్లును అమలు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానిదే. దేశంలో గవర్నర్లకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య వివాదాలు కొత్తేమీ కాదు. చాలా రాష్ట్రాల్లో గతంలో ఇలాంటి వివాదాలు తారాస్థాయికి వెళ్లాయి. మొన్నటిదాకా ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్ వర్సెస్ అక్కడి గవర్నర్ మధ్య వివాదం గతంలో నిత్యకృత్యంలో మారింది. అసలు గవర్నర్ పదవి అనేది ఫెడరల్‌వ్యవస్థలో ప్రధాన పాత్ర పోషించాల్సిన బాధ్యతాయుతమైన స్థానం. అయితే ఇక్కడ బాధాకరమైన విషయమేమంటే రాష్ట్రాల్లో ప్రత్యర్థి పార్టీ ప్రభుత్వం ఉన్నప్పుడు, కేంద్రంలోని అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న గవర్నర్లు ప్రభుత్వ విధానాలను అడ్డుకోవడం వంటి ఆరోపణలు ఎదురవుతున్నాయి.ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చినతీర్పు ఒక చారిత్రాత్మకమైన నిర్ణయంగా మిగిలింది. తమిళనాడు గవర్నర్ ఆర్. ఎన్.రవి వ్యవహారంపై ఇచ్చిన తీర్పులో, రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్ తిరస్కరించినా,మళ్లీ అవే బిల్లులు తిరిగి రెండోసారి ఆమోదించి పంపినప్పుడు వాటిని రాష్ట్రపతికి పంపకుండా తన వద్దే ఉంచుకోవడాన్ని కోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. ఇది ప్రజాస్వామ్యవ్యవస్థపై ప్రభావం చూపే అంశంగా ఉందని, గవర్నర్ తన పదవి ద్వారా స్వాతంత్య్రాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించొద్దని హెచ్చరించింది.



అలాగే బిల్లులను ఆమోదించడంలో ఆలస్యం చేయకూడదని, మూడు నెలల వ్యవధిలోనే నిర్ణయం తీసుకోవాలని కోర్టు సూచించింది. అలాగే వైస్ ఛాన్సలర్లు, ఇతర విద్యా వ్యవస్థ సంబంధిత నియామకాల్లో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలపై జాప్యం చేయకూడదన్న సూచన కూడా ఈ తీర్పులో ఉంది. అయితే ఇది కేవలం తమిళనాడు గవర్నర్ విషయంలోనే కాకుండా, దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు ఈ తీర్పు మార్గదర్శకంగా నిలుస్తుందనేది న్యాయ నిపుణుల అభిప్రాయం. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో కేంద్ర, రాష్ట్ర సంబంధాల్లో స్పష్టత తీసుకురావడంతో పాటు, ఫెడ రల్ వ్యవస్థను మరింత బలపరిచే దిశగా ఉన్నది. కాబట్టి ఇప్పటికైనా గవర్నర్ వ్యవహార శైలి మారకపోతే, ప్రజాస్వా మ్య వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం దిగజారే ప్రమాదం ఉంది. గవర్నర్ ఒక స్నేహితుడిగా, మార్గదర్శకుడిగా, రాజ్యాంగ ప్రమాణాలను గౌరవించే వ్యక్తిగా ఉండాలన్నది ఈ తీర్పు ద్వారా వెల్లడైన సందేశం. ఈ గవర్నర్ల వివాదమనేది మన తెలుగు నేలను కూడా గతంలో ఆవహించిన సందర్భాలు ఉన్నాయి.ఉమ్మడి ఎపి, రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఇప్పటి వరకు పనిచేసిన గవర్నర్లలో అత్యంత వివాదాస్పదుడు రామ్‌లాల్, 1984లో ఎన్.టి. రామారావు ప్రభు త్వాన్ని అప్రజాస్వామికంగా రద్దు చేసి నాదెండ్ల భాస్కరరావును ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా అనుమతించిన గవర్నర్‌గా ఆయన చరిత్రలో నిలిచారు. ఆనాటి కాంగ్రెస్ సారథ్యంలో ఇందిరా గాంధీ అయినా, నేడు బిజెపి సారథ్యంలో నరేంద్రమోడీ అయినా కేంద్రంలో ప్రభుత్వం మారిన ప్రతీసారి రాష్ట్రాల్లో తమ ఇష్టానుసారంగా గవర్నర్లను మార్చే చర్యల వల్ల రాష్ట్ర ప్రభుత్వాలకు గవర్నర్ వ్యవస్థే ఇబ్బందికరంగా మారింది. దాని పర్యవసానంగానే నేడు గవర్నర్లు కేంద్ర ప్రభుత్వానికి ఏజెంట్లుగా వ్యవహరిస్తూ బిజెపియేతర రాష్ట్ర ప్రభుత్వాలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఆయా ప్రభుత్వాల నేతృత్వంలో అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను క్లియర్ చేయటం లేదు. దీనివల్ల గవర్నర్ వ్యవస్థ రాష్ట్రాల స్వయం ప్రతిపత్తికి భంగం కలిగిస్తుంది. ఇది రాష్ట్రాల మధ్య విభేదాలకు దారితీస్తుంది. మోడీ ప్రభుత్వం గవర్నర్లను అడ్డుపెట్టుకుని రాష్ట్రాల హక్కుల మీద, రాజ్యాంగంలోని ఫెడరల్ సూత్రాల మీద తీవ్రమైన దాడి చేయడం 2014నుండి జరుగుతూనే ఉంది. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అరుణాచల్ ప్రదేశ్, గోవా, కర్ణాటక, కేరళలో ఈ దాడులను చూశాం. గవర్నర్లకు రా జ్యాంగం ఇచ్చిన కొన్ని విచక్షణాధికారాలను ఉపయోగించు కుని వారు సమాంతర అధికార కేంద్రాలుగా మారడానికి ప్రయత్నిస్తున్నారు. అందుకే గవర్నర్ పదవి వివాదాస్పదం కాకూడదంటే కొన్ని మార్పులు చేయాల్సిన అవసరం ఉన్న ది. రాజకీయ రంగంతో సంబంధం ఉన్న వ్యక్తిని కాకుండా ప్రజా పరిపాలనలో నిష్ణాతులైన వ్యక్తులను నియమించాలి. గవర్నర్ని నియమించే ముందు రాష్ట్రపతి సంబంధిత రాష్ట్రప్రభుత్వ సలహాలను తీసుకోవాలి. ప్రస్తుత రాజకీయాలలో క్రియాశీలకంగా ఉండని వ్యక్తిని నియమించాలని సూచించిన సర్కారియా, పూంఛీ కమిషన్ సిఫార్సులను పాటించాలి. రాష్ట్రపతిని ఎలా అయితే తొలగించడానికి మహాభియోగ తీర్మానం ఉందో అలాంటి పద్ధతిని గవర్నర్ విషయంలో కూడా తీసుకురావాలి. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలలో చొరబడి పెత్తనం చేయకుండా పెద్దరికంతో కేవలం సంతకాలకే పరిమితం చేయాలి. రాష్ట్రాల్లో విశ్వ విద్యాలయాల ఛాన్సలర్లుగా గవర్నర్లు ఉంటున్నారు. ఈ అధికారం వారికి రాజ్యాంగం కల్పించింది కాదు. ఈ అధికారాన్ని వారికి రాష్ట్ర శాసనసభలు,చట్టాలు కల్పించాయి. ఈ అధికారాన్ని కూడా గవర్నర్లు దుర్వినియోగం చేస్తూ బిజెపి యేతర రాష్ట్ర ప్రభుత్వాలపై రాజకీయ దాడికి ఉపయోగించుకుంటున్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన శాసనసభ నిర్ణయాలను కేవలం కేంద్రం చేత నామినేట్ చేయబడిన గవర్నర్ నిరాకరిస్తున్నారు. ఇది ఖచ్చితంగా ప్రజాస్వామ్యం మీద దాడిమినహా మరేమీకాదు. గవర్నర్ల ద్వారా రాజ్యాంగంపై జరుగుతున్న ఈ దాడి సాధా రణంగా జరుగుతున్న దాడికాదు. మన లౌకిక,ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని తిరగ రాయడానికి ఒక పద్ధతి ప్రకారం చేస్తున్న దాడి. అందువల్ల ఈ దాడిని ఇతర అంశాలతో సంబంధం లేకుండాచూడలేం. మన రాజ్యాంగంలోని అన్నిమౌలిక అంశాలమీద అంటే లౌకికత్వం, ప్రజాసామ్యం ముఖ్యంగా పార్లమెంటరీ ప్రజాసామ్యం, ఫెడరలిజం మొదలైన రాజ్యాంగ మౌలిక అంశాలన్నింటి మీద జరుగుతున్న దాడిలో ఇదో భాగం. అందుకే ప్రజాస్వామ్యంలో ఏమాత్రం ప్రాధాన్యత లేకుండా ఆరో వేలుగా ఉండి, అసలు ప్రజా స్వామ్యాన్నే పెను ప్రమాదంలోకి నెడుతున్న ఈ గవర్నర్ వ్యవస్థ అవసరం ఇంకా ఉన్నదా? అని ఆలోచించాల్సిన సమయం వచ్చింది. ●

# దోమకాటు కట్టడితో మలేరియా దూరం!

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

ఆడ అనాఫిలిస్ దోమకాటు వల్ల ప్లాస్మోడియం అనబడే పరాన్న సూక్ష్మజీవి మానవ రక్తంలోకి చేరి మలేరియా వ్యాధికి కారణం అవుతుంది. చికిత్సను అశ్రద్ధ చేయడం ప్రాణాంతకం కూడా కావచ్చు. ప్రపంచాన్ని వణికించిన ప్రాణాంతక వ్యాధుల్లో మలేరియా కూడా ఒకటి. నేటికి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మలేరియా వ్యాధి పేద బడుగు బలహీన వర్గాలను పట్టిపీడిస్తున్నది. ప్రాణాలను సైతం తీస్తున్నది. అధ్యయన వివరాల ప్రకారం ప్రతి ఏటా ప్రపంచవ్యాప్తంగా 229 మిలియన్ల కొత్త మలేరియా కేసులు బయటపడుతున్నాయి. నేడు ఐరాస గుర్తింపు పొందిన మలేరియా రహిత దేశాల జాబితాలో జపాన్, యూఏఈ, శ్రీలంక లాంటి దాదాపు 45 దేశాలు సగర్వంగా కనిపిస్తున్నాయి. నేటి డిజిటల్ యుగంలో సైతం దాదాపు వందకు పైగా దేశాల 3.3 బిలియన్ల ప్రజలు మలేరియా అంచున కొట్టుమిట్టాడుతుండడం విచారకరం. ఆఫ్రికా దేశాల్లోనే 93 శాతం మలేరియా కేసులు, 94 శాతం మలేరియా మరణాలు నమోదు అవుతున్నట్లు అంచనా. ఐరాస నాయకత్వంలో 2007 నుంచి ప్రతి ఏటా25 ఏప్రిల్ రోజున ప్రపంచ మలేరియా దినం (వరల్డ్ మలేరియా డే)" పాటించుట ఆనవాయితీగా మారింది. 2025 వరల్డ్ మలేరియా డే ఇతివృత్తంగా మలేరియా నిర్మూలన దిశగా కల్పిస్తున్నారు. 2000 సంవత్సరం నుంచి మలేరియా వ్యాధి నిర్ధారణ, మెరుగైన చికిత్స, తీసుకోవలసిన జాగ్రత్తలు, రోగ నిర్మూలన వంటి ఇతర విషయాల్లో వచ్చిన విప్లవాత్మక సానుకూల మార్పులతో మలేరియా నుంచి



ప్రజలను కాపాడడం తేలిక అయింది. గత రెండు దశాబ్దాలుగా 7 మిలియన్ల మలేరియా వ్యాధిగ్రస్థులను కాపాడడంతో పాటు ఒక బిలియన్ ప్రజలకు వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడం విజయవంతంగా జరిగింది. ప్రపంచ దేశాలను జీరో మలేరియా దేశాలుగా ప్రకటించడానికి కావలసిన కృషి నిరంతరం కొనసాగుతున్నది. మలేరియా నిర్మూలన సదుద్దేశంతో ప్రపంచ దేశాలు వడివడిగా సరైన దిశలో అడుగులు వేయడం, మలేరియాను నియంత్రించడం, మరణాలకు అడ్డుకట్ట వేయడం ప్రణాళికాబద్ధంగా, శాస్త్రీయంగా జరుగుతోంది. మలేరియా కట్టడికి పౌర సమాజంతో పాటు ప్రభుత్వాలు కూడా నడుం బిగిస్తేనే ప్రయోజనం ఉంటుందని గమనించాలి. దోమల నిర్మూలన, పరిసరాల శుభ్రత, వ్యాధి నిర్ధారణ, సరైన చికిత్స, నిధుల కేటాయింపు, సామాన్య ప్రజలకు అవగాహన లాంటి చర్యలతో మలేరియా నియంత్రణ సుసాధ్యం కావడం మన అనుభవంలోకి వస్తున్నది. మలేరియా వ్యాధి లక్షణాల్లో జ్వరం, చలి వణుకు, చెమట, తలనొప్పి, అలసట, కండరాల కీళ్ల నొప్పులు, వాంతులు, రక్తహీనత, దగ్గు, కడుపు నొప్పి లాంటివి ఉన్నాయి. డిజిటల్, ఏఐ ఎంఎల్ యుగంలో వేగంగా దూసుకుపోతున్న నవ్య మానవుడు దోమకాటు కారణంగా వచ్చే మలేరియా కోరల్లో చిక్కుకోవడం సోచనీయం. దోమకాటు బారినపడకుండా, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు సోకినప్పుడు వెంటనే వైద్య చికిత్స తీసుకోవడం మన కనీస కర్తవ్యం. ఈ విషయంలో పౌరులు, వైద్య సిబ్బంది, ప్రభుత్వ చర్యలు లాంటివి సమాంతరంగా జరిగితేనే భారతం మలేరియా రహిత దేశాల జాబితాలో చేరుతుందని తెలుసుకుందాం. ●

# ప్రజావాక్కు



## ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలి

ఏప్రిల్ 22వ తారీఖున లష్కర్ ఇ తోయిబా అనే పాకిస్థాన్ పెంచి పోషిస్తున్న ఉగ్రవాదసంస్థ కాశ్మీర్‌లోని పెహల్గామ్ వద్ద విహారయాత్ర కొచ్చిన వారిపై సైనిక దుస్తులు ధరించి విచ్చలవిడిగా కాల్పులు జరపడం వలన కడపటి వార్తలందే నాటికి30మంది చనిపోగా కనీసం20 మందికి గాయాలయ్యాయి. అందులో వారం క్రితం వివాహమైన దంపతుల్లో భర్త చనిపోవడం హృదయాలను ద్రవించి వేసింది.ముస్లిములు కాదని నిర్ధారించుకుని మరీ చంపారు. ఉగ్రవాదులు గతంలో ఎన్నోసార్లు దాడి జరిపి అనేక అమాయక ప్రాణాలనుతీసారు.పార్లమెంటు, అక్షర్ ధామ్, పుల్వామా మొదలైన ప్రదేశాలలో ఈ ఉగ్రవాదుల దాడిని చవి చూసాం. ఇంకెంత కాలం ఉపేక్షిస్తూ ఉంటాము. పెహల్గామ్‌లోజరిగిన మారణ కాండ తహావ్వూర్ రాణా అనే ముంబాయిలో పేలుళ్ళ సూత్రధారిని అమెరికా నుండి భారత్ రప్పించి విచారణ జరుపుతుండడమే కారణమని పుకార్లు కూడా వచ్చాయి. ఉగ్రవాదులను వదలి పెట్టబోమని మోడి హెచ్చరించారు. ఏం చేస్తారో, ఏలా చేస్తారో వేచి చూద్దాం.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## సామాజిక శాంతితోనే అభివృద్ధి

దేశంలో న్యాయం అందరికి సమానంగా అందాలి.కాని ఉన్న నిజంలో మాత్రం తేడా స్పష్టంగా కనిపిస్తుంది తూర్పు మధ్య భారత్‌ల్లో ఉన్న ఆదివాసుల నుండి పశ్చిమలో ఉన్న దళితుల వరకు మైనారిటీల వరకు ఈ తేడా స్పష్టంగా చూడొచ్చు. దేశంలో 20 శాతం కేసులలో అసలు ట్రయల్ కూడా స్టార్ట్ చేయకుండా జైల్‌లో మగ్గిపోయేట్టు చేస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ 20 శాతం కేసులు కూడా దాదాపుగా దళిత ఆదివాసీలవి మాత్రమే అంటే అతిశయోక్తి లేదు.

-భారత అవినాష్, జనగామ

## చెట్లను పెంచాలి

మనదేశంలో ఏడుగురికి ఒక చెట్టు ఉండాల్సి ఉండగా ఏడువందల మందికి ఒకటి ఉంది. దీన్ని బట్టి పరిస్థితి ఎంత తీవ్రంగా ఎంతదారుణంగాఉందో అందరూ ఊహించుకోవాలి.ఇకనైనా పర్యావరణ పరిరక్షణకోసం పచ్చదనాన్ని పెంపొందించడం కోసం అందరూ చెట్లను పెంచాలి.

-ఎన్.రాజేష్, హైదరాబాద్

## పాప పుణ్యాలు

**పాప పుణ్యాలు** కృతాయుగం, త్రేతాయుగాల్లో ఉన్నంత మంది మంచివారు. పుణ్యాత్ములు. కలియుగంలో ఉండరు పాపాలు, మోసాలు,అక్రమాలు, అన్యాయాలు చేసేవారే అధికం. అందుకే కలిగియుగాన్ని పాపాలయుగం అని అంటుంటారు. పాపాలు, మోసాలు, చేసి వాటిని పోగొట్టుకోవడానికి తీర్థయాత్రలు చేసూనతగుళ్లు,గోపురాల చుట్టూతిరుగుతూ నదుల్లో మునక వేస్తుం టారు.తిరిగివచ్చాక మళ్లీ పాపాలుచేస్తూ సంపాదించిన పుణ్యాన్ని పోగొట్టుకుంటుంటారు. ఇలాంటి వారేకాక శివమాల, అయ్యప్ప మాలవేసుకుని 40రోజుల పాటు నిష్టగా ఉండేవారు దీక్ష పూర్తయిన మరునాటి నుంచే తమకు పూర్వం ఉన్న వ్యసనాలను కొనసాగిస్తుంటారు. ఇలాంటివారు ఎందరో. అయితే నీతి నిజాయితీలతో తమవృత్తి వ్యాపారాలను నిర్వహిస్తూ పేదలకు సాయంచేస్తూ ఆదర్శంగా జీవించటమే ఉత్తమం.

-మిథునం, హైదరాబాద్

## దడ పుట్టిస్తున్న సుంకాలు

**అమెరికా** అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న సుంకాలు ప్రపంచ దేశాలకు దడ పుట్టిస్తున్నాయి. చిన్న చిన్న కారణాలు చూపి వీసాలు, వగైరా రద్దు చేయడానికి వెనుకాడడం లేదు. వ్యాపారులు,విద్యార్థులుఉద్యోగులపై ఆంక్షల పంజా విసురుతున్నారు.అక్కడ మనవారి పరిస్థితి గందరగోళంగా ఉంది. ట్రంప్ 2.0 హయాంలో కనీవినీ ఎరుగని రీతిలో వాణిజ్య యుద్ధానికి తెరతీసింది. అగ్రరాజ్యం గట్టి నిర్ణయాలతో స్థానికులకు కూడా కష్టాలు తప్పడం లేదు. పెద్దన్న దేశం ఆర్థికంగా బలోపేతం కావడానికి భారతీయుల పాత్ర మరువలేనిది. చాలా సంస్థలకు, యుద్ధాలతో సర్వం కోల్పోయిన వారికి, పేద దేశాలకు అదించే నిధులు హఠాత్తుగా నిలిపివేశారని తెలుస్తుంది.అదే జరిగితే ఆకలి, కేకలు ఇంకా ఎక్కువయ్యే ప్రమాదం పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

-ఆర్. వెంకటేశ్ చరన్, బెంగళూరు

## ప్రార్థనా సమయంలో మెసేజ్ ఇవ్వాలి

**విద్యార్థులకు** వచ్చే విద్యాసంవత్సరం ప్రార్థనాసమయంలో ప్రతిరోజు ఒక సందేశాత్మకమైన విషయం చెప్పడానికి విద్యాశాఖఆదేశాలు జారీచేయాలి.అందుకోసం ప్రణాళిక రూపొందించాలి. జాతీయ,అంతర్జాతీయ విద్య, ఉద్యోగ, రాజకీయ, సాంఘిక,ఆర్థిక, సామాజిక,సంస్కృతిక, విజ్ఞానం వంటి అంశాలను విద్యార్థులు తెలుసుకోవడానికి ఒక టీచర్ లేదా ఒక లెక్చరర్‌ను నియమించాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

# అందరికి అందని ఆర్థికాభివృద్ధి

ఐ.ప్రసాదరావు

ప్రస్తుతం భారతదేశం ప్రపంచంలోనే ఐదోవ ఆర్థిక వ్యవస్థగా ఉందని, త్వరలో మూడో ఆర్థిక వ్యవస్థగా మారుతుంది అని ప్రగల్భాలు పలుకుతున్న ప్రస్తుత పాలకులు ఇకనైనా ప్రజల వాస్తవ పరిస్థితిని గమనించి, ఈ ఆర్థికాభివృద్ధిని బేరిజు వేసుకుని ముందుకు సాగడం ఉత్తమం. ఎందుకంటే ఇటీవల ప్రపంచవ్యాప్తంగా అనేక అంతర్జాతీయ సంస్థలు వివిధ అంశాలపై ప్రకటించిన అనేక ర్యాంకులు పరిశీలిస్తే, మన భారతదేశ వాస్తవ అభివృద్ధి కళ్లకు కట్టినట్లు కనపడుతుంది.ఐక్యరాజ్యసమితి ప్రకటించిన 'సుస్థిర అభివృద్ధి లక్ష్యాల' సాధనలో మనదేశం 109వ స్థానంలో నిలిచింది. మానవ అభివృద్ధి సూచిక (హెచ్‌డిఐ)లో 134వ స్థానం, సంతోష సూచికలో 126వ స్థానంలో, ఆకలి సూచిలో 105వ స్థానంలో,అవినీతిలో 96వ స్థానంలో, పోషకాహారలోపంలో 111వ స్థానంలో, మహిళా రక్షణలో 128వ స్థానంలో, మల్టీ డైమెన్షనల్ పావర్టీలో 126వ స్థానంలో, లింగ సమానత్వంలో 129వ స్థానంలో, తలసరి ఆదాయంలో 124వ స్థానంలో,అక్షరాస్యత రేటు 80 శాతం లోపు, నిరుద్యోగం దాదాపు 5శాతంతో ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో భారత్ ఐదోవ ఆర్థిక వ్యవస్థగా మారటం వల్ల భారతదేశానికి ముఖ్యంగా పేద, మధ్య తరగతి ప్రజలకు కలిగిన ప్రయోజనం ఏమిటి? ఇది మన అందరిని వెంటాడుతున్న ప్రశ్న.ఈ ప్రశ్నకు బదులేది? నేటి పాలకులు సమాధానం చెప్పాలి. ఇక నేటికీ భారతదేశంలో కేంద్ర ప్రభుత్వ శాఖల్లో సుమారు 10 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. అనేక విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకులు, మౌలిక సదుపాయాలు లేక విలవిలలాడుతున్నారు. దాదాపు ప్రపంచంలోనే ప్రాముఖ్యత కలిగిన వంద విశ్వవిద్యాలయాల్లో మనదేశం నుంచి ఒకటి లేకపోవడం గమనార్హం. దేశానికి స్వాతంత్య్రం వచ్చి 77 సంవత్సరాలు పూర్తి అవుతున్నా, నేటికీ వివిధ ఉచిత పథకాలు, సంక్షేమ పథకాలు, పెన్షన్లు సుమారు 70 కోట్ల మందికి పంచుతూ, కనీసం ఒకపూట భోజనం ఏర్పాటు చేయడం జరుగుతుంది అని ఈ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు పరిశీలిస్తే తేటతెల్లం అవుతుంది. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతూ, పేద మధ్య తరగతి ప్రజలపై భారం పడుతుంది. ద్రవ్యోల్బణం మరింత పెరిగింది. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు మండుతున్నాయి. ఎక్కడ చూసినా నిరుద్యోగం తాండవిస్తుంది. ఉద్యోగ ఉపాధి అవకాశాలులేక వలసల భారతంగా ఉంది. ఇటువంటి



పరిస్థితుల్లో దేశం త్వరలో 'మూడో ఆర్థిక వ్యవస్థగా' మారినా ఎవరికి లాభం? కేవలం ఈ అభివృద్ధి అంతా కొందరి బడా పారిశ్రామికవేత్తలు, సంస్థలకు చెందినదిగా గుర్తించాలి. కార్పొరేట్ వ్యక్తుల అభివృద్ధే దేశాభివృద్ధిగా చెబుతూ పాలకులు ప్రజలను నమ్మించడం ఇకనైనా మానాలి. దేశానికి అన్నం అందించే అన్నదాతలు ఆర్తనాదాలు పాలకులకు వినబడడం లేదు. రైతులు, నిరుద్యోగుల ఆత్మహత్యలు కనపడటం లేదు. కేవలం నాలుగురహదారులు, ఆరువిమానాశ్రయాలు, పదంతస్తుల ఆకాశహర్మ్యాలు నిర్మించి,యాభై, డెభై అడుగుల విగ్రహాలు, సందర్శించే దేవాలయాలు, ఆకర్షించే కుంభమేళా వంటివి చేయడం ద్వారా దేశంలో పేదరికం తగ్గుతుందా? పాలకుల్లారా ఆలోచన చేయండి.ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం ద్వారా వాస్తవాలు ఎల్లకాలం దాచలేరు. గతంలో 8శాతం, 9శాతం ఉన్న జిడిపి, నేడు 5 నుంచి 6 మధ్య కదలాడుతుంది అని గ్రహించాలి. ఎగుమతులు తగ్గి, దిగుమతులు పెరగడం వల్ల ఆర్థిక వ్యవస్థ బలహీనపడింది. ట్రంప్ తీసుకుంటున్న టారిఫ్ నిర్ణయాలతో అనేక ఒడిదుడుకులు ఎదురవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో, ఇకనైనా పాలకులు పారిశ్రామిక రంగానికి, వ్యవసాయ రంగానికి ఊతం ఇవ్వాలి. గతంలో కంటే కొన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినా, కీలక రంగాల్లో మరింత అభివృద్ధి సాధించవలసిన అవసరంఉంది. 'చైనా'వలే స్వయంసమృద్ధి సాధించేందుకు కృషి చేయాలి. విద్యా, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. నైపుణ్యాభివృద్ధికి పెద్ద పీట వేయాలి. నినాదాలు కాదు సరైన నిర్ణయాలు తీసుకోవడం జరగాలి. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అప్పుల ఊబిలో కూరుకు పోకుండా, దేశ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయడానికి సన్నాహాలు చేయాలి. కుల, మత,వర్గ, భాషా,లింగ వివక్షతలు తొలగించడానికి కృషి చేయాలి. భారత రాజ్యాంగ ఆశయాలు ప్రజాస్వామ్య, సామ్యవాద, లౌకిక విధానానికి అనుగుణంగా పాలన చేయాలి. అంకెలు, సంఖ్యలు చూసి మురిసిపోవడం మానాలి. వాస్తవంగా దేశ ప్రజలు తలసరి ఆదాయంపెరిగి, ఆయురారోగ్యాలతో, సంతోషంగా 'ఫిన్లాండ్' వలే ఉండే విధంగా చూసుకోవాలి. వికసిత భారత్,వికసితఆంధ్రప్రదేశ్, తెలంగాణ అంటే దేశ ప్రజలు అందరూ సమానంగా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగాలి.అంతేకాని కొందరు బడా పారిశ్రామిక సంస్థలు, వేత్తలు,కార్పోరేట్ వ్యక్తుల బిలియనీర్ల సంపదే, దేశ అభివృద్ధి అని నమ్మి, దేశం మూడో ఆర్థిక వ్యవస్థగా మారింది అని చెప్పి మురిసి పోవడం చాలా ప్రమాదకరం అని గ్రహించాలి. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పినట్లు 'దేశ ప్రజలు అందరి అభివృద్ధే, దేశాభివృద్ధి' అని నమ్మి ముందుకు సాగడం ఉత్తమం. ●

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# వీరయ్యచౌదరి హత్యకు గల కారణాలేంటి..?

## - భూవివాదాలా, బియ్యం లావాదేవీలా, మద్యం లావాదేవీలా
## - పోలీసుల విచారణలో సంచలన విషయాలు

**ఒంగోలు, ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ నేత, మాజీ ఎంపీపీ వీరయ్య చౌదరి హత్య కేసులో పోలీసుల విచారణలో కీలక విషయాలు బయటకు వస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపిన ఈ ఘటనపై ఒంగోలు పోలీసులు తీవ్రంగా దర్యాప్తు చేస్తున్నారు. తాజాగా ఈ కేసుకు సంబంధించి గుంటూరు జిల్లా పొన్నూరులో తొమ్మిది మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వీరిని రేషన్ బియ్యం, అక్రమ రవాణా మాఫియాతో సంబంధాలు ఉన్న వారిగా గుర్తించినట్లు తెలుస్తుంది. ఈ అరెస్టులతో కేసు దిశ మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం గతంలో రేషన్ బియ్యం వ్యాపారంలో వాటా చేసుకున్న వివాదాలే వీరయ్య చౌదరి హత్యకు కారణమైఉండవచ్చనే అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో మద్యం వ్యాపారుల మధ్య విభేదాలు కూడా ఒక కారణంగా ఉయుండవచ్చని ఆ కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గతంలో వాసు అనే బియ్యం వ్యాపారి హత్యకు పాల్పడ్డ మాఫియా గుంపే ఈ దాడిలో కూడా పాత్ర పోషించి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. వీరయ్య చౌదరి బియ్యం అక్రమ రవాణాకు విరుద్ధంగా ఉండటం, ఈ వ్యాపారంలో జోక్యం చేసుకోవడమే హత్యకు దారి తీసిందని దర్యాప్తులో ప్రధాన కోణంగా పరిశీలిస్తున్నారు. భూవివాదాల్లో కూడా ఏమైనా జరిగిందన్న కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే పదుల సంఖ్యలో అనుమానితులను బుధవారం రాత్రి నుంచి పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. వీరయ్య చౌదరి కేసును ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం అమ్మనబ్రోలులో జరిగిన వీరయ్య చౌదరి అంత్యక్రియలకు హాజరయ్యారు. ఈ హత్యను అధికార పార్టీ ఎంత సీరియస్‌గా తీసుకుందో అర్థమవుతుంది. ఈ కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు నగరాన్ని జల్లెడ పడుతున్నారు. అనుమానితులను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ జరుపుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ నిందితుల కోసం గాలిస్తున్నారు. బియ్యం వివాదాల కోణంలో గుంటూరు జిల్లాకు చెందిన గోపి, అమీర్, అశోక్ అనే ముగ్గురును అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అలాగే బాపట్ల జిల్లా వెదుళ్లపల్లికి చెందిన రైస్ మిల్ యజమానిని, నాగులుప్పలపాడుకు చెందిన ఒక వ్యాపారిని విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ దర్యాప్తులో కొందరు అమాయకులు కూడా బలిపశువులవుతున్న ప్రచారం జోరుగా జరుగుతోంది. వీరయ్య చౌదరికి అనేక భూవివాదాలతో సంబంధం ఉన్నట్లు ప్రచారం సాగుతుంది. ఇటీవల కొంత కాలంలో పొరుగు రాష్ట్రమైన బెంగుళూరు, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇక్కడ ఆయనకు భూ వివాదాలు ఉన్నట్లు చెప్పుకుంటున్నారు. అలాగే వైజాగ్, ఉభయగోదావరి జిల్లాలతో పాటు జిల్లాలో కోసపల్లి వద్ద కూడా భూమి ఉంది ఆయనకు. ప్రధానంగా గుడ్లూరు మండలం రామాయపట్నంలో భూములు రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యవహారంలో వివాదాలు తలెత్తాయనే ప్రచారం జరుగుతుంది. మద్యం వ్యాపారంలో క్రియాశీలకంగా వ్యవహరించేవారని తెలుస్తోంది. ప్రకాశం జిల్లా, బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాలో ఆయనకు మద్యం వ్యాపారాలు ఉన్నాయి. మద్యం సిండికేట్లతో కూడా ఆయనకు వివాదాలు ఉన్నట్లు ప్రచారం సాగుతుంది. పోలీసు దర్యాప్తు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. వీరయ్యచౌదరి హత్యను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. మొత్తం 12 బృందాలను, 40 మంది పోలీసులను రంగంలోకి దించారు. నగరాన్ని అడుగడుగున జల్లెడ పడుతున్నారు. నగరంలోనిలాడ్జీలను తనిఖీ చేస్తున్నారు. అనుమానం వచ్చిన వాళ్ళ మందిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం. వీరయ్య చౌదరి హత్యకు సమాధానం ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, హోంమంత్రి అనిత ఒకే రీతిలో స్పందించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు. జరిగిన విషయాలు, లావాదేవీలు, మద్యం సిండికేట్లపై ఉన్న వివాదాల గురించి సమగ్ర విచారణ చేస్తామని చెప్పారు. నేరుగా వారే పర్యవేక్షించడంతో పోలీసులు మరింతగా దర్యాప్తు చేస్తున్నారు. ప్రధానంగా భూవివాదాలు,లిక్కర్, రేషన్ బియ్యం వివాదాలే హత్యకు దారి తీసిఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఆ దిశగా దర్యాప్తు ముమ్మరం చేశారు. చంద్రబాబు రాకతో ఈ కేసు పోలీసులకు ప్రతిష్టాత్మకంగా మారింది. రేపో మాపో ఈ హత్యకు ప్రధాన సూత్రదారులను పట్టుకునే దిశలో పోలీసు యంత్రాంగం ముమ్మర దర్యాప్తు చర్యలు చేపట్టినట్లు సమాచారం.

# వైసీపీపై విష ప్రచారం చేయడం తగదు

## - వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు

**ఒంగోలు, ప్రభాతవార్త**

జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఒంగోలు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ జిల్లా ఇన్‌ఛార్జ్ చుండూరి రవిబాబు గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించి కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న లిక్కర్ స్కాం గురించి మాట్లాడారు. దొంగతనానికి వచ్చిన ఒక వ్యక్తి, పక్క వీధిలో దొంగతనం జరుగుతుందని కేకలు వేసి, ప్రజల దృష్టిని అటువైపు మరల్చి మొత్తం ఆ ఇంటిని నిలువుదోపిడి చేస్తే ఎలా ఉంటుందో చంద్రబాబునాయుడు తీరుకూడా అలానే ఉందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగంలో ఉన్న దుకాణాలను మూసివేసి, ప్రైవేటు వారికి కట్టబెట్టి, రాష్ట్రంలో విచ్చలవిడిగా జరుగుతున్న లిక్కర్ అక్రమాలను దాచేయటానికి తెలుగుదేశం పార్టీ, కూటమిలోని నాయకుల చేతిలో లిక్కర్ మాఫియా చేస్తున్న భారీ అవినీతిని దాచిపెట్టడానికి, వైఎస్సార్‌సీపీ పై బురదజల్లి, దీనిపై పెద్ద ఎత్తున విష ప్రచారం చేసి, తప్పుడు కేసులు పెట్టి ప్రజల దృష్టిని మళ్లించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇవి చేస్తూ మరోవైపు దోచుకుంటున్నారు. లిక్కర్ విషయంలో చంద్రబాబు చాలా వ్యవస్థీకృతంగా ఆర్గనైజ్డ్‌గా ఈ అవినీతికి పాల్పడుతూ మరోవైపు తమ విధానాల్లో అవినీతి లేదని, అంతా కరెక్టుగా జరుగుతుందని, తప్పులన్నీ గత ప్రభుత్వమే చేసిందన్న అభిప్రాయాన్ని కలిగించే ప్రయత్నంలో భాగంగా చంద్రబాబు తప్పులు కేసులు నడుపుతున్నారు. అదే సమయంలో పై నుంచి కింది దాకా దోచుకుంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉన్న పళంగా అత్యంత పారదర్శకంగా నడిచిన ప్రభుత్వ దుకాణాలను ఎత్తివేశారు. మొత్తం ప్రైవేటు వాళ్లకు అప్పగించారు. ఈ దుకాణాలు కూడా మొత్తం కూటమి నాయకులకు, వారికి సంబంధించిన మనషులకే వచ్చేలా వ్యవహారాన్ని నడిపారు. ఎవరు అప్లికేషన్లు కూడా పెట్టుకోనీయకుండా బెదిరింపులకు దిగారు. ప్రైవేటు దుకాణాల నుంచి 30 శాతం కమీషన్లు తీసుకున్నారు. ఇవ్వని వారిపై ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు దాడులు చేయడం రాష్ట్రం అంతా చూసిందన్నారు. తర్వాత ఆ దుకాణాలన్నింటిని టీడీపీ నాయకులు ఆధీనంలో ఉన్న మాఫియా చేతిలో తీసుకొచ్చారన్నారు. వీలైనంత మేర లిక్కర్ అమ్మకాలు పెంచడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు, వీలైనంత మేర అవినీతి సొమ్మును దండుకోవడానికి అనధికారికంగా 20 నుండి 30 శాతం మేర లిక్కర్ అమ్మాలని టార్గెట్ పెట్టారన్నారు. పర్మిట్ రూమ్స్ ఏర్పాటు చేసి వాటి నుంచి డబ్బులు వసూళ్లు చేసుకుని భారీ అర్జిస్తున్నారన్నారు. వీధి వీధికి బెల్టు షాపులు ఏర్పాటు చేశారని, ఆ బెల్టు షాపులకు కూడా వేలం పాటలు పెట్టి డబ్బు వసూళ్లు చేస్తున్నారన్నారు. వేల కోట్ల రూపాయల మేర ప్రభుత్వ ఖజానాకు నష్టం చేస్తూ, ఆ డబ్బును దోచుకుంటున్న టీడీపీ కూటమి నాయకుల చేతిలో ఈ లిక్కర్ మాఫియా రాష్ట్రంలో నిర్విఘ్నంగా కొనసాగుతోందన్నారు. చంద్రబాబు ఒక వైపుఈ మాఫియాను నడిపిస్తూ, ప్రతి నెల వందల కోట్ల రూపాయలు తనకు, తన పార్టీ నాయకులకు దోచిపెడుతూ, ఆ అవినీతి ప్రజల దృష్టికి వెళ్లనీయకుండా వైఎస్సార్‌సీపీ హయాంలో అత్యంత పారదర్శకంగా తీసుకొచ్చిన లిక్కర్ విధానంపై తప్పుడు కేసులు పెడుతూ, ఆ నీడలో ఈ మాఫియాను నడిపిస్తున్నాడన్నారు. అంతిమంగా టీడీపీ గత ఐదేళ్లలో చేసిన అవాస్తవ ఆరోపణలు, అభూత కల్పనలనే గుదిగుచ్చి దర్యాప్తు నివేదికగా ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు బరితెగించిందన్నది స్పష్టమైంది. దర్యాప్తు పేరిట తాము సాధించింది శూన్యమని గ్రహించిన సిట్ ఏమి చేయలేక మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరును నివేదికలో ప్రస్తావించడం ద్వారా ప్రజల్ని తప్పు దారి పట్టించేందుకు యత్నించిందన్నారు.

# పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల



**ఒంగోలు, ప్రభాతవార్త**



గురువారం ఒంగోలులో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌నావు పాల్గొన్నారు. నగరంలోని రిమ్స్ హాస్పిటల్ నందు భగవాన్ సత్యసాయి బాబా వారి అన్నదానం నూతన కిచెన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. నగరంలోని 37వ డివిజన్ మంగమూరు రోడ్డు జంక్షన్ నందు ఏ1 రీడింగ్ రూమ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. నగరంలోని 33వ డివిజన్ నందు శ్రీ భగవాన్ సత్యసాయి బాబా ఆరాధోత్సవం సందర్భంగా పూజా కార్యక్రమం, అన్నదాన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక వార్త

# సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఎంపీడీఓ

**హనుమంతునిపాడు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**

మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామ సచివాలయాన్ని గురువారం ఎంపీడీఓ రంగ సుబ్బారాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించిన ఆయన సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా లేదా ఆరా తీశారు. ఏఏ సమస్యలు ఎక్కువగా సచివాలయానికి వస్తున్నాయో అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సర్వేలు పూర్తి చేయాల్సిందిగా ఆయన ఆదేశించారు. సచివాలయానికి వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు



# విమానాశ్రయ స్థలాన్ని పరిశీలించిన జాయింట్ కలెక్టర్

**కొత్తపట్నం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**



కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామంలోని విమానాశ్రయ స్థలాన్ని జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాల్ కృష్ణ క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగింది. ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా వారి ఫీజుబిలిటీ రిపోర్ట్ అనుసరించి భూసేకరణ ప్రక్రియను ప్రారంభించడం కోసం జాయింట్ కలెక్టర్ వచ్చినట్లు తాసిల్దార్ మధుసూదన్‌రావు తెలియజేశారు. అల్లూరు, కొప్పోలు, ఆలూరు మధ్యలో సుమారు 1000 ఎకరాలు ఎయిర్పోర్టుకు స్థలాన్ని కేటాయించబడిందని తెలియజేశారు. ఆ స్థలంలోని వాన్ పిక్ భూములను కూడా పరిశీలించినట్లు ఆయన తెలియజేశారు. ఎయిర్పోర్టు సంబంధించిన స్థలానికి సంబంధించిన స్కెచ్ ను జేసీ కి వివరించడం జరిగిందని అన్నారు. ఆయన వెంట ఒంగోలు ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, కొత్తపట్నం తాసిల్దార్ మధుసూదన్ రావు ,మండల సర్వేయర్ సుధీర్ బాబు ,రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వార్త 29వ వార్షికోత్సవ శుభాకాంక్షలు...

సమాజ శ్రేయస్సే వ్యక్తి శ్రేయస్సు - విద్య లక్ష్యం విజ్ఞానము - విద్య వ్యాపారవస్తువు కారాదు

బి.వి.సుబ్బయ్య హైస్కూల్ పేర్నమిట్ట, ఒంగోలు

స్థాపితం: 1963 ప్రభుత్వంచే గుర్తింపబడిన విద్యాసంస్థ

Cell: 94944 70850, 88855 10515, 94942 20476, 79013 03125

✤ ఒకరిద్దరి విద్యార్థుల ర్యాంకుల గురించే కాకుండా విద్యార్థులందరికి అత్యధిక మార్కులు వచ్చునట్లు బోధించే విద్యా సంస్థ

✤ మా సంస్థ లక్ష్యం : ప్రతి విద్యార్థిని సమర్థునిగా, ఉత్తమ పౌరునిగా, తోటి మానవుని గౌరవించే వానిగా తయారు చేయుటమే మా సంస్థ లక్ష్యం

✤ ప్రతి విద్యార్థి మీద మా ఉపాధ్యాయులు వ్యక్తిగత శ్రద్ధ తీసుకొందురు. అందువలననే ఈ సంస్థ సగటు మార్కును ప్రకటించగలుగుచున్నది.

2025 మార్చి 10వ తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల శాతం : 97%

2025 మార్చి 10 వ తరగతి సగటు మార్కు : 483.31%

అడ్మిషన్లు జరుగుచున్నవి

పరీక్షకు హాజరైనవారు: 133 ప్రథమ శ్రేణి: 125 ద్వితీయ శ్రేణి: 04



586/600 స్కూల్ ఫస్ట్ – టి. అనిల్ కుమార్ H.T.No: 2517103297

586/600 స్కూల్ ఫస్ట్ – కె. బ్రహ్మాచరణ్ H.T.No: 2517103960

583/600 స్కూల్ సెకండ్ – ఎ. బ్రహ్మనంద రెడ్డి H.T.No: 2517104542

582/600 స్కూల్ థర్డ్ – ఇ. పూర్ణ వంశీ H.T.No: 2517104706

580/600 – సిహెచ్. సుజీవన్ H.T.No: 2517104800

579/600 – యస్.వి. సిద్ధార్థ H.T.No: 2517103660

570/600 – యం.వి.యస్. ధీరజ్ H.T.No: 2517103165

569/600 – వై. జశ్వంత్ H.T.No: 2517103926

550 పైగా మార్కులు వచ్చిన వారు: 25

500 పైగా మార్కులు వచ్చిన వారు: 63

450 పైగా మార్కులు వచ్చిన వారు: 96

| జనరల్ తెలుగు | హిందీ | ఇంగ్లీషు | లెక్కలు | సైన్సు | సోషల్ |
|---|---|---|---|---|---|
| 100 | 98 | 97 | 100 | 100 | 100 |

ఈ విజయము మా సంస్థ సమిష్టి కృషి ఫలితము

సెక్రటరీ & కరస్పాండెంట్: బి. కోటిలింగము, B.E.

హెడ్ మాస్టర్: వై. వేణుగోపాల్ రెడ్డి B.A, B.Ed., B.L.


# అభివృద్ధి' జోరు.. 'సంక్షేమం' జీరో..!

## - సూపర్‌సిక్స్‌పై ప్రజలు ఆరా - అభివృద్ధిలో స్వకార్యం స్వామికార్యం

**ఒంగోలు, ప్రభాతవార్త**

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వాలకు రెండు కళ్లు. వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలన్ని అందించి అభివృద్ధిని మూలన పడేసింది. టీడీపీ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాల జోరు పెంచింది. ఇదే సమయంలో సంక్షేమ కార్యక్రమాలు జీరోగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తుంది. ఇలాంటి సమయంలో ప్రజలు ఎన్నికల్లో కూటమి నేతలు ఇచ్చిన హామీలు ఆరా తీస్తున్నారు. గల్లాపెట్టే ఖాళీగా ఉందని చెప్తున్నా ఎన్నికల సమయంలో తెలియదా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఒంగోలు నగరంలో రోడ్లు, డ్రైనేజీలు, పార్కులు, సెంట్రల్ లైటింగ్ వంటి అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా సాగుతున్నాయి. తమ కోసం పని చేసిన నాయకులు, కార్యకర్తలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు ప్రజలకు ఉపయోగకరంగా కనిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉపాది హామీ పథకం కింద రోడ్ల నిర్మాణం సాగుతుంది. కూటమి ప్రభుత్వంలో కొందరు ఒకే అంటుండగా, మరి కొందరు పెదవి విరుస్తున్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి విషయంలో కొంత జోరు కనిపిస్తున్నా, సంక్షేమంవిషయంలో వెనుకబడిందన్న ఆరోపణలు ఎదుర్కొంటుంది. వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు పంపిణీ చేసి రోడ్లు, డ్రైనేజీ, మౌలిక సదుపాయాల విషయంలో నిర్లక్ష్యం చేసింది. అభివృద్ధి, సంక్షేమాన్ని సమతూల్యం చేయలేకపోయింది. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను కూడకట్టుకుంది. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో అనేక హామీలు కురిపించింది. వచ్చిన వెంటనే అమలు చేస్తామని హామీ ఇచ్చింది. డీఎస్సీ 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. వాలంటీర్లకు రూ.10వేలు, పింఛన్ల పెంపు, ప్రతి మహిళకు నెలకు రూ.1500, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు భృతి, తల్లికి వందనం కింద ఒక్కో బిడ్డకు రూ.15వేలు, మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, ప్రతి రైతుకు ఏటా రూ.20వేలు, 20లక్షల ఉద్యోగాలు, ఇలా అనేక హామీలు ఇచ్చారు. పింఛన్లు ఉచిత గ్యాస్ అమలు చేస్తున్నారు. మిగిలిన వాటిని దశల వారీగా చేస్తామని చెప్తున్నా ప్రజలు నమ్మటం లేదు. ఏడాది కావస్తున్నా ఇచ్చిన హామీలు మరచిపోయారని సాధారణ ప్రజల నుంచి కూటమి ప్రభుత్వానికి వస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాలు పేదలు నివసించే వాడల్లో ప్రభుత్వ పనితీరును ప్రశ్నిస్తున్నారు. వైసీపీ, టీడీపీ ప్రభుత్వాల తీరుతెన్నులు చర్చకు పెడుతున్నారు. ఉచిత ఇసుక అందిస్తున్నా అధికార పార్టీ నేతలు అక్రమాలకు ఉపయోగకరంగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. మద్యం పాలసీని తీసుకువచ్చినా, అధికార పార్టీ నేతలే ఎక్కువ మంది వీటిని దక్కించుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. మైనింగ్‌లో అక్రమాల కారణంగా వ్యాపారులు భారీగా నష్టపోయారు. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం సమతుల్యం చేయలేకపోతుందనే విమర్శలు ఎదుర్కొంటుంది. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు గల్లా పెట్టె ఖాళీగా ఉందని చెప్తున్నా ప్రజలు పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో ఈ విషయం తెలియదా అని ప్రశ్నిస్తున్నారు. ఇది ఇలానే కొనసాగితే కూటమి ప్రభుత్వంపై మరింత వ్యతిరేకత కనిపించేలా ఉంది.

### ఒంగోలులో అభివృద్ధి జోరు :

ఒంగోలు నగరం అభివృద్ధి కార్యక్రమాల్లో వేగంగా సాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద సిమెంటు రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు సాగుతున్నాయి. ఒంగోలు నియోజకవర్గంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి రోడ్లు, డ్రైనేజీ, సెంటర్ లైటింగ్, పార్కుల అభివృద్ధి, డివైడర్లకు బొమ్మల ఏర్పాటు, డివైడర్లకు రంగుల ఏర్పాటు సైడు కాలువలు, రోడ్ల వెడల్పులు వంటి అభివృద్ధి కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టారు. పనులు కూడా వేగంగా సాగుతున్నాయి. దాదాపు జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున రోడ్ల నిర్మాణం సాగుతుంది. ఉపాధి పథకం కింద వీటిని చేపడుతున్నారు. ఇక్కడ స్వకార్యం, స్వామికార్యం అన్నట్లు సాగుతుంది. గత ఎన్నికల్లో తమ విజయం కోసం పని చేసిన నాయకులు, కార్యకర్తలకు పనులు మొత్తం అప్పగించి వారి చేత పనులు చేయిస్తున్నారు. వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికే పెద్ద పీట వేస్తున్నారు.న కార్యక్రమాల ద్వారా గత ప్రభుత్వానికి, నేటి ప్రభుత్వానికి ప్రజలు తేడాలు గుర్తిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధిలో జోరు కనిపిస్తున్నా, సంక్షేమ విషయంలో వెనుకబడిపోయిందని లెక్కలు చెప్తున్నాయి.

# కార్పొరేట్‌కు ధీటుగా కేజీబీవీలు

## - దర్శి టీడీపీ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

**తాళ్లూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**



కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) లలో అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు దర్శి నియోజకవర్గం టీడీపీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ అన్నారు. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు అత్యుత్తమ విద్య అందేలా కేజీబీవీలను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో రూ.కోటి 67 లక్షలతో నిర్మాణం చేపట్టనున్న జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. కొబ్బరికాయ కొట్టి, శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ అభివృద్దే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత పాఠశాలల్లోని ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్య ద్వారా అభివృద్ధి సాధ్యమని గుర్తించిన కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి అనేక కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తుందన్నారు. ఆనాడు తెలుగుదేశం ప్రభుత్వంలో కేజీబీవీను టీడీపీ ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. నేడు ఆ పాఠశాల పేదల జీవితాలలో విద్య కాంతులు నింపుతున్నాయి.యువ నేత యువతకు స్ఫూర్తి ప్రదాత ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు, ఉన్నత విద్యను అభ్యసించిన మహోన్నత వ్యక్తి అలాంటి వ్యక్తి మన విద్యాశాఖ మంత్రిగా ఉండడం రాష్ట్ర విద్యాభివృద్ధికి ఎంతో కృషి జరుగుతుందని చెప్పుకోవచ్చన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వెంటనే ఇంజనీరింగ్ కాలేజీలకు ఇవ్వాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయడం, విద్యకు సంబంధించిన బకాయిలు వెంటనే విడుదల చేయడం స్కూల్ భవనాలు నిర్మించుకోవడం పాఠశాలల్లో సరికొత్త సిలబస్‌ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచడం అనేక పరిశ్రమలను రాబట్టుకునేందుకు దావుస్ పర్యటన ద్వారా సాధ్యం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి నియోజకవర్గం నాయకులు కడియాల లలిత్ సాగర్, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి, నాయకులు ఇడమకంటి శ్రీనివాసరెడ్డి, శాగం కొండారెడ్డి, మానం రమేష్‌బాబు, మేడగం వెంకటేశ్వరరెడ్డి, గొల్లపూడి వేణుబాబు, పెద్ద కాలేషావలి, రాచకొండ వెంకట్రావు, పిన్నిక రమేష్, గొంది రమణారెడ్డి, పాశం సూరిబాబు, కైపు రామకోటిరెడ్డి, యాతం శ్రీనివాస్‌రెడ్డి, రావినూతల పరిశుద్ధరావు,గంగిరెడ్డి కృష్ణారెడ్డి, చాట్ల దేని, గోపిరెడ్డి వెంకటేశ్వరరరెడ్డి,గూడా ప్రభాకర్‌రెడ్డి, మీరా మోహిద్దిన్, రామ లక్ష్మయ్య, అధికారులు, ఎంపీడీఓ దార హనుమంతరావు, ఎంఈఓ జి.సుబ్బయ్య, కేజీబీవీ ప్రిన్సిపాల్ పి.సుజిత పాల్గొన్నారు.

# పంచాయితీల బలోపేతానికి కలిసి కృషిచేద్దాం

## - ఎంపిడిఓ వెంకటరామిరెడ్డి

**రాచర్ల, ఏప్రిల్ 24 ,ప్రభాతవార్త**



పంచాయితీల అభివృద్ధికి అందరం కలిసి కృషిచేద్దామని మండల ఎంపిడిఓ ఎస్ వెంకట రామిరెడ్డి అన్నారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో పంచాయితీ రాజ్ దినోత్సవ కార్యక్రమాన్ని గురువారం ఆయన సంబంధిత సిబ్బందితో కలిసి ఘనంగా నిర్వహించారు. ముందుగా గాంధీజీ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. పూర్వపు రోజుల్లో గ్రామసభలు, కార్యక్రమాలు జాతీయ స్థాయిలో జరిగేవని, పంచాయితీ రాజ్ వ్యవస్థ ఏర్పడి ఆ చట్టం అమలులోకి వచ్చాక గ్రామాల్లోని గ్రామసభలు నిర్వహించి గ్రామాల అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై చర్చలు జరుగుతున్నాయన్నారు. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా ఏప్రిల్ 24న 1993నాడు పంచాయితీ రాజ్ వ్యవస్థ అమలులోకి వచ్చిందని కాబట్టి ఈ రోజును మనం జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవంగా జరుపుకుంటామని అన్నారు. ఈ రాజ్యాంగ సవరణ దేశవ్యాప్తంగా పంచాయితీ రాజ్ వ్యవస్థకు దిశానిర్దేశం ఇచ్చిందన్నారు. 29అంశాలపై అధికారులు కల్పిస్తూ 11వ షెడ్యూల్‌లో 2019లో ప్రభుత్వ విధివిధానాలు పొందుపరిచిందని అన్నారు. పంచాయితీ రాజ్ ఏర్పడడం ద్వారా గ్రామాల అభివృద్ధితోపాటు ప్రజల సమస్యలు కూడా గ్రామాల్లోనే పరిష్కరించుకునే విధంగా ప్రభుత్వాలు చట్టాలు చేశాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. పంచాయితీరాజ్ చట్టం ద్వారా సచివాలయాల్లోనే జనన, మరణ, వివాహ, తదితర వివిధ రకాల ధృవీకరణ పత్రాలు పొందే అవకాశం ప్రభుత్వం కల్పించిందని కూడా ఆయన తెలిపారు. స్వచ్ఛభారత్, స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర ద్వారా చేపట్టే కార్యక్రమాలు కూడా పంచాయితీ రాజ్ వ్యవస్థ ద్వారాననే నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం పంచాయితీ రాజ్ ద్వారా ప్రజల వద్దకే పాలన వచ్చిందని, సంక్షేమ పథకాలు ఇల్లవద్దకు వస్తున్నాయని ఇది కేవలం పంచాయితీరాజ్ వ్యవస్థ ద్వారానే సాధ్యమైందని అన్నారు. కాబట్టి పంచాయితీల అభివృద్ధి బలోపేతానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రత్యేక కృషిచేయాలని అందుకు ప్రజలందరి సహకారం అవసరమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి ఐ వెంకటేష్, ఎంపిడిఓ కార్యాలయ ఏఓ వి శ్రీనివాస్ కమార్, జూనియర్ అసిస్టెంట్ రాజ్ కుమార్, టైపిస్ట్ మాధవీలత, ఉపాధిహామీ ఏపిఓ ఆర్ మహాలక్ష్మీ, సచివాలయ కార్యదర్శులు వి అనీల్ కుమార్, ఏవి సురేష్, కె శివరామకృష్ణ, ఎం శిరీషా దేవీ, జి ప్రతాప్ రెడ్డి, బి బాలస్వామి, వి విష్ణువర్ధనాచారి, టి గణేష్, ఎంవి నాయక్, వైఎన్‌జి రంగనాయకులు, టి గురునాథరెడ్డి, కె నారాయణ స్వామి, జె వీరగురుడు, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ స్వరాజ్య చైతన్య సదస్సు

**ఒంగోలు టౌన్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**

జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవం సందర్భంగా నేషనల్ లోకల్ గవర్నమెంట్స్ ఛాంబర్ ఆధ్వర్యంలో మల్లయ్య లింగం భవనంలో గ్రామ స్వరాజ్య చైతన్య సదస్సు నిర్వహించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన గ్రామ స్వరాజ్య సాధన సమితి అధ్యక్షులు జి.వీరభద్రాచారి మాట్లాడుతూ బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ సిఫార్సులు అనుసరించి పంచాయితీరాజ్ వ్యవస్థ ఏర్పాటు అయిందని, గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ పంచాయితీరాజ్ వ్యవస్థ గ్రామీణాభివృద్ధికి మూలస్థంభం అని, గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర స్ఫూర్తిదాయకం అన్నారు. అనంతరం నగర మేయర్ గంగాడ సుజాత చేతుల మీదుగా ఉత్తమ సర్పంచ్‌లకు సేవా పురస్కారాలు అందజేశారు.



# వేమవరంలో ఉచిత వైద్య శిబిరం



**బల్లికురవ, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
గుంటుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని వేమవరంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్యశిబిరాన్ని గ్రామ సర్పంచ్ వెంకట సుబ్బయ్య చౌదరి ప్రారంభించారు. పంచాయతీ పరిధిలోని నాలుగు రోడ్ల కూడలిలో 200 పైగా గ్రానైట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. అందులో పరాయి రాష్ట్రం నుండి అధిక సంఖ్యలో ఉపాధి కోసం వలస వచ్చిన కార్మికులు పనులు చేస్తుంటారు. వీరి కోసం ఈ వైద్య శిబిరంలో వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి రవితేజ తెలియజేశారు. ఈ వైద్యశిబిర నిర్వహణ కోసం ఎంవీ ఫౌండేషన్ తమ వద్ద సహకారం అందజేసింది. ఈ కార్యక్రమంలో గ్రానైట్ ఫ్యాక్టరీల ప్రతినిధులతో పాటు ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధి హరిహరరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం



**బల్లికురవ, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం వేడుకలు గురువారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశం మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ కుసుమకుమారి మాట్లాడుతూ భారత రాజ్యాంగం పంచాయతీలను, స్వయం ప్రభుత్వ సంస్థలుగా గుర్తిస్తుందన్నారు. స్థానిక స్వపరిపాలన కోసం, సంస్థలుగా తమ విధులను నిర్వర్తించడానికి, పంచాయతీలకు అధికారాలను వికేంద్రీకరించడానికి రాజ్యాంగం రాష్ట్రాలకు అధికారం వచ్చిందన్నారు. ఈ చట్టం 1993 ఏప్రిల్ 24 నుండి అమల్లోకి వచ్చిందన్నారు. ఫలితంగా గ్రామాణ ప్రాంతాలు నేడు కనీసమౌలిక వసతుల కల్పనతో విరాజిల్లుతున్నాయన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు జాతిపిత మహాత్మాగాంధీకి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి అధ్యక్షత వహించగా డిప్యూటీ ఎంపీడీఓ సుమతి, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పెన్షన్ మార్పిడికి దరఖాస్తు చేసుకోండి

**బల్లికురవ, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
పెన్షన్ అందుకుంటూ భర్త చనిపోతే భార్య ఆ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే విధానాన్ని ప్రభుత్వం కల్పించిందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కుసుమకుమారి అన్నారు. డిసెంబర్ 2023 నుండి అక్టోబర్ 2024 మధ్య చనిపోయిన వారి భార్యలకు ఈ నిబంధన వర్తిస్తుందన్నారు.

## ఉత్తమ సర్పంచ్‌గా పందిరి అంజిబాబు



**బల్లికురవ, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంలో భాగంగా మండల కేంద్రమైన బల్లికురవ సర్పంచ్ పందిరి అంజిబాబు ఉత్తమ పంచాయతీ సర్పంచ్‌గా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. బల్లికురవ గ్రామాభివృద్ధిలో కనీస మౌలిక వసతుల కల్పనలో అనతి కాలంలోనే పంచాయతీ ప్రజల అభిమానానికి పాత్రుడైన అంజిబాబుకు ఈ అరుదైన అవకాశం దక్కింది. ఒంగోలులో నిర్వహించిన కార్యక్రమం లో జాతీయ సర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి జి.వీరభద్రచారి, నూకసాని బాలాజీ, పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామాభివృద్ధిలో తన వంతు పాత్ర పోషించినందుకు అరుదైన గుర్తింపురావడం ఆనందంగా ఉందని అంజిబాబు అభిప్రాయం వ్యక్తం చేశారు.

### ఇరుసలగుండం సర్పంచ్ ఓబుల్‌రెడ్డికి ఉత్తమ నాయకత్వ సేవా పురస్కారం



**కొనకనమిట్ల, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
మండలంలోని ఇరుసలగుండం సర్పంచ్ గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డికి ఉత్తమ స్థానిక నాయకత్వ సేవా పురస్కారం అందుకున్నారు. గురువారం ఏపీ గ్రామ స్వరాజ్య సాధన సమితి ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా సేవా పురస్కారం లభించింది. ఏపీ టూరిజం డైరక్టర్ నూకసాని బాలాజీ, ఒంగోలు నగర పాలక సంస్థ మేయర్ గంగాడ సుజాత చేతుల మీదుగా సేవా పురస్కారం అందుకున్న సర్పంచ్ ఓబుల్‌రెడ్డిని ఎంపీటీసీ కరేటి నాగలక్ష్మీ, రామకోటేశ్వరరావు, వార్డు సభ్యులు అభినందనలు తెలిపారు.

### మార్టూరు సమగ్రాభివృద్ధికి కృషి చేస్తా - ఎమ్మెల్యే ఏలూరి



**మార్టూరు, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**
మార్టూరు పంచాయతీ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని, సమస్యలు, చేయాల్సిన అభివృద్ధిపై స్పష్టమైన అవగాహన ఉందని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. గురువారం మార్టూరు గ్రామ పంచాయతీ పరిధిలోని నూతన సులభ్ కాంప్లెక్స్‌ను ఎమ్మెల్యే ఏలూరి ప్రారంభించారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ పంచాయతీలో చెత్త సేకరణ రిక్షాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటి పన్ను చెల్లించిన ఇద్దరికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన సభలో ఆయన మాట్లాడారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పర్చూరు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపానన్నారు. కోట్లాది రూపాయల నిధులతో అన్ని రంగాలను అభివృద్ధి చేశానని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం విధ్వంసానికి గురైందన్నారు. రాష్ట్రంలో కోట్లాది రూపాయల పనులను ఎక్కడికక్కడ నిలిపివేశారని, దీంతో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందన్నారు. రాష్ట్రం అభివృద్ధిలో 20 ఏళ్ళ వెనక్కి వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయలతో చంద్రబాబు పనులను ప్రారంభిస్తే ఆ పనులు అన్నింటిని రద్దు చేసి అభివృద్ధికి ఆటంకం కలిగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మన పర్చూరు నియోజకవర్గంలో 300 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు నిలిపివేసినట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం మళ్ళీ ప్రజా పాలనకు శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. ప్రజా అవసరాలను అనుగుణంగా దశల వారీగా అభివృద్ధి పనులు అన్నింటిని పూర్తి చేసే బాధ్యత తనదేనన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసే నియోజకవర్గంగా తీర్చిదిద్దానని ఎమ్మెల్యే ఏలూరి వెల్లడించారు. రామాయే మాదిక్లలో ప్రతి ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత నీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మార్టూరులో పట్టణంలో సులభ్ కాంప్లెక్స్ ను ప్రజలు ఉపయోగించుకునేలా సులభ్ కాంప్లెక్స్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మార్టూరుకు చెందిన శ్రీరామ్ రామయ్య, గోవిందమ్మ, చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు శ్రీరామ్ శేషగిరిరావు, మార్టూరులో వాటర్ ప్లాంట్‌కు రూ.2 లక్షల విరాళంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు.

**విద్యార్థులకు అభినందనలు :**
మార్టూరు శ్రీహర్షిని ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థులను ఎమ్మెల్యే ఏలూరి అభినందించారు. ఇటీవల విడుదల చేసిన పదో తరగతి పరీక్ష ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శాలువాతో సత్కరించి అభినందించారు. యాజమాన్యానికి ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించాలని యాజమాన్యానికి సూచించారు. 600 మార్కులకు గాను 592 మార్కులు సాధించిన జొన్నలగడ్డ భాను ప్రత్యూష ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేకంగా అభినందించారు. 590 మార్కులు సాధించిన రావుల నీరజ్, 588 మార్కులు సాధించిన కృష్ణ కార్తీక్‌ను ఎమ్మెల్యే ఏలూరి అభినందించారు. విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. భవిష్యత్ అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

### ఉపాధి హామీ మస్టర్ల నిర్వహణ పారదర్శకంగా ఉండాలి



**వెలిగండ్ల, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
వెలిగండ్ల మండలంలోని హుస్సేన్‌పురం, పద్మాపురం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ భాషా, ఉపాధి హామీ ఏపీఓ శ్రీనివాస్ నాయక్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి పనుల్లో ఎటువంటి అవకతవకలు జరగడానికి వీలు లేదని మస్టర్ల నిర్వహణలో ఎటువంటి అవినీతి జరగకూడదని ప్రభుత్వ నిర్ణయించిన కొలతల ప్రకారం పని చేయాలని ఉపాధి కూలీలకు సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అనంతరం పంచాయతీలో నిర్మిస్తున్న నీటి తొట్లను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని, ఎండలు సమీపిస్తున్న తరుణంలో మూగజీవాలకు తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఈ నీటి తొట్లు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ భాషా, ఉపాధి హామీ ఏపీఓ శ్రీనివాస్ నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మల్లవరం వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



**మద్దిపాడు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
మల్లవరం వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మే నెల 7వ తేదీ నుండి 17వ తేదీ వరకు నిర్వహించినట్లు దేవస్థాన కార్యనిర్వాహక అధికారి దామా నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నాడు మల్లవరం వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణంలో స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికనుగ్రామ పెద్దల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యనిర్వాహక అధికారి దామా నాగేశ్వరరావు మాట్లాడుతూ వెంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిగా మే నెల 7వ తేదీ న రాత్రి అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమై ముఖ్యంగా 14వ తేదీ ఉదయం 10గంటలకు స్వామివారి కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు, సామాజిక వర్గాల వారీగ ఆయా సంఘాల తరుపున బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతి రోజు రాత్రి వివిధ వాహనాలపై శ్రీవారు గ్రామ పురవీధుల నందు విహరించునున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకులు నారాయణం వెంకటాచార్యులు(రవికుమార్) నారాయణం రాజశేఖరాచార్యులు, శ్రీహరి వనం కమిటీ అధ్యక్షులు మార్నేని కృపారావు, మల్లవరం గ్రామ పెద్దలు మార్నేని రాఘవేంద్రరావు(రాఘవ), నారిపెద్ది వరహాల చౌదరి, నారిపెద్ది బాబురావు, మార్నేని సుబ్బారావు, పొన్నం వెంకటేశ్వర్లు, నారా నాగిరెడ్డి, ముప్పవరపు ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఏలూరి





**మార్టూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
గురువారం మండలంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొన్నారు. శ్రీరాం రామయ్య గోవిందమ్మ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు శ్రీరాం శేషగిరిరావు ఆర్వో ప్లాంట్ నిమిత్తం రూ.2లక్షల చెక్కును ఎమ్మెల్యే ఏలూరి అందజేశారు. ఏలూరి చారిటబుల్ ట్రస్టు ద్వారా వలపర్ల గ్రామానికి చెందిన షేక్ షాహినా అనే మహిళకు వినికిడి యంత్రాన్ని అందజేశారు. అదేవిధంగా మార్టూరులోని పెద్ద ఖానా దగ్గర నూతనంగా నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ సభలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెంకయ్య ఆశ్రమంలో వస్త్రాలు పంపిణీ, అన్నదానం



**మార్టూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
మార్టూరు కోరిగుంట్ల గవర్నమెంట్ హాస్పిటల్ పక్క రోడ్డులోని వెంకయ్య ఆశ్రమంలో ఓం శ్రీ సాయిరాం భగవాన్ సత్యసాయి బాబా ఆరాధన మహోత్సవ సందర్భంగా వృద్ధులకు ఆడవారికి మగ వారికి చీరలు, లుంగీలు, షర్టులు పంపిణీ కార్యక్రమం, మధ్యాహ్నం12గంటలకు అన్న సంతర్పణ కార్యక్రమంను వరపర్ల వాస్తవ్యులు వి.సత్యసాయి రామవాసు(ప్రెసిడెంట్ మర్చంట్స్ అసోసియేషన్ వరపర్ల శ్రీ సత్యసాయి క్లాత్ షోరూం ప్రొప్రైటర్) అరుంధతి, కుటుంబ సభ్యులు జరిపించారు. సత్యసాయి రామవాసు మాట్లాడుతూ ఆశ్రమానికి అన్ని విధాలుగా సహకారమందిస్తామని తెలిపారు. ఆశ్రమఅధ్యక్షులు తన్నీరు శివ రాజేష్ దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

### పుష్పాలంకరణ వేడుకలో బాలికను ఆశీర్వదించిన

## వైసీపీ మండల కన్వీనర్ ఘంటా వెంకటరమణారెడ్డి



**పెద్దదోర్నాల, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
పెద్దదోర్నాల మండలం కడపరాజుపల్లి గ్రామానికి చెందిన వట్టి రమణారెడ్డి కుమార్తె పుష్పాలంకరణ వేడుక కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి పెద్దదోర్నాల వైకాపా మండల కన్వీనర్ ఘంటా వెంకట రమణారెడ్డి పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ గుండారెడ్డి రమణారెడ్డి, బూత్ కన్వీనర్ గుంటూరు గాలిరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో వార్షికోత్సవ సంబరాలు



**యర్రగొండపాలెం,ఏప్రిల్24,ప్రభాతవార్త**
యర్రగొండపాలెం మండంలోని వివిధ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. యర్రగొండపాలెం పంచాయతీలోని వైకొత్తపల్లె గ్రామంలోని యంపియుపియస్ పాఠశాలలో పట్టంలోని యంపిపియస్(బిసి) పాఠశాలల్లో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగిందని యంఇవో పి.ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రబుత్వ పాఠశాలలో చదివే పిల్లలు మానసిక పెరుగుదల, శారీరక ఎదుగుదల కోసం వార్షికోత్సవం, జాతీయ పండుగలు, క్రీడా కార్యాక్రమాలు జరుపుతుంటామని ఆయన అన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అని ్న ప్రభుత్వ పాఠశాలలో ఉంటాయని విద్యార్థుల తల్లిదండ్రులను విన్నవించుకోవడం జరిగిందన్నారు. అనంతరం చిన్నారుల ప్రదర్శనలు ఆనందాన్ని కలిగించాయన్నారు. పాఠశాలలో టాపర్స్ గా నిలిచిన వారిని జ్ఞాపికలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.రమదేవి, లాలా జ్యోతి, జె.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు బాబుల్ నాయక్, నాగేశ్వరరావు నాయక్, మహేశ్వరీ, సిఆర్‌యంటి కోటేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రవేటు స్కూల్స్‌కు ధీటుగా గవర్నమెంట్‌స్కూల్ విద్యార్థులు



**యర్రగొండపాలెం,ఏప్రిల్24,ప్రభాతవార్త**
పదోతరగతి పరీక్షా ఫలితాల్లో మండల ప్రభుత్వ పాఠశాలలో బొందిలి గాయత్రి సింగ్ విద్యార్థిని 600 మార్కులకు గాను 582 మార్కులు సాదించి పాఠశాల టాపర్‌గా నిలిచిందని టిడిపి మండల పార్టి అధ్యక్షుడు చేకూరి సుబ్బారావు అన్నారు. గరువారం తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో గాయత్రిని నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చేకూరి సుబ్బారావు మాట్లాడుతూ భవిషత్తులో మరిన్ని మంచి ఫలితాలను సాధించే దిశగా పయనించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రవేటు పాఠశాలలకు దిటుగా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పనిచేస్తున్నరని ఆయన అన్నారు. అనంతరం గాయత్రికి 5వేలు రూపాయలు నగదును ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంచర్ల సత్యనారాయణ గౌడ్, షేక్.మస్తాన్‌వలి, బొందిలి కిషోర్ సింగ్, దొంతా వెంకట్రావు, నక్కారాములు, తదితరలు పాల్గొన్నారు.

## పర్యాటకులపై ఉగ్రదాడి హేయమైన చర్య

### - దద్దాల నారాయణ యాదవ్




**కనిగిరి, ఏప్రిల్ 24 ,ప్రభాతవార్త**
జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో అమాయక పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడిని కనిగిరి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణయాదవ్ తీవ్రంగా ఖండించారు. ఈ దాడిని అత్యంత హేయమైన చర్యగా పిలిచి, దీనిని పిరికితనపు ప్రతీకగా అభివర్ణించారు. గురువారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ ఈ దాడి తనను ఎంతో దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ దారుణ ఘటనలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన పరితాపం తెలిపి, ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం కల్పించాలని కోరారు. ఇటువంటి దాడులు భారతదేశ స్ఫూర్తిని చెదరగొట్టలేవని, భారతీయుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేవని స్పష్టం చేశారు. ఈ దాడికి పాల్పడిన నిందితులకు కఠిన శిక్షణ విధించాలి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు.

## నేడు ఏల్చూరులో శ్రీ ఆంకాళ పనమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం

### - భారీగా అన్న సంతర్పణ





**సంతమాగులూరు ఏప్రిల్ 24 ప్రభాతవార్త**
సంతమాగులూరు మండలం ఏల్చూరులో శ్రీ ఆంకాళ పనమేశ్వరి అమ్మవారు మరియు పోతురాజు సమేత పంచముఖ నాగేంద్ర స్వామి ఆలయాల ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం జరుపనున్నట్లు ఉత్సవ నిర్వహణ కమిటి తెలిపింది. ఈ సందర్భంగా ఉదయం నుండి ఆలయంలో మేదపండితుల మంత్రోచ్చారణలతో ఆలయ సాంప్రదాయపూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహిస్తారన్నారు. ఈ వేడుకల్లో భక్తులు అదిక సంఖ్యలో పాల్గొని స్వామితెలిపింది. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుండి ఆలయ సాంప్రదాయం ప్రకారం వేదపండితుల మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు చేస్తారని ఈ కార్యక్రమంలో భక్తులు అదిక సంఖ్యలో పాల్గొని స్వామివార్ల ఆశిస్సులు పొందాలన్నారు. ఈ సందర్భంగా గ్రామ దాతల సహకారంతో ఉదయం 11 గంటల నుండి సాయంత్రం వరకు భారీ అన్న సంతర్పణ కూడా జరుగుతుందన్నారు.

### శింగరకొండ ముఖ పండప నిర్మాణానికి ఊటుకూరి వారు రు.1,11,116లు విరాళం



**అద్దంకి రూరల్ ఏప్రిల్ 24 ప్రభాతవార్త**
సింగరకొండ ముఖ పండప నిర్మాణానికి ఊటుకూరి నాగయ్య వెంకటసుబ్బమ్మల జ్ఞాపకార్థం వారికుమారుడు రామకోటేశ్వరరావు కుటుంభ సభ్యులు నరేంద్ర, కిషోర్‌లు రూ.1,11,116లు విరాళం నగదుచెక్కును గురువారం ఆలయ ఈఓ తిమ్మనాయుడుకు అందజేశారు.

## నేడు తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ప్రజావేదిక

**యర్రగొండపాలెం,ఏప్రిల్24,ప్రభాతవార్త**
యర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్రంలోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10గంటలకు నియోజకవర్గ స్థాయి ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మండల పార్టీ నాయకులు చేకూరి సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిదిగా యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజలు పాల్గొని తమ సమస్యల పరిష్కార కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## శీలంవారిపల్లిలో ఉచిత వైద్య శిబిరం



**సీఎస్‌పురం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో నాల్గో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం కార్యక్రమంలో భాగంగా నాల్గో రోజు గురువారం శీలంవారిపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జి.నిఖిత రాణి గ్రామంలోని ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను గ్రామ ప్రజలు, పెద్దలు, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఇన్‌ఛార్జ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీవిద్య, ఏఎన్ఎం రమాదేవి, ఆశా వర్కర్స్, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉత్తమ సర్పంచ్‌గా బ్రహ్మారెడ్డి



**హనుమంతునిపాడు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
హనుమంతునిపాడు మండలం దొడ్డిచింతల గ్రామ సర్పంచ్ సానికొమ్ము బ్రహ్మారెడ్డి సర్పంచ్‌గా ఎన్నిక కాబడిన నాలుగు సంవత్సరాల కాలంలో దొడ్డిచింతల గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు తీరుస్తున్న సానికొమ్ము బ్రహ్మారెడ్డి జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా మండలంలో ఉత్తమ సర్పంచ్‌గా అవార్డు రావడం జరిగింది. గురువారం జిల్లా కేంద్రంలో పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక చైర్మన్ నూకసాని బాలాజీ, పంచాయతీరాజ్ వ్యవస్థాపక జాతీయ ప్రధాన కార్యదర్శి వీరభద్రాచారి చేతుల మీదుగా సానికొమ్ము బ్రహ్మారెడ్డికి అవార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయనను అభినందించారు.

## వీరయ్య చౌదరి మృతికి సంతాపం



**నాగులుప్పలపాడు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
నాగులుప్పలపాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య ఎంపీపీ నల్లమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అధ్యక్షతన గురువారం జరిగింది. తొలుత సమావేశంలో హత్యకు గురైన మాజీ ఎంపీపీ వీరయ్య చౌదరి మృతిపట్ల సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మహాలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఉత్తమ పంచాయతీగా దూబగుంట్ల

### - ప్రశంసా పత్రం అందుకున్న కందుల శ్రీనివాసరెడ్డి



**పామూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
మండలంలోని దూబగుంట పంచాయతీ జిల్లాలో ఉత్తమ పంచాయతీ కింద ఎంపికైంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా కార్యాలయం నుండి ఉత్తర్వులు అందాయి. ఉప సర్పంచ్ కందుల శ్రీనివాసరెడ్డి గురువారం నాడు ఒంగోలు నగర పంచాయతీ మేయర్ గంగాడ సుజాత, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏపీ టూరిజం పర్యాటక శాఖ చైర్మన్ నూకసాని బాలాజీ పంచాయతీ సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు వీరభద్రాచారి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. ఒంగోలులో జరిగిన ఈ వేడుక కార్యక్రమంలో పలువురు అధికారులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రశంసా పత్రం అందుకున్న కందుల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పంచాయతీ నిధులతో పాటు సొంత నిధులు వెచ్చించి గ్రామాభివృద్ధికి కృషి చేశామన్నారు. నేటి సమస్య లేకుండా ఎప్పటికప్పుడు గ్రామంలో బోర్లు వేసి సమస్యను పరిష్కరించామన్నారు. బీసీ కాలనీ మెయిన్ విలేజ్‌లో విద్యుత్ సమస్య లేకుండా స్తంభాలను వేయించి విద్యుత్ దీపాలు వెలిగేలా చేస్తున్నామన్నారు. ఇటీవల గవర్నమెంట్ మంజూరు చేసిన రెండు కోట్ల యాభై లక్షలు నిధులతో అనుమనగిరి నుంచి తారు రోడ్డుతో పాటు సిమెంటు రోడ్డు కూడా వేశామన్నారు. ఉత్తమ పంచాయతీ అవార్డు తమ బాధ్యతను పెంచిందని మరిన్ని సేవా కార్యక్రమాలు చేసేందుకు ఆ భగవంతుడు తమకు అవకాశం ఇవ్వాలని శ్రీనివాస్‌రెడ్డి కోరారు.

## కేటీఆర్ టెక్నో స్కూల్‌లో లహరి స్కూల్ సెకండ్ ర్యాంక్

### - అభినందనలు వెల్లువెత్తిన వేడుక

**కనిగిరి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
స్థానిక కేటీఆర్ టెక్నో స్కూల్‌లో పదో తరగతి పరీక్షల్లో 588 మార్కులతో స్కూల్ సెకండ్ ర్యాంకు సాధించిన ఆర్యవైశ్య సమాజానికి చెందిన పైడిమర్రి లహరిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వాసవి సత్ర సముదాయాల జాతీయ అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లు, కనిగిరి పెద్దశెట్టి వెలుగురి వెంకట చంద్రశేఖర్, వైఎస్సార్ పార్టీ వాణిజ్య విభాగం కనిగిరి నియోజకవర్గ అధ్యక్షులు తడికమళ్ళ వెంకటేశ్వర్లు, వాసవి క్లబ్ సభ్యులు రాచర్ల వెంకట నరేష్ కుమార్, బచ్చు వెంగళరావు గుప్తా, కనిగిరి మండల ఆర్యవైశ్య మాజీ అధ్యక్షులు రాచపూడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు. లహరి తన కృషితో ఈ విషయాన్ని సాధించిందని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సాహమే దీనికి బలమనివారు ప్రశంసించారు. భవిష్యత్తులో మరింత మెరుగైన విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



## మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని
### మర్యాదపూర్వకంగా కలిసిన ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్



**కనిగిరి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. పార్టీ కార్యకలాపాలపై ఇన్‌ఛార్జీ దద్దాల నిబద్ధతను ప్రశంసించిన జగన్, 'మీరు పార్టీ కార్యకలాపాలను చక్కగా నిర్వహిస్తున్నారు,ఇలాగే కార్య కర్తలకు,నాయకులకు అండగా నిలబడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయండి, అన్ని విధాలుగా మీకు నేను అండగా ఉంటాను" అని భరోసా ఇచ్చినట్లు సమాచారం.

## దుత్తా బాల ఈశ్వరయ్యను సన్మానించిన టిడిపి నాయకులు



**గిద్దలూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
ప్రకాశం జిల్లా గిద్దలూరు కోఆపరేటివ్ సొసైటీ బ్యాంకు అధ్యక్షులుగా నియమితులైన దుత్తా బాలఈశ్వరయ్యను టిడిపినాయకులు గురువారం పూలమాల,శాలువాతో ఘనంగా సన్మానించారు. కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులుగా ఎన్నిక కావడంపైఆయనకు టిడిపి నాయకులు,కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే అశోక్ రెడ్డి, ఏపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో దక్కిన పదవికి న్యాయం చేస్తానని, రైతులకు, ప్రజలకు మేలు చేసేలా పనిచేస్తానని ఈ సందర్భంగా బాల ఈశ్వరయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి కౌన్సిలర్స్ టిడిపి ముస్లిం మైనార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పహాల్గామా ఉగ్రదాడిలో మరణించిన వారికి న్యాయవాదుల సంతాపం



**గిద్దలూరు, ఏప్రిల్ 24 ప్రభాతవార్త**
గిద్దలూరు బార్ అసోసియేషన్ హాలులో పాలుగుళ్ళ నాగశేషయనారెడ్డి అధ్యక్షతన గురువారం న్యాయవాదుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జమ్ముకాశ్మీరులో పహల్గామాలో పాకిస్తాన్ ఉగ్రమూకలు చేసిన దాడిలో మరణించిన వారి ఆత్మ శాంతించాలని సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పాలుగుళ్ళ నాగేశషయనారెడ్డి మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదులు మనదేశంలో మతకల్లోలాలు సృష్టించడానికి ప్రయత్నం చేస్తుందని, కేంద్ర ప్రభుత్వం ఉగ్రదాడిలో మరణించిన కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు. భారతదేశంలో మనమందరం ఐక్యతతో కలసికట్టుగా పాకిస్తాన్ ఉగ్రవాద ఆలోచనలను తిప్పికొట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఉదయగిరి మల్లిఖార్జున రావు, సీనియర్ న్యాయవాదులు వల్లెల వెంకటరామిరెడ్డి, శివాపురం వెంకట నాగేంద్ర బాబు, శివాపురం భాస్కరరావు, కాకునూరి హిమశేఖర్ రెడ్డి, మొఘల్ హజరాంబి, రవిప్రకాష్, షేక్‌యాసిన్ బాష, భూపని వెంకటేశ్వర్లు, ఏజిపి దాసరి సంగీతరావు,పరదేశీ నిరంజన్ కుమార్, అవిరేణి కేశవరావు, కటారు పోలిరెడ్డి, ముత్తుముల రంగారెడ్డి, భూపతి ఇస్సాక్, ఆవులమంద తిరుమల ప్రసాద్, బొద్దు ప్రకాష్, దూదేకుల సిద్దయ్య, విజయకుమార్ రెడ్డి, ఎమ్మిరైడర్ బాబు, సంధ్యారాణి, అహల్య, లావణ్య, ఫజిల్, అదిల్, వలసాని సుధీర్, రాజ్‌కుమార్ నాయక్, వర్ర బాలకృష్ణ, ఆదిత్య కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నరవ సర్పంచ్ బండికి ఉత్తమ స్థానిక నాయకత్వ సేవా పురస్కారం



**గిద్దలూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
గిద్దలూరు మండలం నరవ గ్రామ సర్పంచ్ బండి శ్రీనివాసులుకు ఉత్తమ స్థానిక నాయకత్వ సేవా పురస్కారాన్ని గురువారం ఒంగోలులో జరిగిన జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవం సందర్భంగా పర్యాటక శాఖ ఛైర్మన్ నూకసాని బాలాజీ అందజేశారు. ఈ సందర్భంగా నరవ గ్రామ సర్పంచ్ బండి శ్రీనివాసులు ఉత్తమ స్థానిక నాయకత్వ సేవా పురస్కారం అందుకోవడంపట్ల పలువురు నాయకులు, సర్పంచ్‌లు, గ్రామ ప్రజలు, తదితరులు ఆయనను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## మహిళా సాధికారతే ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### - కుట్టుమిషన్ల శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించిన గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు, ఏప్రిల్ 24 ,ప్రభాతవార్త**
మహిళా సాధికారతే ఎన్డీయే కూటమి ప్రభుత్వం యొక్క లక్ష్యమని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. గురువారం ఉదయం గిద్దలూరు పట్టణంలోని స్టేట్ బ్యాంక్ కార్యాలయం పైన ఉన్నటువంటి సచివాలయ భవనంలో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ల శిక్షణ కేంద్రాన్ని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం మహిళా పక్షపాతి ప్రభుత్వమని, సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేదింటి మహిళలకు ఆర్థికంగా స్థిరపడాలనే ఉద్దేశంతో వారికి కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని నేడు గిద్దలూరు నియోజకవర్గంలో ప్రారంభించడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రతిష్ఠ హామీని నెరవేరుస్తామని, దీపం పథకం ద్వారా ప్రతి ఇంటికే ఉచిత సిలిండర్లు అందజేస్తున్నామని, జూన్ నాటికి ప్రతిఇంట్లోని తల్లికి వందనం ద్వారా ప్రతి తల్లికి నగదు వారి అకౌంట్లో జమ చేస్తామని, గత పాలకులు మాదిరిగా ప్రభుత్వం కాదని చెప్పి ప్రతి పథకాన్ని అమలు చేసి తీరుతామన్నారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు నగర పంచాయతీ ఛైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ బైలడుగు బాలయ్య, సొసైటీ బ్యాంక్ ఛైర్మన్ దుత్తా బాల ఈశ్వరయ్య, నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసులు, తహశీల్దార్ అంజనేయరెడ్డి, స్థానిక కౌన్సిలర్ బూనబోయిన చంద్రశేఖర్ యాదవ్, మండల, పట్టణ అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, సయ్యద్ శానేవాలీ, పట్టణ కౌన్సిలర్లు, నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## రామాయపాలెం సర్పంచ్‌కి ఉత్తమ అవార్డు



**అద్దంకి ,ఏప్రిల్ 23,ప్రభాతవార్త**
అద్దంకి మండలం రామాయపాలెం గ్రామసర్పంచ్ రానంజనేయరెడ్డికి జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ సందర్భంగా ఉత్తమ స్థానిక నాయకత్వ సేవా పురస్కారానికి ఎంపిక కాగా ఒంగోలులో జరిగిన కార్యక్రమం లో ఈ పురస్కారాన్ని అందుకున్నారు, ఆ మేరకు ఈ రోజు అద్దంకిలో రామాంజనేయ రెడ్డిని ఘనంగా దుశ్శాలువాతో సత్కారించి అభినందించారు, ఈ కార్యక్రమంలో రాధాకృష్ణమూర్తి, శ్రీనివాస్‌రెడ్డి , రాఘవరెడ్డి,సబ్బయ్య,జబ్బార్, తదితరులు ఉన్నారు

## మైనర్ డ్రైవింగ్‌పై తల్లిదండ్రులకు కౌన్సిలింగ్



**కనిగిరి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
మైనర్ డ్రైవింగ్ నియంత్రణకు చర్యల్లో భాగంగా గురువారం నాడు ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, సీఐ ఖాజావలి, హెచ్ఎంపాడు ఎస్సై మాధవరావు ఆధ్వర్యంలో కనిగిరి టౌన్‌లోని పామూరు బస్టాండ్ సెంటర్ వద్ద సాయంత్రం 5గంటల నుండి రాత్రి 8గంటల వరకు ప్రత్యేక వెహికల్ చెకింగ్ చేపట్టారు. ఈ తనిఖీల్లో అనేక మంది మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. అనంతరం వారిని, వారి తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి, వారి పిల్లలు మైనర్ వయసులో వాహనాలను నడపరాదని, ఇది చట్టరీత్యా విరుద్ధమని వివరించారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతమైతే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే, డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు లేని వారు, హెల్మెట్ ధరించని వాహన దారులపై జరిమానాలు విధించడంతో పాటు అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించబడ్డాయి. ప్రజలు చట్టాలను గౌరవించి, రోడ్డు భద్రతకు కట్టుబడి ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## గౌతమి గ్రామర్ స్కూల్ విద్యార్థుల విజయదుందుభి

### - విద్యార్థులను అభినందించిన స్కూల్ కరస్పాండెంట్ రాజకేశవరెడ్డి, ప్రిన్సిపాల్ పద్మ



**దర్శి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
2025 పదో తరగతి పరీక్షా ఫలితాల్లో దర్శి టౌన్‌లో గౌతమి గ్రామర్ స్కూల్ విద్యార్థులు విజయదుందుభి మోగించారు. మొత్తం పరీక్షకు హాజరైన వారు 170 ఉత్తీర్ణులైన వారు 166. 550పైగా మార్కులు సాధించిన వారు 40 మంది, 500లకు పైగా మార్కులు సాధించిన వారు 78మంది. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు బాదం నక్షత్రారెడ్డి 592/600, కమతం నవీన్‌రెడ్డి 590/600, మునగ జయప్రకాష్ 590/600, అత్యధికమార్కులు సాధించిన విద్యార్థులకు కళాశాల కరస్పాండెంట్ పాపసాని రాజకేశవరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ పాపసాని పద్మ, స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.రామారావులు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా స్కూల్లో బాణసంచా పేల్చి సంబరాలు చేశారు. అదే విధంగా కేక్ కట్ చేసి విద్యార్థులకు తినిపించారు.

## సేవా సంకల్ప్ ట్రస్టు ఆధ్వర్యంలో నర్సింగ్ విద్యార్థినికి చేయూత

**సంతనూతలపాడు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
ఒంగోలులోని బొమ్మరిల్లులో ఉంటూ నర్సింగ్ చదువుతున్న పేద విద్యార్థిని వసంతకు సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దాత ట్రస్టు ఫౌండర్ ఎన్నారై పాతూరి సంపత్ తల్లి పేరమ్మ అందించిన రూ.15వేలు రూపాయలను ట్రస్టు చైర్మన్ శనగల వెంకటరమణ అందజేశారు. గతంలో ఇదే విద్యార్థిని వసంతకు ట్రస్టు ఆధ్వర్యంలో ఎడ్యుకేషన్ నిమిత్తం రూ.50వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మద్ది మల్లిఖార్జునరావు, బొమ్మరిల్లు నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఉత్తమ సర్పంచ్‌గా పోశం సుమలత



**తాళ్లూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని బెల్లం కొండవారిపాలెం సర్పంచ్ పోశం సుమలత ఉత్తమ సర్పంచ్‌గా ఎంపికయ్యారు. గ్రామాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేసిన ఆమెకు ఉత్తమ సర్పంచ్‌గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు. సర్పంచ్‌ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో పోశం శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మైనర్లు వాహనాలు నడిపినట్లయితే కఠిన చర్యలు - ఎస్సై అనుక్



**పొన్నలూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
స్థానిక పోలీసు స్టేషన్ సమీపంలో ఎస్సై అనుక్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండకుండా ఎవరైనా వాహనాలు నడిపినట్లయితే కఠిన చర్యలు తప్పవని అలాగే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ ఆర్‌సీ, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలని, ద్విచక్ర వాహనంపై వచ్చే వారు హెల్మెట్ ధరించాలని, ద్విచక్ర వాహనంపై త్రిబుల్ రైడింగ్ చేసినట్లయితే తగు చర్యలు తప్పవని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వాహనదారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## టీడీపీ నాయకుల కొవ్వొత్తుల ప్రదర్శన



**పెద్దదోర్నాల, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
పహల్గాం ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ పెద్దదోర్నాల నటరాజు సెంటర్లో గురువారం కూటమి నాయకులు కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. ఉగ్రవాదులు నశించాలి, జై భారత్ మాత, జైజై భారత మాత అంటూ నినాదాలు చేశారు. ఉగ్ర వాదాలు దాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని వేడుకున్నారు. భవిష్యత్తులో ఇటువంటి అమానుష ఘటనలు జరగకుండా దేశ రక్షణ ఉండాలని, కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. టీడీపీ మండల కన్వీనర్ ఏరువా మల్లిఖార్జునరెడ్డి, టీఎన్‌టీయుసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బట్టు సుధాకర్‌రెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జడి లక్ష్మయ్య, యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు దొడ్డ శేషాద్రి, గుంటక సుబ్బరాయుడు, షేక్ మంజూర్, జనసేన మండల కన్వీనర్ కేతి వెంకట మురళి, యమ దాసయ్య, పండు, గుర్రాల ప్రసాద్, బీజేపీ నాయకులు తంగిరాల అశోక్‌రెడ్డి, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## 26న జరిగే నిరసన ర్యాలీని జయప్రదం చేయాలి

**కంభం రూరల్, ఏప్రిల్ 24 ,ప్రభాతవార్త**
ఇటీవల అమర్నాథ్ యాత్రలో హిందువులపై జరిగిన మారణకాండకు నిరసనగా ఈనెల 26వ తేదీ శనివారం కంభం పట్టణంలోని గచ్చుకాలువ వీధి నుంచి కందులాపురం సెంటర్ వరకు నిర్వహించే నిరసన ర్యాలీని జయప్రదం చేయలని హిందు సంఘాల నాయకులు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నిరసన ర్యాలీ శనివారం సాయంత్రం 4గంటలకు పట్టణంలోని గచ్చుకాలువ వీధి నుంచి ప్రారంభం కానుందని కావునా ర్యాలీలో హిందు సంఘాల నాయకులు, ప్రజలు, ప్రతి హిందువు పాల్గొని ర్యాలీని విజయవంతం చేసి ర్యాలీలో పాల్గొని మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రారశించాలని కోరారు.

## ఉత్తమ సర్పంచ్ అవార్డును అందుకున్న చంద్రపాలెం సర్పంచ్ రామారావు



**సంతనూతలపాడు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
పలు రంగాల్లో ఉత్తమ సేవలు, గ్రామ అభ్యున్నతిపై సంతనూతలపాడు మండలం చంద్రపాలెం సర్పంచ్ బొడ్డు రామారావు ఈ మేరకు ఉత్తమ స్థానిక నాయకత్వ సేవా పురష్కార్ అవార్డును అందుకున్నారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవన్ లో 24న గురువారం నాడు ప్రారంభమైన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం వేడుకలలో ఈ మేరకు చంద్రపాలెం సర్పంచ్ బొడ్డు రామారావుకు ఒంగోలు నగర పాలక కార్పొరేషన్ మేయర్ గంగాడ సుజాత, రాష్ట్ర టూరిజం శాఖ చైర్మన్ నూకసాని బాలాజీలు ఈ అవార్డును అందజేశారు. గ్రామ స్వరాజ్ సాధన సమితి, నేషనల్ లోకల్ ప్రభుత్వ ఛాంబర్ జాతీయ కార్యదర్శి జి.వీరభద్ర చారి జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవంలు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మౌనిక, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## రోటరీక్లబ్ సేవలు ప్రశంసనీయం



**చీరాల, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
చీరాల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక రైల్వే స్టేషన్ ప్రాంగణంలో సీఐ ఎస్.సుబ్బారావు చేతుల మీదుగా చలివేంద్రంను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బారావు మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని రోటరీక్లబ్ సేవలను కొనియాడారు. స్టేషన్ సూపరింటెండెంట్ ఎన్.సింగయ్య మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రోటరీక్లబ్ వారు 40 రోజులు మంచి నీటి చలివేంద్రంను నిర్వహించుడం అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో చందలూరి బాల వెంకటేశ్వరరావు, నక్కల సురేష్‌బాబు, పోలుదాసు రామకృష్ణ, వంగర పూర్ణచంద్రరరావు, మామిడాల శ్రీనివాసరావు, దోగుపర్తి వెంకట సురేష్, చీరాల కృష్ణమూర్తి, జీవై ప్రసాద్, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

## బాలికల పాఠశాలకు భూమి పూజ



**కురిచేడు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన కురిచేడు వయా జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం నాడు దర్శి టీడీపీ ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మీ చేతుల మీదుగా భూమి పూజ జరిగింది. కేజీబీవీ టైపు-4లో భాగంగా రూ.1.94కోట్ల అంచనాలతో ఈ వసతి గృహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బాలికా విద్యకు అధిక ప్రాధాన్యాన్ని ఇస్తుందని, దానిలో భాగంగానే ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మండలంలోని బాలికలు ఈ వసతి గృహాన్ని సద్వినియోగపరుచుకుని అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ నాయకులు లలిత్ సాగర్, సర్వశిక్ష డీఈ రమణయ్య, ఏఈ, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు పిడతల నెమిలయ్య, మాజీ అధ్యక్షులు కాట్రాజు నాగరాజు, నాయకులు డాక్టర్ సునీల్, కిలారి, కొండయ్య, నీటి సంఘ అధ్యక్షుడు ఉన్నగిరి కోటేశ్వరరావు, నాయకులు ఆదినారాయణ, రెడ్డిరెడ్డి, ఆళ్ళ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## మండల టాపర్ లక్ష్మీప్రియను సన్మానించిన శ్రీకాంత్



**రాచర్ల, ఏప్రిల్ 24 ప్రభాతవార్త**
గత మార్చిలో జరిగిన 10వ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితం సాధించి 593 మార్కులతో మండల స్థాయిలో టాపర్‌గా నిలిచిన బచ్చిగారి లక్ష్మీప్రియను, చిన్ని స్వచ్ఛంధ సేవాసంస్థ అధ్యక్షులు మాగులూరి శ్రీకాంత్ గురువారం సత్కరించి అభినందనలు తెలియజేశారు. మండలంలోని ఆకవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతూ ఇటీవల జరిగిన పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరచి మండల టాపర్‌గా సత్తా చాటడం అభినందనీయమని అన్నారు. మండలానికి లక్ష్మీప్రియ గర్వకారణమని తన ఫలితంతో మండలం మరియు పాఠశాల పేరు నిలబెట్టిందని అన్నారు. భవిష్యత్తులో మంచి ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో తన పేరు నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. విద్యార్థిని విజయానికి కారకులైన తల్లిదండ్రులను, పాఠశాల సిబ్బందిని, ముఖ్యంగా ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ రావును ఆయన అభినందించారు.

## కేజీబీవీలో నూతన భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన గొట్టిపాటి లక్ష్మీ



**ముండ్లమూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
ముండ్లమూరులోని కస్తూరిభా గాంధీ బాలికల కళాశాల నందు కోటి 68 లక్షల రూపాయలతో నిర్మించతలపెట్టిన నూతన భవన నిర్మాణానికి దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ గొట్టిపాటి లక్ష్మీ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, ముండ్లమూరు మండల పార్టీ అధ్యక్షులు కూరపాటి శ్రీను, దర్శి మార్కెట్‌యార్డు చైర్మన్ దారం నాగవేణి-సుబ్బారావు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు సోమేపల్లి శ్రీను, మాజీ ఎంపీపీ మండలపు వెంకట్రావు, తెల్లయ్య, నీటిసంఘం అధ్యక్షులు, క్లష్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జీలు, పాఠశాల సిబ్బంది, ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తియ్యని మాటలతో రైతులను మోసం చేస్తున్న వేలం అధికారి

### - పొగాకు రైతులపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని విడనాడాలి - మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్



**కొండపి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త**
పొగాకు రైతులకు గిట్టుబాటు ధరను కల్పించి రైతులను ఆదుకోవలసిన పొగాకు వేలం అధికారి రైతులకు తియ్యని మాటలు చెబుతూ వారిని మభ్యపెడుతూ వ్యాపారస్తులకు కొమ్ముకాస్తున్నాడని పిఏసి సభ్యులు, మాజీ మంత్రి వర్యులు కొండపి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సురేష్ విమర్శించారు. గురువారం కొండపిలోని 55వ పొగాకు వేలం కేంద్రంలో జరుగుతున్న పొగాకు వేలంను ఆయన పార్టీ నాయకులతో పరిశీలించారు. అనంతరం వేలం అధికారితో మాట్లాడి రైతులతో మాట్లాడారు. విలేకరులతో మాట్లాడుతూ పొగాకు రైతులు ఎన్నో కష్టనష్టాలకోర్చి పండించిన పొగాకును వేలం అధికారి చేతిలో పెడితే వ్యాపరస్తులను బ్రతిమిలాడి తక్కువ రేటుకు కొనుగోలు చేయించి అదే ఘనమైన రేటుగా రైతులను మభ్యపెట్టి వారికి తియ్యటి మాటలు చెబుతున్నారని ఆయన రైతుల సమక్షంలో విమర్శించారు. ప్రస్తుతం మేలురకం పొగాకు కేజీ రూ.250నుండి రూ.270వరకు అమ్ముతుండగా అదే పొగాకు గత ఏడాది రూ.300నుండి రూ.330వరకు అమ్మిన దాఖలు ఉన్నాయని ఆయన అన్నారు. కేజీకి ఇంత తేడాగా కొనుగోలు జరుగుతుంటే ఈ తేడాను రైతులకు కనిపించకుండా వారిని ప్రలోభపెట్టి వ్యాపారస్తుల పక్షాన నిలిచిన పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఆయన అన్నారు. వేలంలో పొగాకు కొనుగోలుదారులు ఎక్కువమంది ఉన్నట్లు చూపించారని, తాను పరిశీలించగా కేవలం ఇద్దరు, ముగ్గరు మాత్రమే ఉన్నారన్నారు. ఎక్కువమంది వ్యాపారస్తులను కొనుగోలుకు ఆహ్వానించి వారిలో పోటీతత్వంపెట్టి పొగాకు రేటును పెంచి కొనుగోలు చేయించాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులపై నిర్లక్ష్యధోరణి అవలంభిస్తున్నట్లుగా కనిపిస్తుందని ఆయన విమర్శించారు. మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు నిర్వహించి వ్యాపారస్తులకు పొగాకు కొరత చూపించి రేట్లు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. పొగాకులో ఎక్కడా నాణ్యత తగ్గలేదు కానీ ధరల్లో నాణ్యత తగ్గిందని ఇదే రేటు కొనసాగితే రైతులు అప్పుల్లో కూరుకుపోయి రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఉన్నాయన్నారు. గత వైఎస్సార్సీపి ప్రభుత్వ పాలనలో రైతుల పక్షాన ప్రభుత్వం నిలిచి వారికి గిట్టుబాటుధర కల్పించడంలో ముందంజలో ఉందన్నారు. కొనుగోలుదారులతో మాట్లాడుతుంటే ఎంత తక్కువ ధరకు పొగాకు లభిస్తుంటే అంత తక్కువ ధరకు కొనుగోలు చేయమని పై నుంచి ఆదేశాలు ఉన్నాయని చెప్పడం ఎంతో విడ్డూరంగా ఉందన్నారు. రైతులను వ్యాపారుల కోణంలో చూడడం దారుణమని అన్నారు. పొగాకు రైతులు తమకు జరుగుతున్న మోసాలను మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ ముందు విన్నవించి గోడు వెల్లబోసుకున్నారు. పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో వైఎస్సార్సీపి పార్టీ రైతుల పక్షాన నిలబడి ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొండపి మండల వైసిపి కన్వీనర్ అరికట్ల కోటిలింగయ్య, పొగాకు ఉత్పత్తిదారుల అధ్యక్షులు ఎన్ భాస్కర్ రావు, బి సుబ్బారావు, మైనార్టీ సెల్ సెక్రటరీ రియాజ్, బిసిసెల్ నాయకులు మాచెపల్లి నాగయ్య, డాకా పిచ్చిరెడ్డి, ఆరుమండలాల నాయకులు, కార్యకర్తలు భారీ స్థాయిలో పాల్గొన్నారు.




కెనరా బ్యాంక్ Canara Bank

ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీసు, డి.నెం. 54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మి అవెన్యూ, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ-520008. ఫోన్: 8331011695. ఇ-మెయిల్: armvij@canarabank.com

**ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద**
**REDEMPTION NOTICE**

టు:
1. M/s శ్రీ ప్రియాంక రా అండ్ బాయిల్డ్ రైస్ మిల్, ప్లాట్ నెం. 303, 304, 309 & 310, APIIC సెంటర్, గుండ్లపల్లి, మద్దిపాడు మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523211. 2. శ్రీ పిడపర్తి బాల భాస్కర్ రెడ్డి, తండ్రి: రామచంద్రారెడ్డి, హెచ్.నెం.6-318(సి), శ్రీ సాయిబాబా నగర్, కర్నూలు రోడ్, ఒంగోలు, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523002, 3. శ్రీమతి పిడపర్తి పావని, భర్త: పిడపర్తి బాల భాస్కర్ రెడ్డి, హెచ్.నెం.6-318(సి), శ్రీ సాయిబాబా నగర్, కర్నూలు రోడ్, ఒంగోలు, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523002.
డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ రూల్స్, 2002 (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును) క్రింద చదవబడు రూల్ 8(6) అనుసరించి నోటీసు.

కెనరా బ్యాంక్, ఏఆర్ఎమ్ బ్రాంచ్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు (ఇకపై "సెక్యూర్డ్ క్రెడిటార్" గా రిఫర్ చేయబడును), సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును) సెక్షన్ 13(8) క్రింద చదవబడు రూల్ 8(6) సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 రూల్స్ (ఇక మీదట "రూల్స్"గా రిఫర్ చేయబడును) అనుసరించి మీ అందరికీ ఈ నోటీసును జారీచేయడమైనది.

**ఋణగ్రహీత/సంస్థ M/s శ్రీ ప్రియాంక రా అండ్ బాయిల్డ్ రైస్ మిల్, తనఖాదారు మరియు హామీదారులు (పైన తెలిపిన పేర్లు)** వారిని లోను అకౌంట్‌కు సంబంధించిన బకాయి **రూ.10,30,42,730/- (అక్షరాల పది కోట్ల ముప్పై లక్షల నలభై రెండు వేల ఏడు వందల ముప్పై రూపాయలు మాత్రమే)** మరియు వడ్డీతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి **చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద 16.06.2016 తేదిన మీకు డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో ఋణగ్రహీత/సంస్థ తనఖాదారు మరియు హామీదారులు (పైన తెలిపిన పేర్లు) విఫలమైనందున **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి **తేది. 30.08.2016**న మీ సెక్యూర్డ్ ఆస్తులను సదరు చట్టం నందలి సెక్షన్ 13(4) క్రింద లాంఛనాత్మక **స్వాధీనం తీసుకున్నారు** మరియు చట్ట ప్రకారం సదరు స్వాధీనత నోటీసును రెండు ప్రముఖ దినపత్రికలలో ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది. **21.04.2025** నాటికి చెల్లించవలసిన బకాయి **రూ. 33,22,69,080.08 (అక్షరాల ముప్పై మూడు కోట్లు ఇరవై రెండు లక్షల అరవై తొమ్మిది వేల ఎనభై రూపాయలు మరియు ఎనిమిది పైసలు మాత్రమే)** + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు సర్ఫేసీ చట్టం, 2002, నందలి రూల్ 8(6) ప్రకారం మీకు ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది.(ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయువారినుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారినుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజలనుండి టెండరు ఆహ్వానించుట లేదా సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటీ. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు.

చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా లేకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

**తనఖాపెట్టిన స్థిరాస్తి వివరములు**
ప్రకాశం జిల్లా, మద్దిపాడు మండలం, అన్నంగి, గుండ్లపల్లి, ఎపిఐఐసి గ్రోత్ సెంటర్, సర్వే నెంలు. 270,271,272,278, ప్లాట్లు నెంలు. 303,304,309,310 నందు **9661.28 చ॥గ॥ విస్తీర్ణం గల ఖాళీ స్థలం ప్లాట్లు మరియు అందులోని గల షెడ్లు మరియు ఆర్‌సిసి నిర్మాణం.** సేల్ డీడ్ నెం. 1261/2009 ప్రకారం శ్రీ పిడపర్తి బాల భాస్కర రెడ్డి మరియు శ్రీమతి పిడపర్తి పావని పేరునగలదు. **హద్దులు డీడ్ ప్రకారం.**

తేది: 21.04.2025, ప్రదేశం: విజయవాడ — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

## ట్రిబుల్ ఐటీ కొరకు దూబగుంట వద్ద స్థల పరిశీలన



**పామూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
గత ఏడు సంవత్సరాల నుంచి పామూరు మండలంలోని ట్రిబుల్ ఐటీ నిర్మాణం కాగితాలకే పరిమితం కాక ఇటీవల కాలంలో ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చొరువ చూపడంతో పీసీ పల్లి మండలంలో రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంటేషన్‌కు భూమి పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అదే విధంగా మండలంలోని దూబగుంట వద్ద 2008లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే కదిరి బాబురావు అట్టహాసంగా పైలాన్ ఏర్పాటు చేసి సంవత్సరంలోగా నిర్మాణం పూర్తి చేయాలని ట్రిబుల్ ఐటీ ఉన్నతాధికారులను ఆదేశించడం జరిగింది. అనంతరం ఎలక్షన్స్ రావడం, ఆ ఊసే ఎత్తడంతో ఒంగోలుకు తరలిపోతుందన్న వార్తవ్యాపించింది. ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పట్టువదలని విక్రమార్కుని వలే ఎలాగైన నియోజకవర్గానికి ట్రిబుల్ ఐటీని తీసుకురావాలనే సంకల్పంతో బల్లిపల్లి వద్ద గాని, గతంలో కేటాయించిన పామూరులోని దూబగుంట వద్ద నిర్మించేందుకు గురువారం నాడు ప్రభుత్వ భూములను సంస్థ డైరక్టర్ భాస్కర్ పటేల్‌తో కలిసి పరిశీలించారు. వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే ట్రిబుల్ ఐటీకి కేటయించిన స్థలం పక్కనే కాలువ వెళ్తున్నందున ఎంతో అనువుగా ఉండటమే కాక ఎంతో ఆర్థికంగా రవాణా పరంగా కాకుండా వేలాది మందికి ఉపాది అవకాశాలు లభిస్తాయని భావిస్తున్నారు. అందులో భాగంగా ఉగ్ర నరసింహారెడ్డి తహశీల్దార్ రమణ్‌రావు, ఎంపీడీఓ బ్రహ్మయ్యతో కలిసి 400ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ స్థలాలను సేకరించారు. పామూరు మండలం అభివృద్ధి చెందాలన్నా, ఈ ప్రాంత ప్రజలు వలసలు నివారించాలన్న భారీ నిర్మాణాలు చేపట్టడం, ప్రజోపయోగ కార్యక్రమాలు ఎంతైన అసవరమని ప్రజలు భావిస్తున్నారు. ఉద్యోగ ,ఉపాధి అవకాశాలు ట్రిబుల్ ఐటీ నిర్మాణంతో పాటు నిమ్జ్‌కు అడుగులు ముందుకు పడితే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని, పారిశ్రామిక హబ్‌గా తయారవుతుందని ప్రజలు భావిస్తున్నారు.

## ముమ్మరంగా తెలుగుదేశం పార్టీ గ్రామసారధుల ఎంపిక



**పామూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాలతో పామూరు మండలంలో గ్రామ సారధుల ఎంపిక ముమ్మరంగా సాగుతుంది. పార్టీకి పటిష్ట సేవలు అందించి ప్రజల్లో యాక్టివ్‌గా తిరిగే వారికి గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ గ్రామ సారధులుగా ఎంపిక చేస్తున్నారు. ఇందులో భాగంగా మండల పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, కనిగిరి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యారవ రమా శ్రీనివాస్, రాష్ట్ర వివిధ్న ప్రతిభావంతుల అధ్యక్షులు అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, జిల్లా మైనార్టీ సెల్ నాయకులు సయ్యద్ అమీర్ బాబు, మన్నం రమణయ్య, ఉప్పలపాటి హరిబాబు, నర్సింగ్ సాంబయ్య, గుంటుపల్లి శ్రీనివాసులు, బంధ్ల నారాయణ, కవేరి రసూల్, జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు పండిటి హరీష్, మన్నం రమణయ్య, తదితరులు ఆధ్వర్యంలో మండలంలో విస్తృతంగా పర్యటించి పాత కమిటీ వారి ఆమోదంతో కొత్తగా వారిని నియమిస్తున్నారు. ప్రతి 60 ఇళ్లకు ఒకరు బాధ్యత వహించి వారి అవసరాలు పార్టీ పరంగా, ప్రభుత్వ పరంగా తీర్చేందుకు కృషి చేయాలని వారు కోరారు.

## దేవరపు మాల్యాద్రిని పరామర్శించిన బొల్లా నరసింహారావు



**పామూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
పార్టీ సీనియర్ నాయకులు దేవరపు మాల్యాద్రి ఇటీవల బెంగుళూరులో శస్త్ర చికిత్స చేయించుకుని బంధువుల ఇళ్లల్లో ఉంటుండగా గురువారం నాడు యువనేత, లక్ష్మీనరసాపురం ఎంపీటీసీ నరసింహారావు పరామర్శించారు. ఆయన ఆరోగ్య స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు.

## నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న బొల్లా నరసింహారావు చౌదరి



**పామూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
కనిగిరి ప్రాంతానికి రుద్రరాజువారు వ్యాపారవేత్త బెంగుళూరులో స్థిరపడి నూతన గృహ ప్రవేశ కార్యక్రమాన్ని గురువారం నాడు నిర్వహించారు. ఈసందర్భంగా లక్ష్మీనరసాపురం ఎంపీటీసీ బొల్లా నరసింహారావు చౌదరి, బూత్ కమిటీ ఇన్‌చార్జీ రమణయ్య,బంధువులు,మిత్రులు హాజరైనత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొల్లా నరసింహారావు రుద్రరాజు వారికి వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరించారు.

# పొగాకు వేలం కేంద్రం సందర్శన



**టంగుటూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
పొగాకు బోర్డు చైర్మన్ శ్రీచిడిపోతు యశ్వంత్ కుమార్, వైస్ చైర్మన్ బొద్దపాటి బ్రహ్మయ్య, రీజనల్ మేనేజర్ ఎ.లక్ష్మణరావు టంగుటూరు వేలం కేంద్రాన్ని సందర్శించి పొగాకు వేలం జరిగిన బేళ్లను, వాటి ధరలను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ పొగాకు రైతులతో ఆశీను నందు సమావేశమై ప్రస్తుతం ఉన్న మార్కెట్ దృష్ట్యా రైతులు అందరూ మార్కెట్‌కి అనుగుణంగా బేళ్లు తీసుకురావాలని అలాగే మండలంలో మగ్గిన పొగాకునే బేళ్లు కట్టుకుని అమ్మకానికి తీసుకురావాలని తెలిపారు. బేళ్ళు అమ్మకానికి తెచ్చేటప్పుడు తేమ, వేడి లాంటివి లేకుండా చూసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న మార్కెట్ దృష్ట్యా తెలపరి పొగాకు, నీళ్లు కట్టిన పొగాకు, లో గ్రేడ్ పొగాకు, మొద్దు పచ్చరకం పొగాకును తీసుకురావద్దని తెలిపారు. కొన్ని కంపెనీ వాళ్లు కొనుగోలు చేసిన బేళ్లలో అన్యపదార్థాలు ఉన్నందున కస్టమర్స్ వాటిని తిరస్కరించారని తెలిపారు.అందువలన రైతులందరూ తమబేళ్లలో ఎటువంటి పొగాకేతర అన్యపదార్థాలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. అలాగే కంపెనీ కొనుగోలు దారులతో ఆశ సమావేశమై అన్ని రకాల గ్రేడ్ పొగాకును కొనుగోలు చేసేలా చేస్తామని తెలిపారు. అలాగే రైతులు తీసుకువచ్చిన బేళ్ళు అన్నింటిని నో బిడ్స్ లేకుండా మంచి సరాసరి ధరతో కొనుగోలు చేసేలా చేస్తామని తెలిపారు.

# ఘనంగా పంచాయతీ దినోత్సవం



**టంగుటూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన టంగుటూరులోని పంచాయతీ దినోత్సవం సందర్భంగా గురువారం నాడు కార్యక్రమం నిర్వహించి పంచాయతీ కార్యదర్శి హరిబాబు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మద్దిరాల మమత మాట్లాడుతూ పంచాయతీలో పనుల విషయం గ్రామాభివృద్ధి బాటగా పని చేయాలని పంచాయతీ ద్వారావచ్చే నిధులను గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని తెలియజేశారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని, చెత్తాచెదారాలతో ఉంటే దాని వల్ల అంటు వ్యాధులు ప్రబలి అనేక రోగాలు భారిన పడతామని తెలియజేశారు. సీనియర్ టీడీపీ నాయకులు మాట్లాడుతూ పల్లెల్లో శుభ్రంగా చేసుకుని గ్రామాభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మక్కిన కోటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## నెల్లూరు నగర పాలక కమీషనర్‌ను కలిసిన ప్రేమ్‌కుమార్



**పామూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
నెల్లూరు నగర పాలక కమీషనర్‌ను ఎద్దుల ఓబులేష్ నందన్‌సే సెయింట్ మార్క్స్ స్కూల్ సెక్రటరీ ప్రేమ్‌కుమార్ గురువారం నాడు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. నిన్నటి వరకు ఇన్‌ఛార్జ్ కమీషనర్‌గా ఉన్న ఓబులేషు నందన్ నేటి నుంచి పూర్తి కమీషన్ బాధ్యతలు చేపట్టడంతో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పామూరు మండలం ఇనిమెర్ల గ్రామానికి చెందిన ఓబులేషు కడు పేదరికంలో పుట్టి చదివి ధ్యాసగా ఓమేగా విద్యాసంస్థల్లో విద్యనభ్యసించి నేడు సివిల్స్‌లో టాపర్‌గా నిలిచి అంచెలంచెలుగా ఎదిగి నేడు నగర పాలక కమీషనర్‌గా బాధ్యతలు నిర్వర్తించడంపై పామూరు మండలంలోని ప్రజలు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరెన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

## కొల్లూరి వారి గృహప్రవేశంలో యారవ మిత్రబృందం



**పామూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
పామూరు మండలంలోని వగ్గంపల్లి పంచాయతీ పరిధిలోని కొండారెడ్డిపల్లిలో కొల్లూరి వారిగృహ ప్రవేశ కార్యక్రమంలో కనిగిరి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యారవ రమాశ్రీనివాస్ పాల్గొని సత్యనారాయణ వ్రత పూజా కార్యక్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశాఖపట్నంలో స్థిరపడి ఆర్థికంగా స్థితివంతులై స్వగ్రామంలో తనకంటూ మంచి వసతి ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని యారవ శ్రీనివాసులు తెలిపారు.

## విద్యుత్ సమస్యను పరిష్కరించిన దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ



**దర్శి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
దర్శి మున్సిపల్ పరిధిలోని 20వ వార్డులోని చింతలపాలెం గ్రామానికి ఎన్నో సంవత్సరాలుగా ఉన్న సమస్యను గురువారం పరిష్కరించడం జరిగింది. దర్శి నగర పంచాయతీలోని చింతల పాలెం గ్రామానికి ప్రస్తుతం రూరల్ కరెంట్ సప్లై ఉండగా వార్డు ప్రజల కోరిక మేరకు టౌన్ కరెంటు సప్లై ఇవ్వాలని గ్రామస్తులు కోరగా వెంటనే ఏర్పాటు చేసి నేడు దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి చైర్మన్ పిచ్చయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కరెంటు ఏఈ, కమీషనర్ మహేష్, టీడీపీ నాయకులు కనకం శ్రీనివాసరావు, దర్శి పట్టణ అధ్యక్షులు యాదగిరి వాసు, శోభారాణి, జూపల్లి కోటేశ్వరరావు, నారపుశెట్టి మధు, కత్తి నాగేశ్వరరావు, కనకం సైదా, కోటయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఉత్తమ విద్యార్థులను అభినందించిన ఎస్వీఆర్ స్కూల్ డైరక్టర్ చింతా సునీతరెడ్డి



**దర్శి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
పదో తరగతి 2025 వెలువడిన పరీక్ష ఫలితాల్లో ఎస్వీఆర్ స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులుఉత్తమ ప్రతిభను కనపరిచారు . ఈ సందర్భంగా మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు స్కూల్ డైరక్టర్ చింతా సునీత, ఉపాధ్యాయులు కేక్ కట్ చేసి స్వీట్లు తినిపించి అభినందనలు తెలిపారు. దేశిరెడ్డి నానిరెడ్డి 585, సీహెచ్ వర్షిత 568, ఎం.కౌసల్య 565, బి.గురు కావేరి 564, ఎస్.తారక మణికంఠరెడ్డి 564, వి.మధుకిరణ్‌రెడ్డి 564, సీహెచ్ రామాంజనేయులు 563, సీహెచ్ లక్ష్మీ 562, ఎం.త్రివేంద్రరెడ్డి 558, అమర్నాథ్‌రెడ్డి 557, పి.కీర్తి 554, ఎస్‌కే సిద్ది జుబేద 554, వెంకట కిరణ్ కుమార్ 552మార్కులు సాధించారు. 500 మార్కుల కంటే పైన 33 మంది, 550 మార్కుల కంటే పైగా 13 మంది విద్యార్థులు సాధించినట్లు డైరక్టర్ సునీత తెలియజేశారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

# వివేకానంద స్కూల్ విద్యార్థుల ప్రతిభ



**దర్శి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
దర్శిలోని పొదిలి రోడ్డులో ఉన్న వివేకానంద హైస్కూల్ విద్యార్థులు 2025 పదో తరగతి పరీక్ష ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరక్టర్ ఎన్.రామాంజనేయులు కేక్ కట్ చేసి విద్యార్థినీ, విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.కే.అర్చన 594/600 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను స్కూల్ కరస్పాండెంట్ ఎన్.రామాంజనేయులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కేక్ కట్ చేసి సంబరాలు చేశారు.

# మండలంలో పదో తరగతి విద్యార్థుల ప్రతిభ



**ముండ్లమూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
ముండ్లమూరు మండలంలోని ప్రభుత్వ హైస్కూల్స్ 2025 పదోతరగతి పరీక్షా ఫలితాల్లో విద్యార్థినీ, విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. ఏపీ మోడల్ స్కూల్‌కి చెందిన బి.కీర్తన 583/600, పి.అశ్విని 583/600, కే.బాలకృష్ణ 580/600,జి.గాయత్రి 580/600, వేముల జిల్లా పరిషత్ హైస్కూక్ నందు ఏ.మేఘన 568/600,షేక్ అబూబకర్ 563/600, ముండ్లమూరు కస్తూరిభా గాంధీ బాలికల పాఠశాల నందు డి.వెంకట పూజిత 550/600, కే.విదిష 535/600, పూరిమెట్ల జిల్లా పరిషత్ హైస్కూల్ నందు సీహెచ్ అనిల్ 513/600, సీహెచ్ అనిత 497/600, మారెళ్ల జిల్లా పరిషత్ హైస్కూల్ నందు డి.ఆకాశరెడ్డి 556/600, కే.అభిలాష్‌రెడ్డి 554/600, ఈదర జిల్లాపరిషత్ స్కూల్ నందు కే.భవాని581/600,పి.సాయి పుల్లారెడ్డి 571/600, ఉమామహేశ్వరపురం జిల్లా పరిషత్ హైస్కూల్ నందుఈ ఏంజెల్ 533/600, ఏ.మంజులప్పరెడ్డి 518/600, ముండ్లమూరు జిల్లా పరిషత్ హైస్కూల్ నందు బి.శ్రీలక్ష్మీ 565/600, జి.గాయత్రి 484/600, మండలం మొత్తం మీద 90శాతంతో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకి మండల విద్యాశాఖ అధికారులు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## వైసీపీ కార్యాలయంలో విద్యాధర్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు



**దర్శి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తనయుడు బూచేపల్లి విద్యాధర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా గురువారం వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో వైసీపీ నాయకులు కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యాధర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఇత్తడిదేవదానం,గొంది అప్పిరెడ్డి,గోను నారాయణరెడ్డి,నల్లదిమ్మురమణారెడ్డి, ఇరుగుల శ్రీనివాసులురెడ్డి, లక్కిరెడ్డి సుబ్బారెడ్డి, జూపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

## కస్తూరిభా గాంధీ బాలికల కళాశాలలో నూతన భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన గొట్టిపాటి లక్ష్మీ



**దర్శి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
దర్శిలోని కురిచేడు రోడ్డులో గల కస్తూరిభాగాంధీ బాలికల కళాశాల నందు కోటి 59 లక్షల రూపాయల అంచనాలతో నిర్మించ తలపెట్టిన నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి మార్కెట్ యార్డు చైర్మన్ దారం నాగవేణి- సుబ్బారావు, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఈ విజయంద్రబాబు, డీఈ రమణయయ, స్కూల్ అరుణ, ప్రిన్సిపాల్, ఎంఈఓ-1 రఘురామయ్య, ఎంఈఓ-2 రమాదేవి, చిన్న, వాసు, సుబ్బు, నాగరాజు, మండలంలోని వివిధ హోదాల్లో ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# పోషక్ పక్వాడా వారోత్సవాలు



**ఒంగోలు టౌన్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
పోషక్ పక్వాడా వారోత్సవాలలో భాగంగా క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో సెమినార్ నిర్వహించారు. పౌష్టికాహారం, ఆరోగ్య నియమాలను న్యూట్రిషనిస్ట్ వివరించి విద్యార్థుల మొబైల్ ఫోన్‌లో పోషక్ పక్వాడా యాప్ డౌన్‌లోడ్ చేయించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వాలంటీర్‌లు వెంగముక్కపాలెంలో పౌష్టికాహారం వల్ల ఆరోగ్యానికి మేలు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ హనుమంతరావు, డీన్ డాక్టర్ నవనీత కృష్ణన్ పర్యవేక్షించారు.

## ఉద్యమాలకు సిద్ధం కావాలి - ఎస్.కృష్ణయ్య పిలుపు

**ఒంగోలు టౌన్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 కేంద్ర కార్యవర్గ సమావేశం గుణదలలోని ప్రధాన కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఎస్.కృష్ణయ్య మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పలు దఫాలుగా మేనేజ్‌మెంట్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, సానుకూల స్పందన రాకుంటే ఉద్యమించడం ఖాయం అన్నారు. యూనియన్ ప్లాటినం జుబ్లీ సెలబ్రేషన్స్ ఘనంగా జరుపుకోవాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ప్రకాశం జిల్లా నుంచి డిస్కమ్ అధ్యక్షులు రాచగర్ల సంజీవరావుతో పాటు డివిజన్ నేతలు పాల్గొన్నారు.



# ఫేస్ ప్రెప్‌కు 33 మంది ఎంపిక




**ఒంగోలు టౌన్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
రైజ్ కృష్ణసాయి గ్రూప్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఫేస్ ప్రెప్ ఎంపిక పోటీలలో 33 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. కంపెనీ ప్రతినిధులు సుమంత్, ఆనంద్ విద్యార్థులకు వ్రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, హెచ్‌ఆర్ రౌండ్ నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేయడం జరిగింది. ఉద్యోగాలు సాధించిన వారిని కళాశాల గౌరవ ఛైర్మన్ ఇస్కాల రంగమన్నార్, డైరెక్టర్ డాక్టర్ భాస్కర్‌రావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రఘుబాబు అభినందించారు.

# మౌన దీక్ష



**ఒంగోలు టౌన్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
జమ్ముకాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి ఖండిస్తూ జనసేన జిల్లా కార్యాలయంలో పార్టీ నేతలు మౌన దీక్ష నిర్వహించారు. దీక్షలో జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, పార్టీ నేతలు కంది రవిశంకర్, చిట్టెం ప్రసాద్, చనపతి రాంబాబు, కళ్యాణ్ ముత్యాల, రాయని రమేష్, బొందిల శ్రీదేవి, పిల్లి రాజేష్, పల్లా ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు



**సింగరాయకొండ ఏప్రిల్ 24 ప్రభాతవార్త**
పంచాయతీరాజ్ దినోత్సవం వేడుకలను గురువారం సింగరాయకొండ పంచాయతీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ తాటిపర్తి వనజ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ వనజ మాట్లాడుతూ గ్రామ పంచాయితీలు బలోపేతానికి అధికారులు,ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు గ్రామ స్వరాజ్యాన్ని అందుబాటులో ఉంచేందుకు గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జగదీష్, ప్రజా ప్రతినిధులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఎంపీడీవో డీ.జయమణి ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సుధాకర్,సూపరింటెండెంట్ కృష్ణారావు, స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ సి.హెచ్ సుధాకర్ రావు, అధికారులు పాల్గొన్నారు.

## టెన్త్ ఫలితాలలో నారాయణ సిఓ ఒలంపియాడ్ స్కూల్ విజయదుందుభి



**ఒంగోలు,ప్రభాతవార్త**
స్థానిక లాయర్‌పేటలోని నారాయణ సిఓ ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థులు ఎస్ఎస్‌సి ఫలితాల్లో 597,595,594,592,591, 590, 590 వంటి అత్యుత్తమ ఫలితాలు సాధించి రాష్ట్రస్థాయిలో అగ్రస్థానంలో నిలిచారు.. 597 మార్కులతో పి. లక్ష్మీ సాహితి 595 మార్కులతో యం. రోహిరాయ్ 594 మార్కులతో పి.శాన్వి.. 592 మార్కులతో వి. దాక్షి గణేష్, 591 మార్కులతో జి. హాసిని విముద, 590 మార్కులతో ఎ.శ్రీ అనీష్, పి. యశస్వినిలు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. అలాగే 590కి పైగా 7 మంది, 585కి పైగా 12 మంది 580 పైగా 22 మంది 550 పైగా 61 మంది విద్యార్థులు కనీ విని ఎరుగని ఫలితాలు సాధించారు. 545 మార్కులతో అత్యధిక సరాసరి ని మరియు 100 ఉత్తీర్ణతను కూడా సాధించింది. ఈ సందర్భంగా నారాయణ సి ఓ అండ్ ఒలంపియాడ్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీ సయ్యద్ నాగూర్ వలి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయిలో ఎస్ఎస్‌సి ఫలితాలలో నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఎన్నడూ ముందంజలోనే ఉంటాయని అందుకు తగిన సహకారాన్ని అందించిన విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులకు మరియు ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా నారాయణ స్కూల్స్ ఏజీఎం నర్రావుల పెద్దిరెడ్డి, కోఆర్డినేటర్ దాసరి శ్రీహరి పాల్గొని విద్యార్థిని విద్యార్థులను ప్రశంసించారు.

# గాన గంధర్వుడు విగ్రహ ఆవిష్కరణ





**చీమకుర్తి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
చీమకుర్తి పోలీస్ స్టేషన్ సెంటర్ నందు శ్రీ అభయ కళారాధన సాంస్కృతిక సాహిత్య సేవా సంస్థ మరియు శ్రీ అభయ సేవా ఫౌండేషన్ సంయుక్త సంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మద్దాలి మాధవరావు ఆధ్వర్యంలో గానగంధర్వుడు ఎస్ పి బాలసుబ్రమణ్యం విగ్రహావిష్కరణ కన్నుల పండుగ జరిగింది. ఈ సంస్థలో 30వ వార్షికోత్సవ సందర్భంగా మరియు వేల కళా సేవా కార్యక్రమాలు పురస్కరించుకొని కళామ తల్లికి సంగీత సాహిత్య సేవలు అందిస్తున్న శ్రీ మాధవ పెద్ది సురేష్ చేతుల మీదుగా ధ్యానగంధర్వుని విగ్రహావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మాధవపెద్ది సురేష్ గారు మాట్లాడుతూ డాక్టర్ మద్దాలి ఇన్ని సేవా కార్యక్రమాలు జరపటం ఎంతో ఆనందంగా ఉంది సంగీత సాహిత్యాలు వీరికి రెండు కళ్ళు అని దాన్ని ఎంతో వినయ విధేయతలతో నడుపుతున్నారని కొనియాడారు. డాక్టర్ మద్దాలి దంపతులిద్దరిని కూడా ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపి సత్కరించారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ చైర్మన్ గోపురపు రాజ్యలక్ష్మి పూర్ణచంద్రరావు, చీమకుర్తి సీఐ సుబ్బారావు, కమీషనర్ వై రామకృష్ణ, ప్రముఖ పారిశ్రామికవేత్త నూనె సుబ్రహ్మణ్యం, చలువాది బదరీ నారాయణ డాక్టర్ బందా రాహుల్ ,మందపాటి శ్రీనివాసరావు, గోనుగుంట సుబ్బారావు గూడా సుబ్రహ్మణ్య శాస్త్రి, శేష శ్రీధర్ శర్మ ,పుత్తూరు ఆంజనేయులు పులిపాటి సాంబశివరావు, పేరం శ్రీనివాస్ రావు సీతాపతి గారు, ఆకుల శ్రీనివాసరావు అన్నమయ్య మురళి గాదంశెట్టి కృష్ణ , జానకి రామయ్య గారుఇంకా అనేక సంస్థల అధ్యక్షులు పాల్గొని గానగంధర్వుడికి గజమాలతో సత్కరించి అన్ని సంస్థల వారు కూడి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. వచ్చిన 500 మందికి అన్న ప్రసాదాన్ని పంచారు.

## వాసవి క్లబ్‌లు ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ



**సంతనూతలపాడు, ప్రభాతవార్త**
జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం పహల్ గామ్ సమీపాన ఉగ్రవాదులు ఇటీవల 27 మంది భారత్ పర్యాటకులపై జరిపిన దాడులను ఖండిస్తూ గురువారం రాత్రి సంతనూతలపాడులో వాసవి క్లబ్, వాసవి మహిళా క్లబ్‌లుఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. మృతి చెందిన వారికి శాంతి చేకూరాలని నినాదాలు చేశారు. వాసవిక్లబ్‌లు అంతర్జాతీయ అధ్యక్షులు ఇరుకుల రామకృష్ణ ఆదేశాల మేరకు సంతనూతలపాడు లో వాసవి క్లబ్‌లు ఆధ్వర్యంలో ఈ కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. ఉగ్రవాదులు భారత పర్యాటకుపై అమానుషంగా జరిపిన దాడులను ఈ సందర్భంగా వారు ఖండించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు వేమూరి వెంకట శేషారావు,, గౌరవ అధ్యక్షులు పాదర్తి గిరి, ఉపాధ్యక్షులు వేమా శీను,సెక్రెటరీ వేమూరి ఆంజనేయులు, ఆర్యవైశ్య కళ్యాణ మండపం అధ్యక్షులు వేమా మల్లేశ్వరరావు, వాసవి మహిళాక్లబ్ అధ్యక్షురాలు చలువాది చంద్రావతి, సెక్రెటరీ ఎస్ జయశ్రీ, కోశాధికారి ఎన్. శ్రీలక్ష్మి, వాసవి మహిళా క్లబ్ మాజీ అధ్యక్షురాలు జి సులోచన, జి వెంకటలక్ష్మి,లు, వాసవి మహిళా క్లబ్ నేతలు వి. నాగమణి, వి ధనలక్ష్మి,లు వాసవి క్లబ్, ఆర్యవైశ్య నాయకులు ఎస్. రాజేష్, ఎస్.ఉమా, సిహెచ్.రాము, జి.కృష్ణమూర్తి, జి.రవి, పి. గురుమూర్తి, తదితరులు ఈ కొవ్వొత్తులు ర్యాలీలో పాల్గొన్నారు ఈ కార్యక్రమాన్ని వాసవి క్లబ్ జిల్లా సహాయ కార్యదర్శి వేమూరి నాగేంద్రప్రసాద్ రావు పర్యవేక్షించారు.

25-4Pg6exHMNWJQE.qxd:25-4Pg6exHMNWJQE.qxd 01/01/01 11:06 AM Page 1



# పర్యాటకులను ఉగ్రవాదులు చంపడం దారుణం

## దేవాదాయ మంత్రి ఆనంరామనారాయణరెడ్డి



**కావలి (నెల్లూరు), ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** మీ ప్రధానమంత్రికి చెప్పుకోండి... అంటూ ఉగ్రవాదులు 28 మంది భారతీయులను పేర్లు అడిగి పాశవికంగా కాల్చిచంపడం అత్యంత బాధాకరమైన విషయమని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఉగ్రవాదుల చర్యలను పిరికిపందల చర్యగా ఆయన అభివర్ణించారు. ప్రభుత్వం తరఫున మంత్రి ఆనం గురువారం కావలి ఆనాలవారివీధిలోని మధుసూధన్ నివాసానికి వెళ్లి పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల ఉంచి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రపంచ దేశాలన్నీ నేడు భారతదేశంవైపు చూస్తున్నాయన్నారు. ఉగ్రవాద సంస్థలను తుదముట్టించేందుకు మేము తోడుగా ఉన్నామని చెబుతూ అన్ని దేశాలు ఒకేత్రాటిపైకి వస్తున్నాయన్నారు. మన ఆంధ్రప్రదేశ్ నుంచి ఒకరు విశాఖపట్నంలో, మరొకరు కావలికి చెందిన వాసి చంపబడడం అతి దారుణమన్నారు. సోమిశెట్టి మధుసూధన్ పార్థివదేహం కావలికి వచ్చినప్పటినుంచి జిల్లా యంత్రాంగం అంతా ఇక్కడే ఉందన్నారు. ప్రభుత్వం కూడా అన్నిరకాలుగా అండగా ఉంటుందన్నారు. శాంతి సామరస్యానికి ప్రతిరూపమైన ఈ భారతదేశంలో ఈ ఉగ్రవాదచర్య హేయమైన చర్య అని ఆనం ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో ఇటువంటి ఘటనలను ఎవరూ సమర్ధించరన్నారు. ఉగ్రవాదుల చేతుల్లో ప్రాణాలు కోల్పోయిన వారందరికి కేంద్రప్రభుత్వంతోపాటు రాష్ట్ర ప్రభుత్వంకూడా మేమున్నామంటూ భరోసా ఇస్తున్నాయన్నారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన మధుసూధన్ కుటుంబం నెల్లూరులో మా పక్కవీధిలో ఉండేవారన్నారు. వారి కుటుంబంతో తమకు మంచి అనుబంధం ఉందని మంత్రి ఆనం తెలిపారు. మధుసూధన్‌ను కోల్పోవడం తమ కుటుంబంలో వ్యక్తిని కోల్పోయినట్లుగా భావిస్తున్నానన్నారు. మధుసూధన్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పదిలక్షల రూపాయలు ప్రకటించినట్లు మంత్రి తెలిపారు. మధుసూధన్ కుటుంబసభ్యులకు ఆత్మస్థైర్యాన్ని ప్రసాదించాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు మంత్రి ఆనం తెలిపారు. ఏప్రిల్ 22 దేశచరిత్రలో ఒక చీకటిరోజుగా నిలిచిపోతుందని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ తెలిపారు. మధుసూధన్ పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. దేశంలో సమర్ధవంతమైన నాయకత్వంలో గత పదేళ్లుగా జమ్ముకాశ్మీర్ ప్రశాంతంగా ఉందన్నారు. ప్రశాంత వాతావరణంలో ఉన్న జమ్ముకాశ్వీర్‌లో మతం పేరుతో అత్యంత పాశవికంగా మారణహోమం సృష్టించి చంపడం భారతీయుల మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. ఉగ్రవాదుల చేతుల్లో భారతీయులు కాల్చిచంపబడ్డారన్న సమాచారం తెలిసిన కొన్ని గంటలలోనే సౌదీఅరేబియా పర్యటనలో ఉన్న ప్రధాని మోడి వెంటనే భారత్‌కు తిరిగి వచ్చేశారన్నారు. హోమ్‌మంత్రి అమిత్‌షా జమ్ముకాశ్మీర్‌కు వెళ్లి పరిస్థితిని సమీక్షించారని మంత్రి సత్యకుమార్ తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వాలు అండగా ఉంటాయని వారి బిడ్డల ఉజ్వల భవిష్యత్తుకు సంపూర్ణ సహకారం అందిస్తామని మంత్రి సత్యకుమార్‌యాదవ్ హామీ ఇచ్చారు. ఉగ్రవాదులు భారతీయులను తుపాకులతో చంపడం పిరికిపందల చర్య అని సర్వేపల్లి ఎమ్మెల్యే మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. కావలిలో మధుసూధన్ పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

# సానుకూల దృక్పథంతో సత్ఫలితాలు

## మైండ్‌సెట్ పుస్తకావిష్కరణలో చంద్రబాబు



'మైండ్ సెట్ షిఫ్ట్' పుస్తకావిష్కరణలో సిఎం చంద్రబాబు, చిరంజీవి,మంత్రి నారాయణ

**విజయవాడ,ఏప్రిల్24,ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రతికూల పరిస్థితుల్లోను సానుకూలదృక్పథంతో ఉంటే అనేక అంశాలను సునాయాసంగా అధిగమించవచ్చని ఏపీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు,మనస్సును అదుపులో ఉంచుకోవడం అనేది మన ఆత్మనిబ్బరత,ఆలోచనా విధంగా మారుతుందన్నారు. పురపాలకశాఖా మంత్రి,అకడమిషన్ పొంగూరు నారాయణ కుమార్తె శరణి రాసిన "మైండ్ సెట్ షిఫ్ట్" పుస్తకావిష్కరణ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మాజీ కేంద్రమంత్రి,మెగాస్టార్ చిరంజీవి పాల్గొనడమే కాకుండా పుస్తకాన్ని ఆవిష్కరించారు.ప్రతి అంశాన్ని మెదడులో మనం చిప్‌లో నింపినట్లుగా స్దిరంగా నమోదు చేసుకోవాలన్నారు. భావోద్వేగాలను నియంత్రించుకుంటూ మన మనస్సు తీర్చిదిద్దుకోవచన్నారు.అది స్దిత ప్రజు కావొచ్చు,నూతన ఆవిష్కరణ మనంతోనే ఆరంభమవుతుందన్న స్దిర విశ్వాసమైన కావొచ్చున్నారు.మైండ్ సెట్ అనేది ప్రతి మనిషిలో కీలకంగా ఉంటుంది. ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా పాజిటివ్‌గా ఆలోచన చేయాలి.

మేము ఇలా ఉన్నామంటే కారణం పాజిటివ్ థింకింగ్ అన్నారు.మాకు పాజిటివ్ థింకింగ్ ఎనర్జీ ఇస్తుంది. శరణి చిన్న వయసులోనే పాజిటివ్‌గా ఉండబట్టే ఈ రోజు ఇలా నిలబడ్డారు.నమ్మకానికి సంకల్పం తోడైతే ఎన్ని సవాళ్లనైనా అధిగమించవచ్చు. నేనైనా, చిరంజీవి అయినా, ఎన్టీఆర్ అయినా సాధారణ కుటుంబం నుంచి వచ్చిన వాళ్లమే. మనిషి దృఢసంకల్పం ఎంతలా పని చేస్తుందో ఎన్టీఆర్ జీవితమే ఓ ఉదాహరణ. ఇప్పటి కంప్యూటర్లకు వెయ్యి రెట్లు వేగంగా పనిచేసే క్వాంటమ్ కంప్యూటింగ్‌ని త్వరలోనే చేపడుతున్నాం. ఏఐ అనేది ఓ రియాలిటీ. అందుకే అధికారులందరికీ ఏఐ నేర్పిస్తున్నార అని అన్నారు. వివిధ ప్రాంతాల్లో పర్యటించి, వివిధ వ్యక్తులను పరిశీలించి శరణి ఈ పుస్తకాన్ని రాశారు. గురువారం పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అంతర్భాంగా శరణి ముఖాముఖి అడిగిన ప్రశ్నలకు సీఎం చంద్రబాబు, చిరంజీవి సరదాగా సమాధానం ఇచ్చారు. చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. నారాయణ విద్యా సంస్థలు ఒక బ్రాండ్. ఆర్డినరీ స్టూడెంట్‌లను ఎక్స్‌ట్రా ఆర్డినరీగా మారుస్తారు.మీరు అదే నారాయణ దగ్గర పెరిగారు కాబట్టి ఇంత ప్రతిభావంతులు అయ్యారు. నన్ను శరణి కలిసినప్పుడు చిన్న పిల్ల అనుకున్నా. ఇప్పుడు మీరు ఎదిగిన తీరు చూసి ముచ్చటేస్తుంది ,ప్రతి మనిషి తన భావోద్వేగాలను స్వీయనియంత్ర చేసుకోవాలి,ప్రతికూల అంశాలకు తరుణోపాయం ఆలోచించాలన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ..పుస్తక ఆవిష్కరణ సభలో పాల్గొనడం నాకు ఆనందంగా ఉంది. గతంలో సీక్రెట్ అనే బుక్ నాకు ఎంతో నచ్చింది. ఇప్పుడు శరణి రాసిన పుస్తకం కూడా అందరికీ ఉపయోగకరంగా ఉంది. ఎంతోమంది కష్టం వచ్చిన వెంటనే కుంగి పోతుంటారు. కానీ అది కరెక్ట్ కాదు. మనకు నచ్చిన రంగంలో రాణించాలంటే పాజిటివ్ ఆలోచన ఉండాలి. నేను చదువుకునే వయసులో నాటకాలు వేస్తే అవార్డులు వచ్చాయి.

అప్పుడే నేను సినిమాల్లో ఎందుకు రాణించకూడదు అనుకున్నా. నువ్వు హీరో ఏంటి?.. నటుడు ఏంటి?.. అని చాలా మంది హేళన కూడా చేశారు. మా తల్లిదండ్రులకు చెబితే నన్ను ప్రోత్సహించారు. ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ తీసుకున్నా. రాత్రి కాలేజ్లో చదువుకున్నా. చదువు వదిలి సినిమాలే నా జీవితం అనుకుని ధైర్యంగా ముందుకు వెళ్లా.

ఆ తరువాత అందరి చేతా వావ్ అనిపించుకున్నా. నేడు ఇన్నికోట్ల మంది అభిమానం సంపాదించా. మన మైండ్ మనకు ఏది మంచిదో చెబుతుంది.

# దేశభద్రతపై కుట్రలు సాగవు

## - సియం చంద్రబాబు

**విజయవాడ,ఏప్రిల్24,ప్రభాతవార్తప్రతినిధి:** దేశ భద్రతను దెబ్బతీయాలని చూస్తే వారి ఆటలు సాగవని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేసారు."ఎక్స్" వేదికగా ఆయన జమ్మూ ఉగ్రదాడి నేపథ్యంలో విశాలమైన తీరప్రాంతం ఉన్న మన రాష్ట్ర భద్రత విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని వ్యాఖ్యానించారు.. పోలీస్ వ్యవస్థను సమర్ధవంతంగా నడిపిస్తాం. కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ ముందుకువెళ్తాం. మేధావులు, ప్రజలు, వివిధ వర్గాలకు చెందిన ప్రతి ఒక్కరూ ఆలోచించుకోవాలి.ఆయన దేశ సమగ్రత, భద్రతను దెబ్బతీయాలని చూసే వారి ఆటలు సాగవు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. క్లిష్ట సమయంలో కేంద్రానికి పూర్తిగా సహకరించాలని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. జమ్మూకాశ్మీర్ లోని పహల్గాం ఉగ్రదాడితో దేశ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, దేశ సమగ్రతభద్రత విషయంలో ఏకతాటిపైకి రావాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో అభివృద్ధిలో దూసుకెళ్తున్న భారతదేశాన్ని చూసి ఓర్వలేక ఇలాంటి దాడులు చేస్తున్నారని అన్నారు.చంద్రమోళి మృత దేహంపై జాతీయ జెండా కప్పారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. జమ్మూకాశ్మీర్ లో ఉగ్రవాదుల దాడి ముందస్తు ప్రణాళిక ప్రకారమే జరిగింది. విహారయాత్రకు వెళ్లిన వారిపై విచక్షణారహితంగా దాడులు జరిపారు.

# పంచాయతీలు స్వయం ప్రతిపత్తి సాధించాలి

**విజయవాడ,ఏప్రిల్24,ప్రభాతవార్తప్రతినిధి:**గ్రామ పంచాయతీలు బలంగా ఎదగాలి, ఆర్థిక, సామాజిక, రాజకీయ సమన్వయంతో ఐక్యంగా పని చేయాలి. అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు. అన్ని రంగాల్లో స్వయం ప్రతిపత్తిని సాధించాలి. అభివృద్ధి, ఆకాంక్షలు కలగలిపి స్వర్ణ గ్రామాలుగా వెలగాల్తి . పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు అన్న మహాత్ముడి మాటకు అనుగుణంగా పల్లెలు జాతీయ సమగ్రతకు, సుస్థిరతకు కూడా మూల కేంద్రాలు కావాలి అన్నారు. స్థానిక సంస్థలు అన్ని రంగాల్లో స్వావలంబన సాధించి స్థానిక ప్రభుత్వాలుగా మారేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, దానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్ లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో



జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం వేదికపై నుంచి కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి నివాళి అర్పిస్తున్న పవన్ కల్యాణ్

పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ నాకు పల్లెలు అంటే ప్రాణం. పల్లెల్లో బతకాలని బలంగా ఉండేది. కానీ సాధ్యపడలేదు. కూటమి ప్రభుత్వంలో చాలా ఇష్టంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలను చేపట్టాను. శాఖలను తీసుకున్న తర్వాత 2 నెలల పాటు సమగ్ర పరిశీలన చేసిన తర్వాత అధికారుల సమావేశంలో నేను చెప్పింది ఒక్కటే.. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో ఏ పనికి ఏ నిధుల కేటాయింపు జరిగిందో అది పక్కాగా దానికే ఖర్చు చేయాలి. పారదర్శకంగా పనులు జరగాలి అని చెప్పాను. ఎలాంటి మళ్లింపులు, వృధా ఖర్చులు లేకుండా పల్లెల్లో సౌకర్యాలు, వసతులు సమకూరాలి అని చెప్పాను. దాని ప్రకారమే ఇప్పుడు పనులు జరుగుతున్నాయి. గత అయిదేళ్ల ప్రభుత్వ హయాంలో ఎప్పుడు ఇంత ఘనంగా జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం జరగలేదు. అసలు ఇలాంటి దినోత్సవం ఉందని కూడా చాలామంది మర్చిపోయారు. పంచాయతీల నిధులను గత ప్రభుత్వం ఇష్టానికి వాడేసింది. గ్రామాభివృద్ధిని నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వ వచ్చిన వెంటనే ఆర్థిక సంఘం పెండింగ్ నిధులు, రావాల్సిన నిధులను డైరెక్టుగా పంచాయతీల ఖాతాల్లో వేశాం. రూ.1,121 కోట్ల 15వ ఆర్థికం సంఘం నిధులను అందించడం గొప్ప విషయం. ఆర్థికంగా పంచాయతీలను బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. పంచాయతీల స్వయం సమృద్ధి సాధించి ముందుకు సాగేలా ప్రణాళిక రాజకీయాలకు అతీతంగా నిధులు అందిస్తున్నాం గ్రామ పంచాయతీలు గతంలో కులాలు, రాజకీయాలు, వర్గపోరుతో సతమతం అయ్యేవి. దీన్ని క్రమంగా అధిగమిస్తున్నాం. గ్రామ పంచాయతీలకు రాజకీయాలకు అతీతంగా నిధులు అందిస్తున్నాం. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే గ్రామ సర్పంచుల ఆత్మగౌరవం నిలిపేలా జాతీయ పండుగల నిధులను పెంచాం. 70 నుంచి 80 శాతం విపక్ష పార్టీల సర్పంచులు ఉన్నప్పటికీ రూ.100లు ఉన్న నిధుల్ని రూ.10 వేలు, రూ.250 లు ఉన్న పంచాయతీలకు రూ.25 వేలు చేశాం. స్థానిక సంస్థల సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలకు తగిన గౌరవం ఇస్తున్నాం. దాన్ని కొనసాగిస్తాం. కలప పెంచుదాం.. దేశానికి సేవ చేద్దాం భారతదేశం ఏటా రూ.20 వేల కోట్ల కలపను దిగుమతి చేసుకుంటోంది. దీనివల్ల విదేశీ మారకద్రవ్యం ఖర్చు అవుతోంది. పంచాయతీల్లో కలపను పెంచేలా ఓ ప్రణాళికను అమలు చేయనున్నాం.

# డాక్టర్ల నిర్లక్ష్యంతోనే దుర్గ మృతి

## - అపోలోకు ఇచ్చిన లీజును ప్రభుత్వం వెంటనే రద్దుచేయాలి

**చిత్తూరురూరల్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** తన కుమార్తె, తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ మహిళా విభాగ కార్యదర్శి శ్రీదుర్గ మృతికి ముమ్మాటికి కార్పొరేట్ వైద్యశాల అపోలో వైద్యుల నిర్లక్ష్యమే కారణమని జాతీయ బిసి సంక్షేమ సంఘ దక్షిణాది రాష్ట్రాల ఇన్‌ఛార్జ్, తెలుగుదేశం పార్టీ నాయకులు షణ్ముగం తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం బిసి సంక్షేమ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన కుమార్తె గత సోమవారం పారెస్టు సమీప రహదారిలో ద్విచక్రవాహనంలో వెళుతుండగా ప్రమాదం జరిగడంతో వెంటనే తాను కుటుంబసభ్యులు ఆమెను చిత్తూరు ప్రభుత్వఆసుపత్రికి తరలించామన్నారు. ఆసుపత్రిలో అపోలో వైద్యులు పరీక్షలు నిర్వహించి ఎలాంటి ప్రమాదం లేదని స్వల్పగాయమైందని తెలిపి ప్రాథమిక చికిత్స నిర్వహించి పంపడం జరిగిందన్నారు. ఇంటికి వెళ్లిన కేవలం 18గంటల వ్యవధిలోనే నాకుమార్తె తీవ్ర అస్వస్థతకు గురికావడంలలో తిరిగి ఆసుపత్రికి తీసుకువెళ్లడం జరిగిందనీ, అయితే ఆమె మృతి చెందిందనీ చెప్పడం తీవ్ర ఆవేదనకు గురి చేసిందన్నారు. శ్రీదుర్గ తలకు బలమైన గాయం కావడం వల్లే చనిపోయిందని అపోలో వైద్యులు చెప్పడం జరిగిందన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అన్ని రకాల పరీక్షలు నిర్వహించి ఎలాంటి ప్రాణహాని లేదని చెప్పిన డాక్టర్లే చివరకు తలకు బలమైన గాయం కావడం వలనే చనిపోయిందని చెప్పడం చూస్తే అపోలో వైద్యులు ప్రజల ప్రాణాలతో ఏవిధంగా చెలగాటమాడుతున్నారో తెలిసిందన్నారు. నా బిడ్డకు జరిగిన అన్యాయంపై ప్రభుత్వం తక్షణ న్యాయవిచారణకు ఆదేశించాలని, ప్రభుత్వం వీరికి ఇచ్చిన లీజును వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేసారు. న్యాయం జరగని పక్షంలో ప్రజల కోసం ఆసుపత్రి లీజును రద్దు చేసేంతవరకు ఆమరణ నిరాహార దీక్ష చేపడుతానని హెచ్చరించారు. ముఖ్యమంత్రి పేదలకు కార్పొరేట్ ఆసుపత్రి ద్వారా మెరుగైన వైద్యం అందుతుందనే మంచి ఉద్దేశంతో అపోలో ఆసుపత్రికి లీజుకు ఇవ్వడం జరిగిందనీ, అయితే అపోలో యాజమాన్యం కేవలం జిల్లా ప్రభుత్వాసుపత్రిని వారి కళాశాలగా వినియోగిస్తూ వారి స్టూడెంట్ల ద్వారా పేద ప్రజల ప్రాణాలతో ఆటలాడుతున్నారనీ, రాజకీయంగా ప్రజల సేవలో వున్న తమకే ఇలా జరిగిందంటే సామాన్యప్రజలకు ఈ అపోలో యాజమాన్యం ఏవిధంగా వైద్యం అందిస్తుందో ప్రభుత్వం గుర్తించాలనీ, ఇందుకు బాధ్యులైన అపోలో వైద్యకళాశాల సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.

# స్ఫూర్తి దాయకంగా రాంకో సిమెంట్స్ వ్యవస్థాపకులు రామస్వామిరాజా జయంతి వేడుకలు

**జగ్గయ్యపేట, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండల పరిధిలోగల ధర్మవరప్పాడుతండలో నెలకొనివున్న రాంకో సిమెంట్స్ ఫ్యాక్టరీలో వ్యవస్థాపకులు పిఏసి రామస్వామిరాజా 131వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత వత్సవాయి మండలం మక్కపేటలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కాగడాలతో ర్యాలీ



జయంతి వేడుకలో ఆయన విగ్రహం ఎదుట నివాళులర్పిస్తున్న రాంకో ఉద్యోగులు.

ప్రారంభించారు. ర్యాలీ చిల్లకల్లు మీదుగా జగ్గయ్యపేట నుండి తిరిగి జయంతిపురం మీదుగా రాంకో సిమెంట్స్ ఫ్యాక్టరీకి చేరుకుంది. ఫ్యాక్టరీ ఆవరణలో శ్రీవిజయగణపతి దేవాలయంలో పూజలు నిర్వహించిన సిబ్బంది దివంగత రామసామి రాజా విగ్రహానికి పూలమాలలు అలంకరించి నివాళులర్పించారు. జగ్గయ్యపేట పట్టణంలోని శ్రీశివానంద పలహారశాల వద్ద శ్రీశివానంద నిత్యాన్నదాన నిర్వహణ సమితి ఆధ్వర్యంలో పేదలు, అనాధలకు దుప్పట్లు పంపిణీచేశారు. వారికి స్వీట్ ప్యాకెట్లు, భోజనం పొట్లాలు కూడా అందజేశారు. ఈకార్యక్రమాల్లో స్థానిక ఎంఎల్‌ఏ శ్రీరాం రాజగోపాల్, మాజీ ఎంఎల్‌ఏ సామినేని ఉదయభాను, మాజీ కెడిసిసి బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ నూకల కుమారరాజ కూడా పాల్గొన్నారు. కంపెనీ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రెసిడెంట్ ఆశిష్‌కుమార్ శ్రీవాస్తవా, ఉపాధ్యక్షులు ఎస్‌విఆర్‌కె మూర్తిరావు, సీనియర్ జనరల్ మేనేజర్ అకౌంట్ అండ్ అడ్మిన్ ఫరూక్‌మహ్మద్, హెచ్‌ఆర్ రామకృష్ణసాయి, ఫ్యాక్టరీ ఉద్యోగులు, కాలనీవాసులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం అన్నదాన కార్యక్రమంతోపాటు సాంస్కృతిక ప్రదర్శనలు, ఉద్యోగులకు లాంగ్ సర్వీస్ అవార్డులు ఫ్యాక్టరీ యాజమాన్యం బహూకరించింది.

# దుర్గమ్మ సేవలో ఏరోస్పేస్ డిఫెన్స్ అధికారులు



**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త** దుర్గమ్మవారిని గురువారం ఆంధ్రప్రదేశ్ ఏరోస్పేస్ డిఫెన్స్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌కి సలహాదారుడుగా నియమితులైన డిఆర్‌డిఓ మాజీ చైర్మన్ డా జి సతీష్‌రెడ్డి మరియు పలువురు అధికారుల బృందం దర్శించుకున్నారు. వారికి అధికారులు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేశారు. వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలను అధికారులు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

- నిత్యాన్నదానానికి విరాళం:

దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి ఇబ్రహీంపట్నం గుంటుపల్లికి చెందిన జి మధుకిరణ్ రు.1లక్ష 116ల విరాళం గురువారం ఆలయాధికారులకు అందించారు. దాతకు వారి కుటుంబ సభ్యులకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అధికారులు తదుపరి వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలను అందించారు. వేదపండితులు ఆశీర్వచనాలందించారు.

# రైల్వే టిటిఇపై దాడి కేసులో ముగ్గురి అరెస్టు

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 24,ప్రభాతవార్త** విధి నిర్వహణలో ఉన్న రైల్వే టిటిఇపై దాడికి పాల్పడిన కేసులో ముగ్గురు నింధితులను అరెస్టు చేసినట్లు రైల్వే అధికార వర్గాల ద్వారా తెలిసింది. మైసూర్ నుంచి వారణాసి వెళ్తున్న నెంబర్ 22687 ఎక్స్‌ప్రెస్ రైలుకు చెందిన ఎస్-3బోగీలో విధులు నిర్వహిస్తున్న గోవింద నాయక్ అనే టిటిఇ దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలోని యాద్గీర్-వాడి స్టేషన్ల మధ్య టిక్కెట్లు తనిఖీలు నిర్వహిస్తుండగా టిక్కెట్ తీసుకోకుండా ప్రయాణిస్తున్న ముగ్గురిని గుర్తించి టిక్కెట్‌లు తీసుకోకుండ ప్రయాణించడం నేరమని టిక్కెట్‌లు తీసుకోవాలని కోరడంతో కోపోద్రిక్తులైన సదరు వ్యక్తులు రైలు వాడి రైల్వేస్టేషన్ చేరుకున్నాక, టిటిఇని వాడి రైల్వే స్టేషన్ బుకింగ్ కార్యాలయం వద్ద కాపుకాచి టిటిఇపై దాడి చేసి తీవ్రంగా కొట్టిన సంఘటన రైల్వేలో సంచలనం సృష్టించింది. ఈ సంఘటనకు సంబంధించిన సమాచారాన్ని రైల్వే వర్గాలు డిఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా దృష్టికి తీసుకెళ్లడం ఆయన తక్షణం స్పందించి సెంట్రల్ రైల్వే, షోలాపూర్ డిఆర్‌ఎంకు కేసు వివరాలను తీసుకెళ్లడం, సకాలంలో అధికార యంత్రాంగం స్పందించడంతో వాడి రైల్వే స్టేషన్‌లో జిఆర్‌పి పోలీసుస్టేషన్ ఎస్ఐ 115(2),132,351(2), బిఎన్ఎస్-2023సెక్షన్ 191ల కింద నింధితులపై క్రిమినల్ కేసు(నెంబర్ 39/2025)నమోదు చేశారు.

ఈ కేసులో వాడి పట్టణానికి చెందిన ఎండి హుస్సేన్,మిథున్,ఎండి సాధిక్ అనే ముగ్గురు నింధితులను అరెస్టు చేసినట్లు సమాచారం.

# సమస్యలు పరిష్కరించాలంటూ ఎన్‌హెచ్ఎం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్, హెల్త్ ప్రొవైడర్స్ ధర్నా

**విజయవాడ, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** నేషనల్ హెల్త్ మిషన్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్‌లో గురువారం నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎంసిఏ రాష్ట్ర కార్యదర్శి సందీప్ కుమార్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో ఎన్‌హెచ్ఎం కింద సిహెచ్ఓలుగా పనిచేస్తున్న గత 2 సంవత్సరాలుగా జీతభత్యాల విషయంలో ఎన్నో సమస్యలెదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ డిమాండ్ల సాధనకు ఈ నిరసన చేస్తున్నామన్నారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల మేరకు ఉద్యోగభద్రత కల్పించాలని, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ జరగాలని, ఈపిఎఫ్ఓ పునరుద్దరించాలని, క్లినిక్ అద్దెబకాయిలు వెంటనే చెల్లించి క్రమబద్దీకరించాలని, నిర్దిష్ట జాబ్ చాటర్ అందించాలని, ఎస్ఆర్ఎస్ నుండి సిహెచ్ఓలకు మినహాయింపు నివ్వాలని, హెచ్ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్స్ ట్రాన స్ఫర్స్, ఎక్స్‌గ్రేషియా, పితృత్వ సెలవలు మొదలైనవి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం నలుమూలల నుండి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, హెల్త్ ప్రొవైడర్స్ పాల్గొన్నారు. వారికి సంఘీభావం తెలుపుతూ ఏపి ఎన్‌జిఓ నాయకులు శివారెడ్డి, విద్యాసాగర్‌లు పాల్గొని వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి, సిహెచ్ఓల దృష్టికి తీసుకెళ్ళి సామరస్యంగా పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తామని భరోసా నిచ్చారు.

# లిక్కర్ స్కాంలో మరో నిందితుడు అరెస్ట్

**విజయవాడ,ఏప్రిల్24,ప్రభాతవార్త ప్రతినిధి:**ఏపీ లిక్కర్ స్కాంలో మరో నిందితుడిని సిట్‌అదుపులోకి తీసుకుంది. ఇప్పటికే ఈ కేసులో కీలక నిందితుడు కసిరెడ్డి రాజ్‌ను పోలీసులు అదుపులో తీసుకున్నారు.ఇదే లిక్కర్ స్కాం కేసులో ఏ8 గా ఉన్న చాణక్యను తాజాగా అదుపులోకి తీసుకున్నారు.నిందితుడు విదేశాల నుంచి వస్తున్నాడనే కీలక సమాచారాన్ని సిట్ ముందే తెలుసుకుంది.దాంతో దుబాయి నుండి హైదరాబాద్ వచ్చిన చాణక్యను అదుపులోకి సిట్ తీసుకుంది.విజయవాడకు చాణక్యను సిట్ అధికారులు తరలిస్తున్నారు.విచారణ అనంతరం సిట్ అతన్ని రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరు పరిచే అవకాశం ఉంది.,

# హత్యకేసులో జీవిత కారాగారశిక్ష: రూ.15వేలు జరిమాన

**శ్రీకాళహస్తి రూరల్,ఏప్రిల్ 24 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండలం మునలిపేడులో 2017మే 11న జరిగిన హత్యకేసులో గురువారం తీర్పు వెలువడింది. నిందితులకు న్యాయస్థానం జీవిత కారాగార శిక్షతో పాటు రూ.15వేలు జరిమాన విధిస్తూ తీర్పు చెప్పిందని సిఐ జయచంద్ర విలేకరులకు వివరించారు. ఆయన అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మునలిపేడు గ్రామానికి చెందిన రెండు కుటుంబాల మధ్య ఆస్తి తగాదా చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో ముద్దాయిలు సుజాత,ఆమె తల్లి రాణెమ్మ, సుజాత భర్త వవెంకటేశ్వరులు కలసి సుజాత అన్నసుబ్రమణ్యం భార్య సుబ్బమ్మను చంపారు.హత్యకు గురైన సుబ్బమ్మ కుమారుడు జగ్గయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటిలో ఎస్ఐ ఎం.వెంకటరమణ కేసు నమోదు చేసారు. ఐపిసి 302,109,సెక్షన్ల కింద కేసునమోదు చేసారు. రేణిగుంట రూరల్ సిఐ జి.మురళీధర్ సాధిక్ అలి దర్యాప్తు చేసారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

# మద్యం మత్తు విముక్తి కేంద్రాలపై ప్రచారం కల్పించాలి ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

**విజయవాడ,ఏప్రిల్ 24,ప్రభాతవార్త** ప్రతినిధిమద్యం మత్తు విముక్తి కేంద్రాలపై ప్రజల్లో అవగాహన లేదని హైకోర్టు పేర్కొంది. వాటిపై విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. మద్యం విముక్తి కేంద్రాలపై అవగాహన కల్పించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?బడ్జెట్ ఎంత కేటాయించారు అన్న వివరాలతో కౌంటర్ వేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆరోగ్య,ఎక్సైజ్ శాఖల ముఖ్య కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. నెలలో ఓ వ్యక్తికి విక్రయించే మద్యం సీసాల గరిష్ట సంఖ్యను నిర్ణయించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలన్న పిటీషనర్ అభ్యర్థనను తోసిపుచ్చింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాగూర్,జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. మత్తు విముక్తి కేంద్రాల పనితీరు,భాధితులకు అందుతున్న చికిత్సను పర్యవేక్షించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ విశాఖకు చెందిన షిరన్ రెహ్మాన్ హైకోర్టులో పిల్ వేశారు. ఆధార్ కార్డ్‌తో లింక్ చేసి 21 ఏళ్ళ లోపు వారికి మద్యం విక్రయించకుండా నిలువరించాలని కోరారు.

## విశాఖ-చర్లపల్లి ప్రత్యేక రైళ్లు మే వరకు పొడిగింపు

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 24,ప్రభాతవార్త** ప్రస్తుత వేసవి సీజన్‌లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ ప్రస్తుతం విశాఖపట్నం-చర్లపల్లి-విశాఖపట్నం మధ్య నడుపుతున్న ప్రత్యేక రైలు సర్వీసులను మే ఆఖరు వరకు పొడిగించినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. విశాఖపట్నం నుంచి ప్రతి శుక్రవారాల్లో చర్లపల్లి వెళ్లే నెంబర్ 08579ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 25నుంచి మే 30వరకు చర్లపల్లి నుంచి విశాఖపట్నంకు ప్రతి శనివారం బయలుదేరే నెంబర్ 08580ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ సర్వీసులను ఈ నెల 26నుంచి మే 31వరకు పొడిగించారు.

# మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి నిరసన

**విజయవాడ,ఏప్రిల్ 24,ప్రభాతవార్త ప్రతినిధి:**జమ్మూ కాశ్మీర్ నందు జరిగిన ఉగ్రదాడి దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన పర్యాటకుల ఆత్మకు శాంతి చేకూరాలని రాష్ట్ర అధ్యక్షులు ఫరూఖ్ షిబ్లీ ఆకాంక్షించారు.అలాగే దేశ సౌభాతృత్వాన్ని మన ఐకమత్యాన్ని కులాలకు,మతాలకతీతంగా దాయాది దేశానికి తెలిసేలా మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి నిరసన ప్రదర్శనలు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టాలని రాష్ట్ర అధ్యక్షులు ఫరూఖ్ షిబ్లీ పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా రేపు మొగల్రాజపురం లోని సిద్ధార్థ కళాశాల సర్కిల్ వద్ద ఉన్న మథర్ థెరిస్సా స్టాట్యూ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తామని తెలియచేశారు.

కార్యక్రమాన్ని కులమతాలకతీతంగా ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

10page:25-04Pg5exHMNWJQE.qxd 01/01/01 11:03 AM Page 1



# పోలవరానికి మేలో విదేశీ నిపుణుల బృందం

## - కీలకాంశాలపై నిర్ణయాల వెల్లడి

**విజయవాడ,ఏప్రిల్24,ప్రభాతవార్తప్రతినిధి:**పోలవరం ప్రాజెక్ట్‌ను విదేశీ నిపుణుల బృందం మరోసారి వచ్చే నెలలో పరిశీలించనుంది. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి మార్గదర్శనం చేసేలా కేంద్ర జల్‌శక్తి శాఖ విదేశీ నిపుణులను నియమించిన సంగతి తెలిసిందే. నిపుణులు చార్లెస్ రిచర్ట్ డొన్నెల్లీ,డగ్లస్ హించ్‌బెర్గర్,బ్రియాన్ పాల్,డి.సిస్కోలతో కూడిన ఈ బృందం మే 4 నుండి 8 వరకు ప్రాజెక్ట్‌ను పర్యటించనుంది. ఈ సందర్భంగా గ్యాప్-1 ప్రధాన డ్యాం ఆకృతులు ఖరారవుతాయని భావిస్తున్నారు. ఇప్పటికే దీని ఆకృతులు సిద్ధం చేసి పోలవరం అథారిటీ ద్వారా కేంద్ర జలసంఘానికి పంపారు. వీటిపై లోతుగా చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. డయాఫ్రం వాల్ నిర్మించే చోట కొంత మేర బంకమట్టి రీచ్ ఉంది. అక్కడ భూ స్థితిని మెరుగుపర్చాలా లేదా అన్న అంశంపై డిజైన్ కన్సల్టెన్సీ ఆఫ్రి కొన్ని ప్రతిపాదనలు చేసింది. వీటిపై నిపుణుల బృందం నిర్ణయం తీసుకోనుంది. బీ-ఈ ప్రాజెక్ట్‌లో కీలకమైందిగ్యాప్-2 ప్రధాన డ్యాం నిర్మాణం.డయాఫ్రం వాల్ నిర్మించాక ప్రధాన డ్యాం నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అయితే డయాఫ్రం వాల్ నిర్మిస్తూనే,సమాంతరంగా ప్రధాన డ్యాం రెండో భాగం కట్టేందుకు ఇప్పటికే నిపుణుల బృందం అంగీకరించింది.నవంబరు నుండి గ్యాప్-2 ప్రధాన డ్యాం నిర్మించాలన్న ఆలోచనతో ఉన్నారు. దీని ఆకృతులపై నిపుణులు చర్చించనున్నారు.

# రాకెట్ కేంద్రానికి రక్షణ పెంపు



**శ్రీహరికోట (తడ), ఏప్రిల్ 24 ప్రభాతవార్త** పెహల్‌గామ్ కాల్పుల నేపథ్యంలో భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం శ్రీహరికోటకు కూడా భద్రత పెంచారు. ఇండియా, పాకిస్తాన్ సరిహద్దుల్లో జరుగుతున్న సంఘటనలతో దేశంలోని ముఖ్యమైన ప్రదేశాల భద్రతపై కేంద్రప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా శ్రీహరికోట రాకెట్ కేంద్రం తీరప్రాంతంతో పాటు ప్రధాన గేట్ల వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. సిఐఎస్ఎఫ్ దళాలు, తీరప్రాంత గస్తీ దళాలు కంటికి రెప్పలా అంతరిక్ష ప్రయోగ కేంద్రాన్ని కాపాడుకుంటున్నాయి. మరోవైపు షార్‌లో ఒకేసారి నాలుగు రాకెట్లను జూలైలోగా ప్రయోగించడానికి ఇస్రో సిద్ధమైంది.

# తిరుమల సమాచారం

## తిరుమలలో విరాళంగా ఎలక్ట్రిక్ స్కూటర్



**తిరుమల,ఏప్రిల్ 24ప్రభాత వార్తప్రతి నిధి:** టిటిడికి ఓ దాత ఎలక్ట్రిక్ స్కూటర్ విరాళమిచ్చాడు. మహా రాష్ట్రకు చెందిన బిగాస్ ఆటో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఉపాధ్యక్షుడు దుర్గేష్ గుప్త 1.40లక్షల రూపాయలు విలువైన స్కూటర్‌ను టిటిడి ఆలయ డిప్యూటీ ఇఒలోకనాథంకు అంద జేశారు.ఆలయ అవసరాలకు ఈ వాహనం వినియోగించనున్నారు.

## ఆన్‌లైన్ దర్శన టిక్కెట్లకు విశేష స్పందన

**తిరుమల,ఏప్రిల్ 24ప్రభాత వార్తప్రతి నిధి:** మూడునెలల ముందుగానే ఆన్‌లైన్‌లో టిటిడి విడుదల చేసే దర్శనాల టిక్కెట్లకు విశేష స్పందన వస్తోంది. గురువారం విడుదల చేసిన దివ్యాంగులు, వయోవృద్దులు ఉచిత దర్శనాల టిక్కెట్లు, 300 రూపాయలు ఎస్ఇడి దర్శనాల టిక్కెట్లు విడుదలైన కొన్నినిముషాల్లోనే అన్నీ బుక్అయ్యాయి.

రోజుకు వెయ్యివరకు ప్రత్యేక దర్శనాలు, రోజుకు 25వేల వరకు ఎస్ఇడి దర్శనాలు టిక్కెట్లు నెలకు సంబంధించి విడుదల చేశారు.

## శ్రీవారి సుప్రభాతసేవలో మీనాక్షిచౌదరి



**తిరుమల,ఏప్రిల్ 24ప్రభాతవార్తప్రతినిధి:** ఇష్టదైవం శ్రీవేంకటేశ్వరస్వామిని గురువారం వేకువజామున సుప్రభాతసేవలో సినీనటి మీనాక్షిచౌదరి పాల్గొన్నారు. ఆలయంలోనికి చేరుకుని సేవ అనంతరం దేవదేవుని దర్శించుకుని ఆశీస్సు లందుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## యూట్యూబ్‌లో అన్నమయ్య సంకీర్తనలు



**తిరుమల,ఏప్రిల్ 24ప్రభాత వార్తప్రతినిధి:** పదకవితాపితా మహుదు తాళ్ళపాక అన్నమయ్య సంకీర్తనలను ప్రజలందరికీ, ముఖ్యంగా యువతకు యూట్యూబ్‌ద్వారా చేరువచేయాలని టిటిడి ఇఒ జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పరిష్కరించబడిన అన్నమయ్య సంకీర్తనలను ఎస్వీబిసి యూట్యూబ్ ఛానల్ ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.ఇందుకోసం నిపుణులతో కమిటీని ఏర్పాటుచేసి వారి సలహాలు, సూచనలతో వేగవంతంగా సంకీర్తనలను యూట్యూబ్‌లో ఉంచేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. వేసవిలో తిరుమల ఆలయంతోబాటు స్థానిక ఆలయాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లుచేయాలన్నారు. ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో ఇఒ శ్యామలరావు కూలంకుషంగా చర్చించారు.గురువారం మధ్యాహ్నం టిటిడి పరిపాలన భవనంలో జరిగిన ఈ సమావేశంలో టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, సిపిఆర్ఒ డాక్టర్‌తలారి రవి, వేదవిశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య రాణిసదాశివమూర్తి, ఎఫ్ఎసిఎఒ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలలో సిసికెమెరాలు



**తిరుమల,ఏప్రిల్ 24ప్రభాతవార్తప్రతినిధి:** కాశ్మీర్‌పహల్గామ్‌లో ఉగ్రదాడులతో ఏడుకొండలపై భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తున్నారు. ఇందులో బాగంగా ఇప్పటికే తిరుమలలో 4వేల వరకు సిసి కెమెరాలు అన్ని చోట్లా ఉన్నాయి. ఇంకా నూతనంగా నిర్మించిన అతిదిగృహాలు, పిఏసి 5, ,రింగురోడ్డు పరిసరాల్లో అత్యవసరంగా సిసికెమెరాలు అమర్చుతున్నారు. కొండకు వస్తే చీమచిటుక్కుమన్నా క్షణాల్లో కనిపెట్టేలా నిఘాను అప్రమత్తం చేస్తున్నారు.

తిరుమలలో సుదర్శన్ యాత్రికుల వసతి సముదాయం వద్ద ఆక్టోపస్ బలగాలు మాక్‌డ్రిల్ చేపట్టాయి.

## పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు జూన్ 1న తుది పరీక్ష..

**విజయవాడ ఏప్రిల్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు ఏపీ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. జూన్ 1న తుది రాతపరీక్ష నిర్వహించబోతున్నట్లు ప్రకటించింది. విశాఖ, కాకినాడ, గుంటూరు , కర్నూలు, తిరుపతిలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. జూన్ 1న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రాతపరీక్ష నిర్వహించనున్నారు. 2023 జనవరిలో నిర్వహించిన ప్రాథమిక పరీక్షకు 4.59 లక్షల మంది హాజరుకాగా మొత్తం 95,208 మంది అర్హత సాధించారు. వీరికి 2024 డిసెంబరులో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 38,910 మందినెగ్గారు. వీరందరికీ జూన్ 1న రాత పరీక్ష నిర్వహించనున్నారు. పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు వెల్లడించింది.

# బిసి స్టడీ సర్కిల్ ద్వారా డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్

## కార్యాలయం నుంచి లాంఛనంగా ప్రారంభించిన మంత్రి సవిత

**విజయవాడ,ఏప్రిల్24,ప్రభాతవార్తపతవనిధి:** బీసీ స్టడీ సర్కిల్ ద్వారా బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు, ఎస్సీ, ఎస్టీ డీఎస్సీ అభ్యర్థులందరికీ ఆన్ లైన్ ద్వారా ఉచిత డీఎస్సీ కోచింగ్ అందివ్వనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఇందుకోసం శ్యామ్ ఇన్ స్టిట్యూట్ ఆచార్య యాప్ రూపొందించామని, ఈ యాప్ ద్వారా 24 గంటల పాటు ఉచిత శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్ లో ఆన్ లైన్ ఉచిత డీఎస్సీ కోచింగ్ ను మంత్రి సవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఇచ్చిన మాటను సీఎం చంద్రబాబునాయుడు నెరవేర్చుతూ, 16,347 టీచర్ పోస్టుల భర్తీకి ఇటీవలే నోటిఫికేషన్ విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ నిర్వహణ ఫైల్ పై మొదట సంతకం చేశారన్నారు. డీఎస్సీ ద్వారా అత్యధిక ఉపాధ్యాయ పోస్టులు బీసీ అభ్యర్థులే సాధించాలన్నది లక్ష్యంతో బీసీ సంక్షేమ శాఖ ద్వారా ఉచిత కోచింగ్ సెంటర్లు ప్రారంభించామన్నారు. 26 జిల్లాల్లోనూ బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్లు నిర్వహించామన్నారు. ఈ కేంద్రాల ద్వారా బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు, ఎస్సీ, ఎస్టీ డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందజేశామన్నారు. ఈ శిక్షణా కాలంలో నెలకు రూ.1500ల స్టయిఫండ్ తో పాటు మరో రూ.1000ల పుస్తకాల కొనుగోలుకు అందజేశామన్నారు. .ఆన్ఆఫ్ లైన్ లో కోచింగ్ కు పొందలేని గృహిణులు, సుదూర ప్రాంతవాసులు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో చిన్న చిన్న ఉద్యోగాలు చేసే వారితో ఆర్థికంగా ఉన్న వెనుకబడిన వారికి లబ్ధి కలిగే ఆన్ లైన్ కోచింగ్ ప్రారంభించినట్లు మంత్రి సవిత తెలిపారు. దరఖాస్తు చేసుకున్న బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల ందరికీ ఉచిత కోచింగ్ అందజేస్తామన్నారు. ప్రస్తుతం 3,189 మంది దరఖాస్తులొచ్చాయన్నారు. ఇంకెంతమందైనా దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఆన్ లైన్ ద్వారా డీఎస్సీ ఉచిత కోచింగ్ అందజేస్తామన్నారు.

# సంపద సృష్టి తక్కువ.. అప్పులు ఎక్కువ

### కూటమి ప్రభుత్వం ప్రజలను భ్రమలో పెడుతున్నది

## - వైఎస్సార్సీ నేత బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

**విజయవాడ,ఏప్రిల్24,ప్రభాతవార్తప్రతినిధి:** సంపద సృష్టి తక్కువ అప్పులు ఎక్కువఅంటూ కూటమి ప్రభుత్వంపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఏపీ మాజీ ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారిందన్నారు.అప్పు.. సంపద పరిస్థితి ఏంటి..? అని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేంద్రంలో మద్దతు ఉంది అని చెప్పుకుంటున్నారు.ఎటువంటి మార్పు లేదు అని ఆయన దుయ్యబట్టారు. అప్పు అంత ఉంది.. ఇంత ఉందని ఎవరు నోటికి ఏదోస్తే అది చెప్తున్నారు.. మట్కా లెక్కల మాదిరి అప్పు లెక్కలు మాట్లాడుతున్నారు అని ప్రజలు అంటున్నారన్నారని బుగ్గన అన్నారు. సంపదను సృష్టిస్తామని చెబుతుంటే అనుభవం గల నేతలని ప్రజలు వారిని నమ్మారు అని ఆయన పేర్కొన్నారు.

# టిటిడిలో శాశ్వత ఉద్యోగాలు భర్తీచేయాలి

## - మాజీ కేంద్రమంత్రి డాక్టర్ చింతామోహన్

**తిరుపతి,ఏప్రిల్ 24ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడిలో 1991లో 2,800మంది ఎన్ఎంఆర్‌లను కాంగ్రెస్ ప్రభుత్వం ఒకజిఒతో శాశ్వత ఉద్యోగులుగా మార్చారని, అదే కూటమి ప్రభుత్వం శాశ్వత ఉద్యోగాలు భర్తీచేయాలని కాంగ్రెస్‌పార్టీ సీనియర్‌నాయకుడు, మాజీకేంద్రమంత్రి డాక్టర్ చింతామోహన్ డిమాండ్ చేశారు. అలిపిరి నుండి పేరూరు వరకు ఉన్న 400 ఎకరాలు టిటిడి స్థలాల్లో టిటిడి ఉద్యోగులు, అధికారులు, అర్చకులు ఐదు సెంట్లు ఇంటిస్థలాలుఇవ్వాలని ఆయన సూచించారు.ఎన్ఎంఆర్‌లందరినీ శాశ్వత ఉద్యోగులుగా జిఒ విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం ఉదయం తిరుపతి టిటిడి పరిపాలనభవనం వద్ద కాంగ్రెస్ నాయకులతో కలసి నిరసన తెలిపారు. టిటిడిలో అన్యమత ఉద్యోగులను పంపేస్తున్నారని, దీనికి ట్రంప్ అమెరికాలో ఉన్న హిందువులును తరిమేస్తున్నాడని వ్యంగ్యాస్త్రాలు వేశారు.జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.లడ్డూల కల్తీరగడ, గోవుల మరణాల రగడ కాదని, తిరుమలలో అంగళ్ళు ఎస్సీలకు కూడా ఇవ్వాలన్నారు.

# ముంబయి నటి కేసులో ఆంజనేయులు కస్టడీ కోరుతూ సిఐడి పిటిషన్

**విజయవాడ ఏప్రిల్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ముంబయి సినీ నటి కాదంబరీ జెత్వానీపై కేసులో సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులను కస్టడీకి ఇవ్వాలని సీఐడీ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ముంబయికి చెందిన సినీ నటి కాదంబరీ జెత్వానీపై తప్పుడు కేసు పెట్టించి అక్రమంగా అరెస్ట్ చేసి వేధింపులకు గురిచేసిన కేసులో ఏ2గా ఉన్న పీఎస్ఆర్ ఆంజనేయులను సీఐడీ పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఆయనకు విజయవాడ సీఐడీ కోర్టు మే 7 వరకు జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. అనంతరం ఆయన్ని విజయవాడలోని జిల్లా కారాగారానికి తరలించారు. ఈ నేపథ్యంలో సీఐడీ తాజాగా ఆయన్ని కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసింది. ఓ పారిశ్రామికవేత్తను అత్యాచార కేసు నుంచి బయట పడేసేందుకు అప్పటి సీఎం జగన్ హయాంలో సీఎంవో కేంద్రంగా నాటి నిఘా విభాగాధిపతి పీఎస్ఆర్ ఆంజనేయులు వైకాపా నేత కుక్కల విద్యాసాగర్ తదితరులతో కలిసి ఫోర్జరీ దస్త్రం ఆధారంగా తనపై అక్రమ కేసు పెట్టి వేధించారని కాదంబరీ జెత్వానీ ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో రెండో నిందితుడిగా ఉన్న ఆంజనేయులను సీఐడీ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు.

# ది టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్ లో ఎస్వీయూకు స్థానం

**తిరుపతి విద్య ఏప్రిల్ 24 ప్రభాత వార్త** ది టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆసియా యూనివర్సిటీ ర్యాంకింగ్స్ సంస్థ ఆసియాలోని ఇంటెన్సివ్ విశ్వవిద్యాలయాలను పరిశోధించి అత్యంత సమగ్రమైన అంచనాలతో ర్యాంకులు ప్రకటించింది.తన 2025 ఎడిషన్లో 35 దేశాలలో 853 వర్సిటీలలో బోధన, పరిశోధన నాణ్యత, విజ్ఞాన పంపిణీ, అంతర్జాతీయ దృక్పథం వంటి కీలక సూచికల ఆధారంగా మూల్యాంకన చేశారు. అందులో భాగంగా ఎస్వీయూ పనితీరును అంతర్జాతీయ ఔట్లుక్లో 29.2, పరిశోధన నాణ్యతలో 25.0,పరిశ్రమ నిశ్చయతో 25.6, పరిశోధనవాతావరణంలో 14.1,బోధనలో 43.5 వంటి కొలమానాల ఆధారంగా పాయింట్లను కేటాయించి ఈ ప్రతిష్టాత్మక గుర్తింపును అందించింది.ఈ సందర్భంగా వీసీ సీహెచ్ అప్పారావు మాట్లాడుతూ ఎస్వీయూ దిటైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ సంస్థ విడుదల చేసిన ఆసియా ర్యాంకింగ్స్లో వర్సిటీ 600 ప్లస్ బ్యాండ్ను చేరుకుని రాష్ట్రంలో తన ప్రతిభను మరో సారి చాటిందన్నారు.

# తిరుమలకు హైఅలర్ట్‌లోనూ అన్యమత వాహనం



**తిరుమల,ఏప్రిల్ 24ప్రభాతవార్తప్రతినిధి:** జమ్మూకాశ్మీర్ పహల్గామ్‌లో ఉగ్రదాడితో తిరుమల,తిరుపతి క్షేత్రాలు హైఅలర్ట్‌గా ప్రకటించిన నేపద్యంలో నాలుగంచెల తనిఖీలు జరుగుతున్నా ఓ అన్యమత దేవుడి బొమ్మ, అన్యమతపేర్లు ఉన్న వాహనం ఏకంగా అలిపిరి తనిఖీ కేంద్రం దాటుకుని గురువారం సాయంత్రం తిరుమలకు వచ్చింది. తిరుమలలో కౌస్తుభం ప్రాంతంలో అన్యమత దేవుడి బొమ్మ,పేర్లు కర్నాటకకు చెందిన భక్తుల కారులోపల, పైన ఉన్నా అలిపిరిలో భద్రత సిబ్బంది గుర్తించలేని దుస్థితిగా మారింది. టోల్‌గేట్ దాటుకుని తిరుమలలో జిఎన్‌సి టోల్‌గేట్ దాటుకుని ముందుకు రావడంతో ఇప్పుడు భద్రతలోని డొల్లతనాన్ని ప్రస్ఫుటం చేసింది. అన్యమత గుర్తుతో ఉన్న కారు తిరుమలలో సాయంత్రం వరకు యధేచ్ఛగా తిరగడంతో కొందరు భక్తులు గమనించి విజిలెన్స్‌కు ఫిర్యాదు చేశారు. భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తిరుమల,తిరుపతిలో చిన్నపాటి లోపాలను గుర్తించలేకపోతే ఎవరైనా ప్రమాదవశాత్తు తెలియని ముఖాలతో, పేర్లు,వేషం మార్చుకుని కొండకు వస్తే పరిణామాలు ఏంటనే ఆందోళన వెలిబుస్తున్నారు. అలిపిరిలో ఆ సమయంలో తనిఖీ చేసిన సిబ్బందిని ఇంటికి పంపితే భయం ఉంటుందని, ఇలాంటివి పునరావృతం కావనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

# పుట్టపర్తిలో ఘనంగా బాబా ఆరాధన మహోత్సవం

**శ్రీ సత్య సాయి జిల్లా, ఏప్రిల్ 24, ప్రభాతవార్త ప్రతినిధి:** భగవాన్ సత్య సాయి బాబా 14వ ఆరాధన మహోత్సవం గురువారం పుట్టపర్తి హిల్ వ్యూ స్టేడియంలో ఘనంగా జరిగింది. తొలుత ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ సభ మండపంలో సంగీత కళాశాల అధ్యాపకులు సంప్రదాయ సంగీత కచేరిని నిర్వహించారు. అనంతరం ప్రేమ ప్రవాహిని అను సత్యసాయి రథాలను, పోస్టర్లను ట్రస్టు సభ్యులు ప్రారంభించారు. అనంతరం ట్రస్టు సభ్యులు ఎస్.ఎస్.నాగానంద్, నిమిష్ పాండేలు మాట్లాడుతూ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. హిల్ వ్యూ స్టేడియంలో జ్యోతి ప్రజ్వలన తరువాత వేలాదిమంది భక్తులకు అన్న ప్రసాదములతో పాటు మహిళలకు చీరలు పురుషులకు ధోతీలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యురాలు పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డితోపాటు ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ, శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. సత్య సాయి చూపిన సేవా మార్గంలోనే ట్రస్టు ఎప్పటికీ పనిచేస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ సెంట్రల్ ట్రస్ట్‌తో ప్రభుత్వం సమన్వయంతో పనిచేసుకొని పుట్టపర్తి అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ కె.చక్రవర్తి, ట్రస్టు సభ్యులు మనోహర్ శెట్టి, ఐ.ఎస్.ఎన్ ప్రసాద్, జిల్లా టిడిపి కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు. ఆరాధన మహోత్సవాలకు విచ్చేయు అశేష భక్తులకు పలువురు సేవా నిరతితో చిత్రావతి రోడ్డు, గోకులం, ప్రశాంతి గ్రామ్, కూడలలో అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు.

# అలిపిరిలోని సప్తగిరి తనిఖీకేంద్రంలో అడుగడుగునా భద్రతా లోపాలే!

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** జమ్మూకాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రదాడుల నేపథ్యంలో ప్రపంచప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుమల భద్రతపై కేంద్ర,రాష్ట్ర నిఘావర్గాలు దృష్టి పెట్టాయి. నిత్యం లక్షలాదిమంది యాత్రికులు దేశం నలుమూలల నుండి పలు రకాలుగా ఏడుకొండలకు చేరుకొంటున్నారు. ఇలా వస్తున్న వారిలో ఎవరు, ఏమిటనేది స్పష్టంగా కనిపెట్టే వ్యవస్థ తిరుమల తిరుపతి దేవస్థానం ఇప్పటికీ అలిపిరి తనిఖీ కేంద్రంలో ఏర్పాటుచేయలేకపోతోంది. యాత్రికులు వస్తున్న వారిపై నిశితంగా గమనించే ఈ అధునాతన "ఫేస్‌చెక్"ద్వారా గుర్తించే విధానం అందుబాటులోకి తీసుకురాలేకపోతున్నారు. ఫేస్‌రికగ్నేషన్ కెమెరా వ్యవస్థ ఉంటే నిందితులు, నేరస్థులు, తీవ్రవాదులు, ఉగ్రవాదులు,దోపిడీదొంగల్ని సులభంగా గుర్తించడానికి వీలుంటుంది. దేశంలోనేగాక ఇతర దేశాల్లోనూ ఏదేని ఊహించని హింసాత్మక సంఘటనలు జరిగినా, పర్యాటక,పుణ్యక్షేత్రాల్లో దాడులు చేసినా దాని ప్రభావం అందరి కళ్ళు ముందుగా తిరుమలక్షేత్రంపైనే పడుతుంది. అంతటి ప్రాధాన్యత ఉన్న హిందూ పుణ్యక్షేత్రంకు వస్తున్న భక్తుల రక్షణతో బాటు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల ఆలయ భద్రతను మరింతగా పటిష్టంచేస్తూ క్షణాల్లో భద్రత వ్యవస్థ అలర్ట్ అయ్యేలా చూడాల్సి ఉంటుంది. తిరుమలకు ప్రధాన ప్రవేశద్వారమైన తిరుపతి అలిపిరి సప్తగిరి తనిఖీకేంద్రానికి ముందు వచ్చే అలిపిరి గరుడ ఆర్చి ప్రవేశ ద్వారం, ఆ తరువాత దీనికి కొంత పక్కనే భక్తుల కాలినడక మార్గం ఉంది. ఇవన్నీ దాటుకుని వస్తే సప్తగిరి తనిఖీ కేంద్రం (అలిపిరి టోల్‌గేట్)లో 12 వరుసల ప్రవేశ మార్గాలు ఉన్నాయి.. ఈ మార్గాల్లో విఐపిలతోబాటు యాత్రికుల వాహనాలు తనిఖీ చేసుకుని కొండకు వచ్చేలా 8వరుసలు, రెండు వరుసలు ద్విచక్రవాహనాలకు, మూడువరుసలు ఆర్టీసి బస్సులకోసం నిర్వహిస్తున్నారు. ఇక్కడ



తెల్లవారుజామున 3గంటల నుండి అర్ధరాత్రి 12గంటల వరకు నిరంతరాయంగా వాహనాల తనిఖీలతో బాటు యాత్రికులను,లగేజీలను నిశితంగా తనిఖీ చేస్తుంటారు. ఇందుకోసం టిటిడి సెక్యూరిటీ సిబ్బందితోబాటు ఎస్‌పిఎఫ్,ప్రైవేటు సెక్యూరిటీ, విశ్రాంత సైనికోద్యోగులు మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తుంటారు. తనిఖీ కేంద్రం పూర్తిగా అలిపిరి ఏవిఎస్ఒ(సిఐ హోదాలో విజిలెన్స్ అధికారి) పర్యవేక్షణలో ఉంటుంది. యాత్రికులు తెచ్చే ప్లాస్టిక్ నీళ్లసీసాలు, తమలపాకులు, హాన్స్,ధూమపానం ప్యాకెట్లు లాగేయడం తప్ప ప్రమాదమైన వస్తువులు తెచ్చినా పట్టుకోవడం లేకపోతోంది. దేశవిదేశాల నుండి వచ్చే భక్తులు,యాత్రికులు తిరుమలకు చేరుకోవడానికి తిరుపతి అలిపిరి ప్రవేశద్వారం ప్రధానమైంది. ఇక్కడ సప్తగిరి తనిఖీ కేంద్రం మరో ముఖ్యమైన టోల్‌గేట్. టిటిడి భద్రతా సిబ్బంది ఇక్కడ వాహనాల తనిఖీ చేస్తుంటారు. అలిపిరి టోల్‌గేట్ దాటుకున్న తరువాతనే తిరుమలకు చేరుకోవడం సాధ్యమవుతుంది. టిటిడి సెక్యూరిటీ అధికారులు, సిబ్బంది, విజిలెన్స్,ఎస్‌పిఎఫ్ సిబ్బంది 300మంది వరకు మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తారు. అలిపిరి తనిఖీ కేంద్రంలో అడుగడుగునా భద్రతా లోపాలు కొట్టొచ్చినట్లు ప్రస్ఫుటమవుతున్నాయి. ఇటీవల ఏకంగా తిరుమలకు మద్యం బాటిళ్ళు తీసుకురావడం, ఏకంగా తిరుమల బాలాజీనగర్‌లో బెల్ట్‌షాపు తరహాలు మద్యం బాటిళ్ళు పట్టుబడటం, డ్రోన్‌కెమెరాలతో కొండకు చేరుకోవడం, అన్యమతానికి చెందిన దేవుళ్ళ బొమ్మలతో, జెండాలతో, పుస్తకాలతో తనిఖీ కేంద్రంలో తూతూమంత్రంగా తనిఖీలు చేసి పంపడం జరుగుతుంది. ఇంతటి పెద్దపెద్ద వస్తువులనే తనిఖీ సిబ్బంది కనిపెట్టలేని దుస్థితిలో ఉండటం ఆందోళనకరం.ఇవన్నీ అలిపిరి తనిఖీ కేంద్రంలో నిఘా వైఫల్యాలను కొట్టొచ్చినట్లు తేల్చింది. ఇదే సమయంలో ఏకంగా ఇన్‌ఛార్జి సివిఎస్ఒ హర్షవర్ధన్‌రాజు కూడా అలిపిరి తనిఖీ కేంద్రంలో రెండుగంటలు పాటు వాహనాల తనిఖీ, లగేజీ సామాగ్రి ఎలా తనిఖీ చేస్తున్నారనేది గమనించారు. ఎస్‌పిఎఫ్ సిబ్బంది నిర్దేశిత సమయంకంటే అదనంగా విధులు నిర్వహిస్తుండటంతో తనిఖీలపై పట్టులేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తిరుమలకు 90వేలమంది వరకు భక్తులు దేశం నలుమూలల నుండి రోజు చేరుకొంటుండగా అందులో 20వేలమంది వరకు యాత్రికులు తమతమ సొంత వాహనాల్లో వస్తున్నారు. మిగిలిన 40వేలమంది వరకు యాత్రికులు ఆర్టీసి బస్సులపై ఆధారపడుతున్నారు. ఇలా రోజుకు నాలుగువేల వరకు యాత్రికుల వాహనాలు,మరో 2వేల వరకు ద్విచక్రవాహనాలు (యాత్రికులు,స్థానికులు, టిటిడి ఉద్యోగులు)అలిపిరి తనిఖీ కేంద్రం మీదుగానే కొండకు చేరుకోవాల్సి ఉంటుంది. రద్దీ ఎక్కువైన సమయాల్లో అలిపిరిలో వావాహనాల తనిఖీతోబాటు లగేజీల తనిఖీలు ఏదో నామమాత్రంగా చేసి పంపుతున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. దీనివల్ల యాత్రికులు ఎవరు,ఎలాంటి వారు, వారి స్వభావం కనిపెట్టే పరికరాలు కూడా లేవు.

11 pg.qxd:25-4P7exHMNWJQE.qxd 01/01/01 11:01 AM Page 1



### భారత్ సమ్మిట్, మిస్‌వరల్డ్ పోటీల క్రమంలో పూర్తి భద్రత

# రాష్ట్రంలో హై అలర్ట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 24:** జమ్ము కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రదాడి జరిగిన తరుణంలో మరిన్ని దాడులు జరిగే అవకాశం ఉందని కేంద్ర నిఘా వర్గాల హెచ్చరికతో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇంటెలిజెన్స్ హెచ్చరికతో పోలీస్ శాఖ అలర్ట్ అయ్యింది. హైదరాబాద్‌లో ప్రతిష్ఠాత్మకమైన ఈవెంట్లు ఉన్న తరుణంలో సెక్యూరిటీని పూర్తి స్థాయిలో అప్రమత్తం చేసింది. శుక్రవారం, శనివారం (ఏప్రిల్ 25,26 తేదీల్లో) భారత్ సమ్మిట్, మే 7 నుంచి మిస్ వరల్డ్-2025 ఈవెంట్లు ఉండటంతో పోలీస్ వర్గాలు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేస్తున్నారు. భారత్ సమ్మిట్‌లో జాతీయ, అంతర్జాతీయ రాజకీయ, ఆర్థికపరమైన అంశాలపై చర్చ జరుగనుంది. ఈ సమ్మిట్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సహా వంద దేశాల నుంచి దాదాపు 400 మంది హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. అదే విధంగా మిస్ వరల్డ్ పోటీలకు 140 దేశాల నుంచి కంటెస్టెంట్స్ హాజరవుతారు. ఇవన్నీ అత్యంత ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలు కావడంతో పోలీస్ యంత్రాంగానికి సవాల్‌గా మారింది. ఈ కార్యక్రమాలకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ముందస్తు కార్యాచరణ రూపొందిస్తున్నారు. అందులో భాగంగా హెచ్‌ఐసీసీ, సైబరాబాద్ పరిసర ప్రాంతాల్లో పటిష్టమైన నిఘాను పోలీసులు ఏర్పాటు చేస్తున్నారు. కశ్మీర్ పహల్గామ్ ఉగ్రదాడి జరిగిన తరుణంలో దేశ వ్యాప్తంగా మరిన్ని ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందన్న కేంద్ర నిఘా వర్గాల హెచ్చరికలతో రాష్ట్ర పోలీసులు అప్రమత్తం అయ్యింది. దీంతో కౌంటర్ ఇంటెలిజెన్స్ సహా అన్ని విభాగాలు అప్రమత్తం అయ్యాయి. హైదరాబాద్ సహా దేశంలో ఉగ్రవాద ప్రభావిత రాష్ట్రాలు మరింత అప్రమత్తంగా ఉండాలని కేంద్రం హెచ్చరికలు జారీ చేసిన క్రమంలో ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేకంగా మానిటరింగ్ చేస్తోంది. ఈ క్రమంలో సిఎస్ శాంతికుమారి రాష్ట్ర పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. నిఘా సంస్థల హెచ్చరికలు జారీ చేసిన సందర్భంగా డిజిపి జితేందర్ రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులకు పలు అంశాలపై సూచనలు చేశారు. కౌంటర్ ఇంటెలిజెన్స్ ద్వారా వివరాలు సేకరిస్తున్నారు. అనుమానితులు,సమస్యాత్మక ప్రాంతాల్లో పటిష్టమైన నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ప్రాంతాలను గురువారం రాత్రి నుంచే తమ ఆధీనంలోకి తీసుకున్నారు. హైటెక్ సిటీ సహా విదేశీయులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో స్థానిక పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. పాతబస్తీ సహా అనుమానిత ప్రాంతాల్లో పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా పెట్టారు.

### పాతబస్తీలో అక్రమంగా నివాసముంటున్న

## స్లీపర్ సెల్స్‌ను ఏరేయాలి

### మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్

**హైదరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** తక్షణమే ముందు జాగ్రత్త చర్యగా పాతబస్తీలో అక్రమంగా నివాసముంటున్న స్లీపర్‌సెల్స్‌ను ఏరి పారేయాలని మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లా డారు. పహల్గామ్ ఉగ్రవాద సంఘటన దేశాన్ని కుదిపివేసిందని, పర్యాటకులపై పాశవిక పైశాచిక దాడితో మరిమరి ఎంపకుని కాల్పులు జరిపినట్లుగా ఆ దాడి స్పష్టంగా కనపడు తున్నా రు. యావత్ భారతదేశం అంతా ఈ సంఘటనను ఖండిస్తూ దని, వివిధ రకాల నిరసనలు తెలియ జేస్తూ, భారత్ మరింత కఠినంగా వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వా నికి అండగా నిలుస్తు న్నారని అన్నారు. ఈ తరుణంలో కేంద్ర ప్రభుత్వం ప్రాథమికంగా కొన్ని కఠిన నిర్ణయాలు ప్రకటించిందన్నారు. ఉగ్రవాదాన్ని ప్రేరేపించిన సంస్థలు, వ్యక్తులు, పొరుగున ఉన్న దేశాలు తప్పకుండా మూల్యం చెల్లించవలిసి వస్తుందని భారత ప్రజలు భావిస్తున్నారని అన్నారు. హైదరాబాద్ పాత నగరంలో ఇప్పటికే వీసా గడువులు తీరి ఇంకా నివాసం ఉంటున్న అక్రమ వలసదారులు, బంగ్లాదేశీయులు, పాకిస్తానీలు, టూరిస్ట్‌గా వచ్చినటువంటి వ్యక్తులు, వీసా గడువుదీరిన పౌరులు కూడా ఉంటున్నారని సమాచారం అన్నారు. పాతబస్తీలో ఈ రకంగా ఉంటున్నటువంటి వ్యక్తులను పోలీసు యంత్రాంగం తరిమివేయాలని బిజెపి డిమాండ్ చేస్తుందన్నారు. అందుకోసం పోలీసులకు స్వేచ్ఛ ఇవ్వాల్సి న అవసరం ఉందన్నారు. ఎంఐఎం, బిఆర్ఎస్ పార్టీతో కొంతకాలం దోస్తానా చేసింది. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్‌తో కలిసి నడుస్తోంది. దీంతో నిస్సహాయ స్థితిలో పోలీసులు ఉన్నట్లుగా చాలా సందర్భాల్లో కనపడుతుందన్నారు. హైదరాబాద్‌లో స్లీపర్ సెల్స్ ఉన్నారని అనేక సందర్భాల్లో ఎన్ఐఏ, ఐబి హెచ్చరికలు జారీచేశాయి. వారికి రకరకాలుగా మద్దతిస్తూ, వారి గొంతుకగా నిలబడుతున్నటువంటి లోక్‌సభ సభ్యుడి వ్యవహారాలు కూడా బయటకు వచ్చాయన్నారు. వారి రాజకీయ మైత్రి, అవకాశవాద మైత్రి ప్రజల ప్రాణాలను పణంగా పెట్టేలా ఉండొద్దన్నారు. మరోవైపు బిఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాల ఉత్సవాలు జరుపుకోవాలని తహతహలాడుతుందని, సమావేశాలు, సమీక్షలు, స్థల సందర్శనలు చేస్తూ ఏదో సాధించామన్నామట్లుగా ఆ ఉత్సవాలు జరుపుకోవాలని ఆలోచిస్తున్నారని అన్నారు. అసలు బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఏం సాధించిందని ఉత్సవాలు జరుపుకోవాలనుకుంటున్నారు? టిఆర్ఎస్‌ను బిఆర్ఎస్‌గా మార్చి ఫెయిల్యూర్ అని చూపించుకున్నారన్నారు. కోటి కుటుంబాల తెలంగాణ అని ప్రారంభించిన ఉద్యమంలో ఒకే కుటుంబం కొరకు ఉన్నామని వ్యవహరించి ఫెయిలైంది ఈ బిఆర్ఎస్ పార్టీ అన్నారు. అసలు బిఆర్ఎస్ పార్టీ ఎవరి కోసం ఉత్సవాలు జరుపుకోవాలనుకుంటుందని ప్రశ్నించారు. ప్రతి కుంభకోణంలో బిఆర్ఎస్ పాత్రే ఉన్నదని, విచారణ ఎదుర్కొంటుందన్నారు. టిఆర్ఎస్‌ను బిఆర్ఎస్‌గా మార్చారు.


గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్

## నేడు ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశ పరీక్ష

### -హాజరు కానున్న 73,993మంది అభ్యర్థులు

**గుంటూరు విద్య,ఏప్రిల్ 24,ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రెసిడెని ్షయల్ పాఠశాలల్లో జూనియర్ కళాశాలల్లో,డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి నిర్ధేశించిన ఏపిఆర్‌జెసి డిసి సెట్ 2025 శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాల్లో జరగనుంది.ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాసంస్థ అధికారులు సమగ్ర ఏర్పాట్లు పూరి ్తచేశారు.5వ తరగతిలోకి ప్రవేశానికి 3920ఖాళీలకు గాను,16,284మంది 112 సెంటర్ల ద్వారా ప్రవేశ పరీక్ష రాయనున్నారు.6నుంచి 8వ తరగతిలో 1625 మిగిలిఉన్న ఖాళీల్లో సీట్ల కొరకు 8635 మంది పోటీ పడనున్నారు.వీరికి శుక్రవారం ఆయా పరీక్షా కేంద్రాల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12వరకు పరీక్ష జరగనుంది.ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి 1425సీట్లకు గాను 47820 మంది ప్రవేశ పరీక్ష రాయనున్నారు.212పరీక్షా కేంద్రాల ద్వారా హాజరుకానున్నారు.గురుకుల డిగ్రీ కళాశాల నాగార్జున సాగర్‌లో ప్రవేశానికి 220సీట్లకు గాను 1272మంది పరీక్షకు హాజరుకానున్నారు.వీరికి ఆయా కేంద్రాల్లో మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రవేశ పరీక్ష జరగనుంది.మొత్తం 73993మంది రాష్ట్రవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు సంబంధించి ప్రవేశ పరీక్షలకు హాజరుకానున్నారు.అభ్యరు ్థలు ఆయా నిబంధనలు తప్పక పాటించాలని అధికారులు కోరారు.

## బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయ ప్రధానఅర్చకుని సస్పెన్షన్

**అలంపూర్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మను దేవాదాయశాఖ అధికారులు సస్పెండ్ చేసినట్లు ఆలయ ఇఒ పురేందర్‌కుమార్ తెలిపారు. అయనపై వచ్చిన ఆరోపణలపై దేవాదాయ శాఖ అధికారులు విచారణ చేసిన తరువాత అతనిపై సస్పెండ్ వేటు వేసారన్నారు. అలాగే ప్రధాన అర్చకుని దగ్గర ఉన్న ఆభరణాలు, వస్తు వులు ఆలయానికి అప్పచెప్పాలని ఇఒ అన్నారు.

## వ్యవసాయ, ఉద్యాన, పశు వర్సిటీల్లో ఖాళీల భర్తీ

### 718 పోస్టుల వివరాలు సమర్పించాలి : సర్కార్

**హైదరాబాద్, ఏప్రిల్ 24,ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వ్యవసాయ, ఉద్యాన పశు వైద్య విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను సమర్పించాలని రాష్ట్ర సర్కార్ సంబంధిత అధికారులను ఆదేశించింది. ఈ మూడు విశ్వవిద్యాలయాల్లోని ఆచార్యులు, సహయ ఆచార్యుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు సంబంధిత విశ్వ విద్యాలయాల నుండి ఖాళీలు, ప్రస్తుతం అనుసరిస్తున్న నియామక విధానాలు, ఇతరత్రా అంశాలపై సమచారం అడిగింది. ఈ మూడింటిల్లో మొత్తం 718 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారులు నివేదికను సిద్ధం చేశారు. వ్యవసాయ విశ్వ విద్యాలయంలో 20 ఆచార్యులు, 50 సహ ఆచార్యులు, 380 సహాయ ఆచార్యులతో మొత్తంగా 450 ఖాళీలు, ఉద్యాన విశ్వవిద్యాలయంలో 17 ఆచార్యులు, 42 సహ ఆచార్యులు, 66 సహాయ ఆచార్యులతో మొత్తంగా 125 పోస్టులు, పశు వైద్య విశ్వ విద్యాలయంలో 21 ఆచార్యులు, 62 సహ ఆచార్యులు, 60 సహాయ ఆచార్యులు కలిపి మొత్తం 143 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాగా వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాల పరిధిలో ఎనిమిదేళ్ల క్రితం చివరి దఫా నియామకాలు జరిగాయి. పశు వైద్య యూనివర్సిటీలో 2022లో నియామకాల ప్రక్రియ చేపట్టి రెండు నెలల క్రితం భర్తీ చేశారు. ఈ లోపు మళ్లీ ఖాళీల సంఖ్య భారీగా పెరిగింది. మరోవైపు వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలో ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి నల్లగొండతో పాటు, కొడంగల్‌లో మూడు కొత్త కళాశాలలు, పశు వైద్య విశ్వవిద్యాలయ పరిధిలో కొడంగల్‌లో ఓ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో ఖాళీల భర్తీ, కొత్త నియామకాలు అవసరమని, ఆయా విశ్వవిద్యాలయాల పాలకవర్గాలు గుర్తించాయి. ఖాళీల వల్ల కలుగుతున్న ఇబ్బందులను వైసన చాన్సలర్లు ఇటీవలే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలియవచ్చింది. దీంతో ప్రభుత్వం ఈ వ్యవసాయ, దాని అనుబంధ రంగాల విశ్వవిద్యాలయాల్లో ఖాళీల వివరాలను సేకరిస్తోంది. కాగా ఈ వ్యవసాయ, అనుబంధ విశ్వ విద్యాలయాల్లో సహాయ ఆచార్యుల పోస్టులను ప్రత్యక్ష నియామక విధానం ద్వారా భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంతేకాకుండా అందుకు అనుగుణంగా మార్గదర్శకాలను కూడా విడుదల చేసింది. వ్యవసాయ, ఉద్యాన, పశు వైద్య విద్యాలయాల్లో పోస్టుల భర్తీకి ఇప్పటి వరకూ ఇవే మార్గదర్శకాలు అమలవుతున్నాయి. తాజా ఉత్తర్వుల్లో వీటి ప్రస్తావన లేదు. దీంతో పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టిన తర్వాత అవే మార్గదర్శకాలను పాటించాలని ప్రభుత్వం ఆదేశిస్తే పాలకమండళ్లు అమలు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వని పక్షంలో వ్యవసాయ, ఉద్యాన, పశు వైద్య విశ్వ విద్యాలయాలు అవే మార్గదర్శకాలను తాము అడాప్ట్ చేస్తామని తీర్మానం చేయాల్సి ఉంటుంది. ప్రత్యేక విధానం అమలు చేయాలనుకుంటే అందుకు ప్రభుత్వం నుండి అనుమతి తీసుకోవాలని అధికారవర్గాలు వెల్లడించాయి. కాగా ఈ మూడు విశ్వ విద్యాలయాల పరిధిలో ప్రస్తుతం వేయి మందికి పైగా పీహెచ్‌డీ అభ్యర్థులు పోస్టుల కోసం ఎదురు చూస్తున్నారు.

## ఎప్‌సెట్‌కు 3,06,796 దరఖాస్తులు

### అపరాధ రుసుంతో ముగిసిన గడువు

**హైదరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్ సెట్-2025కి దరఖాస్తు గడువు గురువారం(ఏప్రిల్ 24)తో ముగిసింది. అపరాధ రుసుం రూ. 500తో దరఖాస్తు చేయడానికి గడువు ముగిసింది. గురువారం సాయంత్రం వరకు 3,06,796 మంది ఎప్ సెట్‌కి దరఖాస్తు చేశారు. వారిలో ఇంజనీరింగ్‌కి 2,20,049 దరఖాస్తులు రాగా.. అగ్రికల్చర్, ఫార్మసీకి 86,493 దరఖాస్తులు వచ్చాయి. రెండింటికి 254 దరఖాస్తులు వచ్చినట్టు ఎప్ సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ డీన్ కుమార్, కో కన్వీనర్, జేఎన్‌టియూ రెక్టార్ ప్రొఫెసర్ విజయ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఎప్ సెట్-2025 నిర్వహణకి సంబందించి అన్ని ఏర్పాట్లు చేసినట్టు వారు తెలిపారు. ఈ నెల 29, 30 తేదిల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలను.. మే 2 నుంచి 4 వరకు ఇంజనీరింగ్ పరీక్షలను నిర్వహించనున్నట్టు తెలిపారు. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలకు 112 కేంద్రాలను ఏర్పాటు చేయగా.. ఇంజనీరింగ్ పరీక్షలకు 124 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలను రెండు సెషన్‌లలో నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు .. తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈసారి మొదటిసారిగా విద్యార్థులకు జారీ చేసిన హాల్ టికెట్లపై క్విక్ రెస్పాన్స్(క్యూఆర్) కోడ్‌ను ముద్రించారు. క్యూఆర్ కోడ్ మూలంగా విద్యార్థులు తమ పరీక్షా కేంద్రాలను తెలుసుకోవడం సులభతరం అవుతుందని తెలిపారు. విద్యార్థులు చేయాల్సిందల్లా హాల్ టిక్కెట్లపై ముద్రించిన క్యూఆర్ కోడ్‌ను స్మార్ట్‌ఫోన్‌తో స్కాన్ చేయడం. స్కాన్ చేసిన తర్వాత గూగుల్ మ్యాప్స్ అప్లికేషన్‌లో ఒక లింక్ తెరుచుకుంటుంది, ఇది విద్యార్థులు తమ పరీక్షా కేంద్రాలకు వారి రూట్ మ్యాప్‌ను వీక్షించడానికి వీలు కల్పిస్తుంది. దాంతోపాటు ట్రాఫిక్‌ను పరిగణనలోకి తీసుకుని వారి కేంద్రం ఎంత దూరంలో ఉంది.. అక్కడికి చేరుకోవడానికి ఎంత సమయం పడుతుందో కూడా విద్యార్థులు నిర్ధారించుకోవడానికి అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.

## గ్రామీణ బ్యాంకుల్లో దినసరి ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

### హైకోర్టు తీర్పు

**హైదరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రోజు వారీ (డైలీ పేమెంట్) వేతనం పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉపశమనం కలిగిస్తూ హైకోర్టు తీర్పు నిచ్చింది. ప్రస్తుతం పనిచేస్తున్నవారి సర్వీసు వ్యవధిని బట్టి వెయిటేజీ ఇచ్చి, ఆరు నెలల్లో క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేయాలని ధర్మాసనం ఆదేశించింది. సుదీర్ఘకాలం నుంచి తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్న తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరిం చాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకును ఆదేశిం చాలంటూ 456 మంది తాత్కాలిక ఉద్యోగులు గతంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గ్రామీణ బ్యాంకు కేంద్ర, రీజనల్ కార్యాల యాలతోపాటు 400 శాఖల్లో 20 ఏళ్లుగా రోజువారీ వేతన విధానంలో పనిచేస్తున్నామని.. సర్వీస్ బెనిఫిట్స్ ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశంతో తమను క్రమబద్ధీకరించడం లేదని పిటిషనర్లు కోర్టుకు విన్నవించారు. ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకు తాత్కాలిక ఉద్యోగులను క్రమ బద్ధీకరించాలని హైకోర్టు తీర్పు ఉందని వివరించారు. దీనిపై జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా గ్రామీణ బ్యాంకు తరఫు న్యాయవాది వాదినలు వినిపిస్తూ పిటిషనర్లు ఔట్‌సోర్సింగ్ కార్మికులని, వారికి బ్యాంకుతో ఉద్యోగయాజమాన్య సంబంధం లేదని వివరించారు. కానీ ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకు కేసులో ఇలాంటి వాదనలు నిలబలేదని, సుప్రీంకోర్టు కూడా క్రమబద్ధీకరణను సమర్థించిందని ధర్మాసనం గుర్తు చేసింది. ఈమేరకు దీనిపై విచారించిన ధర్మాసనం గ్రామీణ బ్యాంకుల్లో డైలీ వేజెస్‌పై పనిచేస్తున్న 456 మంది ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ధర్మాసనం ఆదేశించింది. అలాగే గ్రామీణ బ్యాంకుల్లో పనిచేస్తున్న మెసెంజర్లు, స్వీపర్లు, ఇతర సాధారణ కార్మికులను వారి అర్హతలను బట్టి శాశ్వత ఉద్యోగులుగా ఆఫీసు అటెంటెండ్స్ పోస్టుల్లోకి తీసుకోవాలని సూచించింది. అయితే ఇప్పటికే సర్వీసును వదిలేసిన వారికి, చనిపోయిన వారికి ఈ ఆదేశాలు వర్తించవని స్పష్టం చేసింది.

# రేణికుంట వద్ద లారీ, ఆటో ఢీ

### ఆటో డ్రైవర్, మహిళ మృతి.. మరో ఐదుగురికి గాయాలు



**తిమ్మాపూర్, ప్రభాతవార్త:** తిమ్మాపూర్ మండలం రేణికుంట పరిధిలోని రాజీవ్ రహదారిపై గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లారీ, ఆటో ఢీకొని ఇద్దరు మృతి చెందగా, ఐదుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. రేణిగుంట శివారులోని ఆర్కే ఇండస్ట్రీస్ రైస్ మిల్ నుండి లోడుతో గిళీ 02 గిదీ 8729 నంబర్ గల లారీ రాజీవ్ రహదారి పైకి రావడంతో బెజ్జంకి నుండి కరీంనగర్ వైపు వెళ్తున్న గిళీ 02 గిని 0940 నంబర్ గల ఆటో డీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ కాసర్ల తిరుపతి(58) అక్కడికక్కడే మృతిచెందగా ఆసుపత్రిలో చికిత్స పొందుతు బెజ్జంకి క్రాసింగ్ కి బీరెడ్డి నక్షత్రమ్మ(57) మృతి చెందినది. ఆటోలో ప్రయాణిస్తున్న సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మాచాపూర్ కి చెందిన పొన్నం సాయి కిరణ్, బెజ్జంకి కి చెందిన ఆయిలీనేని నవీన్ రెడ్డి, దాచారం కి చెందిన కలి పాక మంజుల, బెజ్జంకి క్రాసింగ్ కు చెందిన బీరెడ్డి ఆనంద రెడ్డి, ఆటో డ్రైవర్ భార్య కాసర్ల కరుణ, కూతురు కరీంనగర్ కి చెందిన మడుపు మోనిక లకు గాయాలు అయ్యా యి. నలుగురు మహి ళలు ఇద్దరు పురుషులకు గాయాలయ్యాయి గాయపడిన క్షతగాత్రులను ఆంబులెన్స్ లలో కరీంనగర్ లోని ఆసుపత్రికి తరలించారు. మృతురాలు నక్షత్రం కూతురు శౌరీలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎం డిఎస్పి వివేక్ తెలిపారు. కాగా సంఘటన స్థలాన్ని కరీంనగర్ రూరల్ ఏసిపి శుభం ప్రకాష్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**హెచ్కేఆర్ అంబులెన్స్ ఆలస్యం...**

రేణికుంట టోల్ ప్లాజాకు రెండు కిలోమీటర్ల దూరంలో ప్రమాదం జరిగిన హెచ్ కె ఆర్ కి చెందిన అంబులెన్స్ ఆలస్యంగా రావడం పై వాహనదారులు మండి పడుతున్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు ప్రాణాలతో కొట్టుమిట్టాడుతుంటే రాజీవ్ రహదారికి చెందిన అంబులెన్స్ వారు నిరక్ష ్యంగా వ్యవహరిస్తూ ఆలస్యంగా రావడంతో ప్రాణాలకే ముప్పు వచ్చిందని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు రాజీవ్ రహదారి పైన హెచ్ కె ఆర్ అంబులెన్స్ను తక్షణమే స్పందించేలా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

**హెచ్కేఆర్ సిబ్బందికి ఎసిపి హెచ్చరిక**

రేణికుంట వద్ద ఉన్న టోల్ ప్లాజా సిబ్బందికి కరీంనగర్ రూరల్ ఏసిపి శుభం ప్రకాష్ వార్నింగ్ ఇచ్చారు. రేణికుంట వద్ద జరిగిన రోడ్డు ప్రమాద సంఘటన స్థలానికి ఏసిపి వచ్చి పరిశీలించారు. అక్కడే ఉన్న టోల్ ప్లాజా సిబ్బందితో ఆయన మాట్లాడారు. ప్రమాదాలు జరిగే స్థలాలను ఇప్పటికే గుర్తించి హెచ్కెఆర్ కి సూచనలు చేయడం జరిగిందని,.అయినా స్పందించక పోవడంపై ఆయన సిబ్బందికి వార్నింగ్ ఇచ్చారు. ప్రమాదాలు జరిగితే హెచ్కెఆర్ వారినే బాధ్యు లను చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. రాత్రి వేళల్లో డివైడర్ల వద్ద లైటింగ్ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వెంటనే లైట్లు ఏర్పాటు చేయాలని ఎల్ఎండి పోలీస్ స్టేషన్ నుండి హెచ్ కె ఆర్ యాజమాన్యానికి లెటర్ రాయడం జరిగిందని, ఇప్పటివరకు స్పందించ లేదని ఆయన అన్నారు. సమ యజమానుయానికి చెబుతామని హెచ్ కె ఆర్ సిబ్బంది తెలిపారు.

## పారదర్శకంగా సంక్షేమ గురుకులాల్లో సీట్లు కేటాయింపు

### ఎస్సీ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి వర్షిణి

**హైదరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** ఎస్సీ, ఎస్టీ, బిసి సంక్షేమ శాఖలకు చెందిన గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికిగాను సీట్ల కేటాయింపు పారదర్శకంగా జరుగుతుందని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిణి స్పష్టం చేశారు. మెరిట్ ప్రకారం సీట్లు కేటాయిస్తామని వెల్లడించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో విడుదల చేసిన ఒక ప్రకటనలో రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకొని సీట్లు కేటాయిస్తున్నామని తెలిపారు. గురుకులాల్లో ఇప్పటికే ఫేజ్1 సీట్ల కేటాయింపు జరగగా, త్వరలో ఫేజ్ 2లో సీట్లను భర్తీ చేస్తామని చెప్పారు. ఒక జిల్లాలో నిర్ధిష్ట కేటగిరీలో సీట్లు కేటాయించటానికి సరిపడా విద్యార్థులు లేకపోయినట్లయితే పక్క జిల్లా విద్యార్థులకు సీట్లు కేటాయించామని సెక్రటరీ పేర్కొన్నారు. ఇక తెలంగాణ వ్యాప్తంగా అన్ని గురుకులాల్లో పెద్ద ఎత్తున సీట్లు ఉన్నాయన్నారు. ఈ సీట్ల కేటాయింపు విషయంలో ఏ విద్యార్థికి అన్యాయం జరగదని తేల్చిచెప్పారు. గురుకుల సీట్ల కేటాయింపులో విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని, సొంత జిల్లాలో కాకుండా ఇతర జిల్లాల్లో సీట్లు కేటాయిస్తున్నట్లు వస్తున్న వార్తలను, సోషల్ మీడియా ప్రచారాలను స్టూడెంట్స్, తల్లిదండ్రులు నమ్మొద్దని సూచించారు. సీట్ల కేటాయింపు తర్వాత దివ్యాంగులు, ఆర్ఫాన్స్, ఫిషర్మెన్, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్, ఏజెన్సీ, ఎంబీసీ కేటగిరీల విద్యార్థులకు 4 వేల సీట్లు కేటాయించామని వివరించారు. ఈ సీట్లు భర్తీ కాకపోతే మెరిట్ ఉన్న అభ్యర్థులకు సొంత జిల్లాలో కేటాయిస్తామని వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో మైనారిటీలకు కేటాయించే సీట్లు కూడా ఖాళీగా ఉంటే అందులో కూడా అవకాశం ఇస్తామని చెప్పారు.

## చలమయ్య కళాశాల్లో జాబ్‌మేళాకు అపూర్వ స్పందన

**గుంటూరు విద్య,ఏప్రిల్ 24,ప్రభాతవార్త :** స్థానిక సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల,మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్‌వారి సంయుక్తాధ్వర్యంలో గురువారం మెగాజాబ్‌మేళా నిర్వహించారు.ఈ జాబ్ మేళాలో 300మంది నిరుద్యోగుల రిజిస్ట్రేషన్ చేయించుకొని పాల్గొన్నారు.ఈ జాబ్ మేళా ప్రారంభ కార్యక్రమానికి కళాశాల సెక్రటరీ కర్పూరపు సూర్యనారాయణ అధ్యక్షత వహించగా,బాపూజి కమిటీ విద్యాసంస్థల కార్యదర్శి కర్పూరపు రామకృష్ణ ప్రభు ముఖ్యఅతిధిగా విచ్చేశారు.కళాశాల సెక్రటరీ కర్పూరపు సూర్యనారయణ మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యతో విలవిల్లాడుతున్న నేటి పరిస్థితుల్లో 16జాతీయ,బహుళ జాతి సంస్థలు పాల్గొని తమ కంపెనీల్లో ఉపాధి కల్పించేందుకు తీసుకున్న నిర్ణయం ఎంతో హర్షణీయమన్నారు. ఉన్నతస్థాయి కంపెనీల్లో ఉద్యోగాలు పొందడం అదృష్టం అని అన్నారు.కళాశాల ప్రెసిడెంట్ పచి ్చపులుసు రాఘవరావు మాట్లాడుతూ ఇలాంటి జాబ్ మేళాలు తరచుగా నిర్వహించడం ద్వారా నిరుద్యోగులకు ఎంతో ఆశాజనకంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో చలమయ్య కళాశాల అధ్యాపకులు,మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సిబ్బంది రిజిస్ట్రేషన్ కార్యక్రమ ంలో సహాయ సహకారాలను అందించారు.

## సీతమ్మసాగర్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్‌కు సాంకేతిక సలహా కమిటీ అంగీకారం


**హైదరాబాద్, ఏప్రిల్ 24,ప్రభాతవార్త:** సీతమ్మసాగర్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు సాంకేతిక సలహాకమిటి అంగీకారం తెలిపింది. గురువారం కేంద్రజలశక్తి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని టిఎసి ఛైర్మన్ దేబశ్రీ ముఖర్జీ,కేంద్రజలసంఘం ఛైర్మన్ ముకేష్ కె సిన్హా ఆధ్వర్యంలో మధ్యాహ్నం జరిగిన సమావేశంకు తెలంగాణ నీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జ, ఇఎన్‌సి జి అనిల్‌కుమార్, కొత్తగూడెం ఎస్ఇ శ్రీనివాసరెడ్డి గోదావరి బేసిన్ డిడి సుబ్రమణ్య ప్రసాద్‌లు హాజరైనారు.సీతమ్మసాగర్ ఎస్ఆర్ఎల్ఐ 67.05 టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించడానికి 2023 జూన్‌లో ప్రతి పాదనలు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాలకు సాగునీరు తాగునీరు అందిచడానికి ఈ ప్రాజెక్టు ఉపయోగ పడుతోంది. రూ. 19955 కోట్లు అంచనా వ్యయంగా నిర్ధారించారు. 2026వరకు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకొన్నారు. బ్యారేజీ పొడవు 1332.75మీటర్లు ఉంటుంది.

# భూభారతి చట్టంతో రైతు సమస్యలకు చెక్

### చట్టంపై అవగాహన సదస్సులో రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

### పాల్గొన్న ఆర్డీఓ చంద్రకళ, ఎమ్మార్వో గౌతమ్‌కుమార్

**మొయినాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం, ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి 2025 నూతన ఆర్.ఓ.ఆర్ చట్టం భూ.వివాదాల పరిష్కారానికి ఎంతగానో దోహదపడుతుందని ఈ ట్టం వందకు వంద శాతం రైతులకు మేలు కోరే విధంగా ప్రభుత్వం తీసుకొచ్చిందని, రైతుల భూసమస్యలకు చెక్ పెడు తుందని, జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి అన్నారు, రంగా రెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గంలోని మొయి నాబాద్ మున్సిపాలిటిలో భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు, ఈ కార్యాక్రమానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి హాజ రయ్యారు, భూభారతి చట్టంపై, అందులోని అంశాలపై వివరిస్తూ రైతులకు అవగాహన కల్పించారు, ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి భూ వివాదాలకు తావులేకుండా రైతులకు సంబంధించిన భూములపై వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పిం చేందుకు ప్రభుత్వం అనేక కొత్త అంశాలను పొందు పరుస్తూ ఈ నూతన ఆర్.ఓ.ఆర్ చట్టాన్ని తెచ్చిం దన్నారు, ప్రధానంగా భూభారతిలోని కీలక అంశాలపై మాట్లాడుతూ ధరణి స్దానంలో కొత్త భేమి హక్కుల రికార్డు భూభారతి వచ్చిందని, హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం ఇస్తూ రిజిస్ట్రేషన్ చేయడానికి ముందు భూముల సర్వేమ్యాప్ తయారీ విధానం భూభారతి చట్టంలో అందుబాటులోకి తెచ్చార న్నారు, మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి ఎవరైనా ప్రభుత్వ భూదన్ అసైన్డ్ ఎండోమెంట్ వక్స్ భూములకు పట్టాలు పోందితో రద్దు చేసే అధికారం అధికారులకు అందిదన్నారు, భూ భారతి 2025 చట్టంలో 23 సెక్షన్లు, 18 నిబంధనలు ఉన్నాయని, తెలిపారు, ప్రభుత్వం ఆధార్ తరహాలో భవిష్యత్తులో భేమికి సంబంధించిన సర్వే చేసి కొలతలు హద్దుల వంటి సమగ్రమైన వివరాలతో భూధార్ తీసుకురాబోతుందని పేర్కొన్నారు, ఈ చట్టం ద్వారా భేముల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించబడినదని భూమి రిజిస్ట్రేషన్, మూట్యేషన్‌కు ముందు, తప్పనిసరిగా భూమి సర్వే జరిపించి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందని, పేర్కొన్నారు, మ్యుటేషన్ షీస్ క్రింద ఎకరాకు 2500 రూపాయలు ఉంటుందన్నారు, ప్రస్తుతం పెండిగ్‌లో ఉన్న సాదా బైనామాల పరిష్కారం ఈ చట్టం ద్వారా వ్యవస్ద మరింత నిబద్దతతో పనిచేస్తుందని కలెక్టర్ తెలిపారు, భూ సమ్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పిల్ వ్యవస్ద రైతులకు న్యాయబద్ధమైన మార్గం కల్పిస్తుందని తెలిపారు, ఇంటి స్దలాలు ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డులతో వ్యవస్దను సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు భవిష్యత్తులో పేద రైతులకు ఉచిత న్యాయ సహయం అందించే దిశగా చర్యలు తీసుకుంటుంన్నామని తెలిపారు, గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణను శాస్త్రీయంగా చేస్తునే మొసపూరితంగా పోందిన ప్రభుత్వ భూములపై పట్టాలను రద్దుచేసే అధికారం ఈ చట్టం ద్దారా కల్పించబడిందని భూ భారతి రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారంగా నిలుస్తోందని పేర్కొన్నారు, గ్రామాల్లో మండల వ్యవసాయాధికారుల సహకారంతో రైతు వేదికల వద్ద రెవెన్యూ సదస్సులు నిర్వహించి ఈ చట్టం పై అవగాహన కార్యాక్రమాలు చేపడతామని భూ సమస్యల పరిష్కారానికి ఎంతో వెసులుబాటు కల్పించే భూభారతి చట్టం పై అవగాహనను ఏర్పర్చుకోవాలని రేనిని పూర్తి స్దాయిలో సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకోచ్చిన భూ భారతి చట్టం భూ వివాధాల పరిష్కారానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు, ఎదైనా ప్రభుత్వం కొత్త చట్టం తెచ్చినప్పుడు పూర్తిగా క్షేత్రస్దాయిలో తెలుసుకోవాలని రైతులకు సూచించారు. ఆర్డీవో చంద్రకళ మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకోచ్చిన భూ భారతి చట్టం 2025 ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పవర్ ప్రాజెక్టను స్క్రీన్ పై రైతులకు పూర్తిగా అవగాహన కల్పిస్తు, పవర్ ప్రసెంటేషన్ చేశారు, ఈ కార్యాక్రమంలో తహసిల్దార్ గౌతమ్ కుమార్, జిల్లా గ్రంధాలయ ఛైర్మెన్ మధుసుదన్ రెడ్డి, టిపిసిసి రాష్ట్ర నాయకులు శాబాద్ దర్శన్, రైతు సహకారం సంఘం ఛైర్మెన్ మంధాడి చెంద్రారెడ్డి, ఎంపీడీవో సంధ, మాజి ఎంపీటిసి రాంరెడ్డి, అగ్రికల్చర్ ఆఫీసర్ అనురాధ, ఎంపీవో వెంకటేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మొయినాబాద్ మండల రైతులకు భూభారతి చట్టం-2025పై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూన్న జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, ఆర్డీవో, చంద్రకళ, ఎమ్మార్వో గౌతమ్ కుమార్.

ఆట

# సహజ ఓటమి



న్యూఢిల్లీ: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల డబ్ల్యూ100 చార్లోట్స్‌విల్లె ఓపెన్ టోర్నీలో తెలంగణ క్రీడాకారిణి యామలపల్లి సహజ మెయిన్ డ్రా కు అర్హత సాధించడంలో విఫలమైంది. అమెరికాలోని వర్జీనియా రాష్ట్రంలోని చార్లట్స్‌విల్లె నగరంలో జరుగుతున్న ఈ టోర్నమెంట్‌లో సహజ టోమి చెందింది. ప్రపంచ ర్యాకింగ్స్‌లో 320వ స్థానంలో ఉన్న సహజ క్వాలిఫయింగ్ తొలి రౌండ్ మ్యాచ్‌లో 6-0, 6-1తో బ్రెజిల్‌కు చెందిన మరియా కరోలినా ఫెరీరా టర్బెటోపై విజయం సాధించింది. అయితే క్వాలిఫయింగ్ ఫైనల్ రౌండ్ మ్యాచ్‌లో సహజ 4-6, 1-6తో ప్రపంచ 556వ ర్యాంకర్, రష్యాకు చెందిన మరియా కొజిరివా చేతిలో ఓటమిపాలైంది. 93 నిముషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ 4 డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను ఏడు సార్లు కోల్పోయిన ఆమె ప్రత్యర్థి సర్వీస్‌ను మూడు సార్లు బ్రేక్ చేసింది. సహజ ఫస్ట్ సర్వ్‌లో 17 పాయింట్లు, సెకండ్ సర్వ్‌లో 11 పాయింట్లు సాధించింది. కాగా పుణేలో ఈ నెల తొలి వారంలో జరిగిన బిల్లీ జీన్ కింగ్ కప్ ఆసియా ఓసియానియా గ్రూప్-1 టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాక సహజ ఆడిన తొలి టోర్నమెంట్ ఇదే కావడం గమనార్హం.

మహిళల ముక్కోణపు వన్డే..

# భారత్‌తో శ్రీలంక ఢీ

## ఆతిధ్య జట్టులో భారీ మార్పులు



**న్యూఢిల్లీ:** స్వదేశంలో టీమిండియాతో జరగనున్న మహిళల ముక్కోణపు వన్డే టోర్నమెంట్ కోసం శ్రీలంక జట్టు భారీ మార్పులు చేసింది. ఈ టోర్నీలో శ్రీలంకతో పాటు, భారత్, దక్షిణాఫ్రికా జట్టు పాల్గొంటున్నాయి. ఈ నెల 27 నుండి ప్రారంభం కానున్న ఈ ముక్కోణపు టోర్నీ కోసం శ్రీలంక జట్టు 8 మార్పులు చేసి 17 మందితో కూడిన జట్టునున ప్రకటించింది. గత నెలలో న్యూజిలాండ్ చేతిలో శ్రీలంక మహిళల క్రికెట్ జట్టు 0-2తో సిరీస్ కోల్పోవడంతో జట్టును ప్రక్షాళన చేసింది. సీనియర్ బ్యాటర్ చమరి ఆటపట్టు లంక జట్టుకు సారథ్యం వహిస్తుండగా, న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో ఆకట్టుకున్న మీడియం పేసర్ మల్లీక మదారాకు తొలిసారి వన్డే జట్టులో చోటు దక్కింది. ఈ టోర్నమెంట్‌లో ఒక్కో జట్టు మిగిలిన రెండు జట్లతో రెండేసి సార్లు తలపడనుంది. మ్యాచ్‌లన్నీ ప్రేమదాస స్టేడియంలోనే జరగనున్నాయి. వచ్చే నెల 11న ఫైనల్ జరుగుతుంది. తొలి మ్యాచ్‌లో ఆతిధ్య శ్రీలంకతో భారత్ అమ్మాయిల జట్టు అమీతుమీ తేల్చుకోనుంది. ఇక శ్రీలంక జట్టులో చమరి ఆటపట్టు (కెప్టెన్), హర్షిత సమరవిక్రమ, విష్మి గుణరత్నే, నీలాక్షిక సిల్వ, కవిషా దిల్హారి, అనుష్క సంజీవని, మనుడి ననయక్కర, హాసిని పెరెరా, ఆచిని కులసూర్య, పియూమి బడాల్గే, దేవ్‌మి విహాంగ, హన్సిమ కరుణరత్నె, మల్కీ మదారా, ఇనోషి ప్రియదర్శిని, సుగంధిక కుమారి, రష్మిక, ఇనోక రణవీర ఉన్నారు.



నేషనల్ ఫెడరేషన్ సీనియర్ అథ్లెటిక్స్‌లో..

# విధ్యా, మీనా, నీహారిక, దమ్నీ సింగ్‌కు స్వర్ణాలు

## గౌతమ్, రీగన్‌కు రజతం, కాంస్యం



**న్యూఢిల్లీ:** కొచ్చిలో జరిగిన నేషనల్ ఫెడరేషన్ సీనియర్ అథ్లెటిక్స్ పోటీలో మహిళల విభాగంలో 400 మీటర్ల హర్డిల్స్‌లో ఒలింపియన్ విధ్య రామ్‌రాజ్ 56.04 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని స్వర్ణం గెలుచుకుంది. అంతేకాకుండా 2025 ఆసియా ఛాంపియన్‌షిప్‌కు అర్హత సైతం సాధించింది. ఆమె సమయం సరితాబెన్ గయాక్వాడ్ 2019 మార్కు 57.21 సెకన్లను అధిగమించి కొత్త మీట్ రికార్డును కూడా సృష్టించింది. అను ఆర్ 58.26 సెకన్లతో రెండవ స్థానంలో, అశ్విని ఆర్ 1 నిమిషం 2.41 సెకన్లతో మూడవ స్థానంలో నిలిచారు. కేరళలో జరుగుతున్న నేషనల్ ఫెడరేషన్ సీనియర్ అథ్లెటిక్స్ కాంపిటీషన్-2025లో భాగంగా పోల్‌వాల్ట్ క్రీడలో సరికొత్త జాతీయ రికార్డు నమోదైంది. పురుషుల విభాగంలో మధ్యప్రదేశ్‌కు చెందిన దేవ్‌కుమార్ మీనా 5.35 మీటర్లు ఎత్తుకు దూకాడు. తద్వారా గతంలో తన పేరిటే ఉన్న (5.32 మీటర్ల) రికార్డును బ్రేక్ చేసి స్వర్ణం సాధించాడు. ఈ పోటీలలో తమిళనాడు అథ్లెట్లు గౌతమ్ (5.15 మీటర్లు), రీగన్ (5.10 మీటర్లు) వరుసగా రజతం, కాంస్యం గెలుచుకున్నారు. పురుషుల 400 మీటర్ల హర్డిల్స్‌లో యశస్ పలాక్ష 49.32 సెకన్ల వ్యక్తిగత అత్యుత్తమ సమయంతో స్వర్ణం సాధించాడు. పురుషుల హ్యామర్ త్రోలో దమ్నీత్ సింగ్ 68.30 మీటర్లు దూకి స్వర్ణం గెలుచుకోగా, ప్రవీణ్ కుమార్ రజతం, గుర్దేవ్ సింగ్ కాంస్యం సాధించారు. మహిళల ట్రిపుల్ జంప్‌లో నిహారిక వశిష్ట్ 13.49 మీటర్లు దూకి స్వర్ణం సాధించింది.

# పాక్ సూపర్ లీగ్‌లో న్యూజిలాండ్ విధ్వంసకర వీరుడి హవా

## పాక్ ప్లేయర్‌ను సొంత అడ్డాలో నిలదీత

**న్యూఢిల్లీ:** న్యూజిలాండ్ విధ్వంసకర వీరుడు కొలిన్ మున్రో ప్రస్తుతం పాకిస్థాన్ సూపర్ లీగ్-2025 ఆడుతున్నాడు. ఈ లీగ్‌లో అతను డిఫెండింగ్ ఛాంపియన్ ఇస్లామాబాద్ యునైటెడ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. లీగ్‌లో భాగంగా జరిగిన మ్యాచ్‌లో ఇస్లామాబాద్ ముల్తాన్ సుల్తాన్స్‌తో తలపడింది. ఈ మ్యాచ్లఓ ఇస్లామాబాద్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపులో మున్రో కీలకపాత్ర పోషించాడు. 28 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 45 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్‌లో మున్రో ఆటతీరుతో కాకుండా వార్తలో ప్రముఖంగా నిలిచాడు. మున్రో బ్యాటింగ్ చేస్తుండగా సుల్తాన్స్ బౌలర్ ఇఫ్తికార్ అహ్మద్‌తో గొడవ జరిగింది. ఇన్నింగ్స్ 10వ ఓవర్ మూడో బంతిని ఇఫ్తికార్ బ్లాక్ హోల్‌లోకి వేయగా, మున్రో దాన్ని విజయవంతంగా అడ్డుకున్నాడు. అయితే ఇఫ్తికార్ చక్ (చట్ట విరుద్ధమైన బౌలింగ్ శైలి) చేస్తున్నాడని మున్రో ఆరోపించాడు. దీంతో ఒక్కసారిగా సహనం కోల్పోయిన ఇఫ్తికార్ మున్రో వైపు దూసుకొచ్చి ఏదో అన్నాడు. దీనికి మున్రో కూడా ధీటుగానే సమాధానం చెప్పాడు. చకింగ్ చేస్తున్నావని చెప్పడంలో తప్పేముందని నిలదీశాడు. మధ్యలో సుల్తాన్స్ కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్ జోక్యం చేసుకున్నాడు. అతను కూడా మున్రోతో వాగ్వాదానికి దిగాడు. దీంతో మైదానంలో కొద్ది సేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చివరకు అంపైర్ల జోక్యంతో పరిస్థితులు చక్కబడ్డాయి. లీగ్ వారిదే కావడంతో మున్రో చేసేదేమీ లేక బ్యాటింగ్‌ను కొనసాగించాడు. ఛేదనలో తన జట్టు విజయానికి మంచి పునాది వేసి ఔటయ్యాడు. అండ్రీయస్ గౌస్ (80 నాటౌట్) చివరి వరకూ క్రీజ్‌లో ఉండి ఇస్తామాబాద్‌ను విజయతీరాలకు చేర్చాడు. ఈ మ్యాచ్‌లో ఇఫ్తికార్ 2 ఓవర్లు వేసి వికెట్ లేకుండా 20 పరుగులు సమర్పించుకున్నాడు.



# ఆరెంజ్ ఆర్మీ దారుణ ప్రదర్శన

## అద్భుతం జరిగితేనే ప్లే ఆఫ్స్

## బలహీనంగా మారిన బలమైన బ్యాటింగ్

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2025 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ దారుణ ప్రదర్శన కొనసాగుతోంది. ముంబై ఇండియన్స్‌తో 23ఏ ఉప్పల్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా విఫలమైన ఆరెంజ్ ఆర్మీ 7 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఇది సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఆరో ఓటమి. హాట్ ఫేవరేట్‌గా, డిఫెండింగ్ రన్నరప్‌గా ఈ సీజన్ బరిలోకి దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్ చెత్త ప్రదర్శనతో దాదాపుగా ప్లే ఆఫ్స్ రేసు నుంచి తప్పుకుంది. అద్భుతం జరిగితే తప్పా ఆరెంజ్ ఆర్మీ ప్లే ఆఫ్స్ చేరలేదు. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 286 పరుగుల రికార్డ్ స్కోర్ నమోదు చేసి భారీ విజయంతో ఈ సీజన్‌ను ఘనంగా ప్రారంభించిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. ఆ తర్వాత లక్నో సూపర్ జెయింట్స్, ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, గుజరాత్ టైటాన్స్ చేతిలో ఘోర పరాజయాలను చవిచూసింది.

పంజాబ్ కింగ్స్‌తో 246 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి రెండో విజయాన్ని ఖాతాలో వేసుకున్న ఆరెంజ్ ఆర్మీ.. అనంతరం ముంబై ఇండియన్స్‌తో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓటమిపాలైంది. ఇప్పటి వరకు 8 మ్యాచ్‌లు ఆడి 6 పరాజయాలతో పాయింట్స్ టేబుల్‌లో 9వ స్థానంలో కొనసాగుతోంది. లీగ్ దశలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఇంకా 6 మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ప్లే ఆఫ్స్ చేరాలంటే సన్‌రైజర్స్ ఈ 6 మ్యాచ్‌లకు 6 గెలవాలి. అప్పుడే 16 పాయింట్లతో టోర్నీలో ముందడుగు వేయగలదు. ఈ 6 మ్యాచ్‌ల్లో ఒక్క మ్యాచ్ ఓడినా ప్లే ఆఫ్స్ అవకాశాలు సంక్లిష్టంగా మారుతాయి. ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. సన్‌రైజర్స్ నెట్ రన్‌రేట్ (-1.361) కూడా దారుణంగా ఉంది. కాబట్టి తదుపరి 6 మ్యాచ్‌ల్లో విజయం సాధించడమే కాకుండా నెట్ రన్‌రేట్ కూడా మెరుగుపర్చుకోవాలి. మరో రెండు మ్యాచ్‌ల్లో ఓడితే మాత్రం సన్‌రైజర్స్ హైదరాబాద్ అధికారికంగా ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమిస్తోంది. ఇక సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ తదుపరి మ్యాచ్‌ల్లో చెన్నై సూపర్ కింగ్స్‌తో ఈ నెల 25న, గుజరాత్ టైటాన్స్‌తో మే 2న, ఢిల్లీ క్యాపిటల్స్‌తో మే 5న, కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో 10, రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరుతో 13న, లక్నో సూపర్ జెయింట్స్‌తో మే 18న ఆడనుంది.

ఇందులో రెండు మ్యాచ్‌లు మాత్రమే హైదరాబాద్ ఉప్పల్ మైదానంలో ఉన్నాయి. ఈ 6 మ్యాచ్‌ల్లో సన్‌రైజర్స్ విజయం సాధించాలంటే అద్భుత ప్రదర్శన కనబర్చాలి. ఇక సన్‌రైజర్స్ ప్రధాన బలమైన బ్యాటింగే బలహీనంగా మారింది. ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, నితీష్ కుమార్ రెడ్డి ఘోర వైఫల్యం సన్‌రైజర్స్ విజయవకాశాలను దెబ్బతీస్తోంది. పరిస్థితులతో సంబంధం లేకుండా బ్యాట్‌ను ఊపుతూ సన్‌రైజర్స్ బ్యాటర్లు మూల్యం చెల్లించుకుంటున్నారు. జట్టులో ఒక్క స్ట్రోక్ మేకింగ్ బ్యాటర్ లేకపోవడం బలహీనతగా మారింది. పేలవ బ్యాటింగ్‌కు తోడు చెత్త బౌలింగ్ జట్టుకు తీవ్ర నష్టం చేస్తోంది. స్పెషలిస్ట్ స్పిన్నర్ లేకపోవడం, అనుభవం కలిగిన మహమ్మద్ షమీ తేలిపోతుండటం, సిమర్జిత్ సింగ్, ఉనాద్కత్, ఇషాన్ మలింగా వంటి బౌలర్లపై నమ్మకం ఉంచే పరిస్థితి లేకపోవడం సన్‌రైజర్స్ కష్టాలను రెట్టింపు చేస్తోంది.

# వాణిజ్యం

# సెన్సెక్స్, నిఫ్టీ లాభాలకు బ్యాంకింగ్ బ్రేక్

**ముంబై, ఏప్రిల్ 24:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల వరుస లాభాలకు బ్రేక్ పడింది. అంతర్జాతీయ మార్కెట్ల బలహీన సంకేతాలు, లాభాల స్వీకరణకు ఇన్వెస్టర్లు మొగ్గు చూపడం వంటి కారణాలతో సూచీలు నష్టాలు చవిచూశాయి.



బ్యాంకింగ్ స్టాక్స్‌లో అమ్మకాలు కొనసాగగా, విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు, అమెరికా చైనా మధ్య వాణిజ్య ఘర్షణలు తగ్గుముఖం పట్టడంతో సూచీలు మోస్తరు నష్టాలకు పరిమితమయ్యాయి. మొత్తానికి సూచీల ఏడు రోజుల లాభాల ర్యాలీకి బ్రేక్ పడింది. సెన్సెక్స్ మళ్లీ 80వేల మార్కు దిగువకు చేరింది.

సెన్సెక్స్ ఉదయం 80,058.43 (క్రితం ముగింపు 80,116.49) వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 79,724.55 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ చివరికి 315 పాయింట్ల నష్టంతో 79,801.43 వద్ద ముగి సింది. నిఫ్టీ సైతం 82 పాయింట్ల నష్టంతో 24,246 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 17 పైసలు బలపడి రూ.85.28గా ఉంది. హిందుస్థాన్ యూనిలీవర్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎటర్నల్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, టాటా మోటార్స్, టెక్ మహీంద్రా, సన్‌ఫార్మా షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 66.47 డాలర్ల వద్ద కొసాగగా, బంగారం ఔన్సు 3,344 డాలర్ల వద్ద ట్రేడయింది.

# 7.39 లక్షల మందికి కొత్తగా ఇపిఎఫ్ఓ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 24:** ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ ఇపిఎఫ్ఓ సామాజిక భద్రతా పథకం కిందకు ఫిబ్రవరి నెలలో నికరంగా రూ.16.10 లక్షల మంది సభ్యులు చేరారు. 2024 ఫిబ్రవరి నెలలో సభ్యుల నికర చేరికతో పోలిస్తే 4శాతం ఎక్కువ మందికి ఉపాధి లభించినట్లు ఇపిఎఫ్ఓ పేరోల్ గణాంకాలు తెలియచేస్తున్నాయి. ఇందులో 7.39 లక్షల మంది కొత్తగా చేరారు. పెరుగుతున్న ఉపాధి అవకాశాలు, ఉద్యోగుల ప్రయోజనాలపై విస్తృతమవుతున్న అవగాహన, ఇపిఎఫ్ఓ అవగాహన కార్యక్రమాలు కొత్త సభ్యుల చేరిక పెరిగేందుకు కారణమని కార్మిక శాఖ తన ప్రకటనలో పేర్కొంది. కొత్త సభ్యుల్లో 4.27 లక్షల మంది 18-25 యేళ్ల వయసు నుంచి ఉన్నారు. మొత్తం కొత్త సభ్యుల్లో వీరి వాటాయే 58 శాతంగా ఉంది. అంటే సంఘటిత రంగంలో వీరు మొదటిసారి ఉపాధి పొందినట్లు తెలుస్తోంది. సుమారుగా 13.18 లక్షల మంది సభ్యులు ఒక సంస్థను వీడి మరో సంస్థలో చేరిపోయారు. గతేడాది ఇదే నెలలో పోల్చి చూస్తే 12శాతం పెరుగుదల నమోదైంది. పాత ఖాతాను మూసివేయకుండా, కొత్త సంస్థకు బదిలీ చేసుకున్నారు. ఫిబ్రవరిలో ఇపిఎఫ్ఒలో నికరంగా చేరిన సభ్యుల్లో 3.37 లక్షల మంది మహిళలు కావడం గమనార్హం. 2024 ఫిబ్రవరి గణాంకాలతో పోలిస్తే 9.23శాతం పెరుగుదల నమోదైంది. ఇందులో 2.08 లక్షల మంది కొత్తగా చేరారు. 2024 ఫిబ్రవరితో పోలిస్తే కేవలం 1.26 శాతమే పెరిగింది. అత్యధికంగా మహారాష్ట్ర నుంచి ఫిబ్రవరిలో 20.90 శాతం సభ్యులు నికరంగా చేరారు. ఆ తర్వాత తమిళనాడు, కర్ణాటక, గుజరాత్, హర్యానా, ఢిల్లీ, తెలంగాణ, యుపి నుంచి 5శాతానికిపైన సభ్యులు నమోదయ్యారు. ఫిష్ ప్రాసెసింగ్, నాన్ వెజిటేరియన్ ఆహార కేంద్రాలు, సొసైటలు, క్లబ్‌లు, స్వీపింగ్‌సేవల్లో సభ్యుల చేరిక పెరిగింది. ఎగుమతి సేవల్లో సభ్యుల చేరిక 41.72శాతంగా ఉంది.

# ప్రభుత్వ బాధ్యతల నుంచి మస్క్ వెనక్కి



**వాషింగ్టన్, ఏప్రిల్ 24:** ప్రపంచ కుబేరుడు, దిగ్గజ వ్యాపారవేత్త ఎలాన్ మస్క్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాలనతో చేపట్టిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డోజ్)లో తన ప్రమేయాన్ని గణనీయంగా తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. డోజ్‌కు కేటాయిస్తున్న సమయాన్ని వచ్చే నెల నుంచి తగ్గించబోతున్నట్లు చెప్పారు. టెస్లాపై దృష్టిసారించాలనే ఉద్దేశంతో వారానికి ఒకటి నుంచి రెండు రోజులు మాత్రమే డోజ్‌కు సమయం కేటాయిస్తానని మస్క్ పేర్కొన్నారు. టెస్లాపై దృష్టిసారిస్తూ అధిక సమయం దానికే కేటాయించబోతున్నట్లు మస్క్ తీసుకున్న నిర్ణయంపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఎలాన్ మస్క్ డోజ్ బాధ్యతలకు అధిక సమయం కేటాయించనప్పటికీ ట్రంప్ మస్క్‌పై ప్రశంసలు కురిపించారు. ఈ మేరకు అమెరికాలోని ఓవల్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేసిన సందర్భంగా మస్క్ తెలివి తేటలు, దేశభక్తిని కొనియాడారు. ఫెడరల్ సంస్కరణల్లో ఆయన చేసిన కృషిని సమర్థించారు. 2025 మొదటి త్రైమాసికంలో టెస్లా లాభాలు 71శాతం క్షీణించాయి. మస్క్ సంపద తగ్గడానికి తాను వ్యాపారాల్లో పెరుగుతున్న రాజకీయ ప్రమేయమే కారణమని తెలుస్తోంది. ట్రంప్ ఎన్నికల ప్రచారానికి మస్క్ భారీగా ఖర్చుచేశారు. దీంతో అమెరికా కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ అధిపతిగా బాధ్యతలు స్వీకరించారు.

# ఆపిల్, మెటాలపై 'ఇయు' భారీ జరిమానా..

**వాషింగ్టన్, ఏప్రిల్ 24:** ఆపిల్, మెటాపై ఐరోపా సమాఖ్య వేసిన భారీ జరిమానాను అమెరికా అధ్యక్ష కార్యాలయం వైట్‌హౌస్ తీవ్రంగా ఖండించింది. ఇదో కొత్తరకం దోపిడీ అని ఆగ్రహం వ్యక్తంచేసింది. అమెరికా కంపెనీలను లక్ష్యంగా చేసుకుంటే సహించబోమని హెచ్చరించింది. అమెరికన్ కంపెనీలను ప్రత్యేకంగా లక్ష్యం చేసుకొని, బలహీనపరిచే, ఆవిష్కరణలను అణచివేసే, సెన్సార్ షిప్‌ను అనుమతించే చర్యలను ప్రత్యక్ష ముప్పుగా పరిగణిస్తాం అని పేర్కొంది. ఆపిల్, మెటాపై ఐరోపా సమాఖ్య నియంత్రణ సంస్థలు భారీ జరిమానా విధించాయి.



యాపిల్‌పై 500 మిలియన్ యూరోల (దాదాపు రూ.5,000 కోట్లు) అపరాధ రుసుమును యూరోపియన్ కమిషన్ విధించింది. యాప్ స్టోర్‌కు వెలుపల, తక్కువ ధర ఉండే ఆప్షన్లకు వెళ్లకుండా యాప్ తయారీదార్లను ఆపిల్ అడ్డుకుంటోందనే కారణంగా ఈ నిర్ణయం తీసుకుంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వినియోగదార్లను వ్యక్తిగతీకరించిన ప్రకటనలు చూడడం లేదా వాటిని చూడకుండా ఉండడానికి డబ్బులు చెల్లించేలా బలవంతం చేసినందుకు మెటా ప్లాట్‌ఫామ్స్‌పై 200 మిలియన్ యూరోల(సుమారు రూ.2000 కోట్లు) జరిమానా వేసింది. 60 రోజుల్లోగా యాపిల్, మెటా సంస్థలు యూరోపియన్ కమిషన్ నిర్ణయాలు అమలుచేయాలి. ఈయూ కూటమిపైనా ట్రంప్ సుంకాల మోత మోగించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతానికైతే 90 రోజుల విరామం ప్రకటించారు. అమెరికా విధించిన సుంకాలు అన్యాయంగా ఉన్నాయని, నష్టదాయక మైనవని ఈయూ భావిస్తోంది. దీనివల్ల ఇరువైపులా మాత్రమే కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సైతం ముప్పు వాటిల్లుతుందని యూరోపియన్ కమిషన్ పేర్కొంది. తాము ఆశించినట్లుగా ఇరుదేశాల మధ్య న్యాయమైన రీతిలో చర్చలు జరిగితే.. ప్రతీకార చర్యలను ఎప్పుడైనా నిలిపివేసే అవకాశం ఉంటుందని గతంలో తెలిపింది. ఈ నేపథ్యంలో ఈయూ జరిమానా, వైట్‌హౌస్ హెచ్చరికలు చోటు చేసుకున్నాయి.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps